తానాజీ సింహగడను పట్టుకొనుట.

సింహగడమును మొగలుల యొద్దనుండి లాగుకొనుటకు తానాజీ మాలుశూరేను శివాజీ నియోగించెను. ఈకోట, చుట్టును నిలువుగ నెక్కుటకు వీలులేని దాదాపు నొక యరమైలెత్తుగల కొండల మధ్యకట్టఁబడియుండెను. త్రిభుజాకారంబు కలిగి లోపల రెండుమైళ్ల విస్తీర్ణముతో చుట్టును రాతిగోడతో కట్టఁబడి యుండెను. సాధారణముగ ద్వారమున గాక మరియొక విధముగ లోపలికిఁ జొర నసాధ్యముగనుండెను. ఈకోటబురుజులనుండి, గాలినిర్మలముగనున్న సమయమున, తూర్పున మనోహరమగునీరోపాంతమును ఉత్తరమున శివాజీ యొక్క బాల్యయౌవన క్రీడాలవాలంబగు పూనాపట్టణముగల విశాలసమదేశంబునుఁజూడవచ్చును. ఇక దక్షిణమునను పడమటను మితిలేని నగసమూహంబులు నృత్యంబు సేయుచున్నట్లుండును. ఆభాగములో రాయగడకలదు. అచ్చటనుండి తానాజీమాలుశూరే 1000 మంది మావలీశూరులను వెంటఁదీసికొని సింహగడమును పట్టుకొనఁ బయలుదేరెను. ఈవేయిమందియు చీలిపోయి వేఱువేఱుమార్గంబుల నవలంబించి మాఘబహుళనవమినాఁడు సింహగడము దగ్గరఁగలసికొనున ట్లేర్పరుచుకొనిరి. అట్లుచేరుకొనిన వేయిమందిని తానాజీ రెండుభాగములుగవిడఁదీసి యొకభాగమును దూరముగ కొండక్రింద దాగి యుండఁబంచి యవసరమైన యెడల రావలసినదని యాజ్ఞాపించి తక్కిన 500 మంది తోడను, ఎక్కుటకు బహుకష్టమైన వైపునకుఁబోయి యచట కోటవారి కనుమానము తగులకుండ రహస్యముగ నెక్కుటకు ప్రయత్నముచేసెను. వారిలో నొకఁడు ముందెక్కి త్రాడునిచ్చెనను క్రిందకు జారవిడిచెను. దానిబట్టుకొని ఒక్కరొకరుగ పైకెక్కి దాగుకొనుచుండిరి. 300 మంది యెక్కినప్పటికి కావలిసైన్యమునందు మెలకువగలిగి యొకఁడుచూచుట కా చాయలకు వచ్చెను. వాని ప్రశ్నల కొక్క తీవ్ర నారాచంబుచే మావలీభటుఁడొకఁడుప్రత్యుత్తరమిచ్చెను. కాని యింతలో కావలిసైన్యమునందు కలవర మెక్కువయ్యెను. ఆమనుజుల ధ్వనివచ్చు స్థలంబులకు మావలీలు నిశ్శబ్దముగ శరవర్షంబు గురిపించుచుండిరి. ఇంకను తానాజీ భటులను పై కెక్కించుచుండెను. ఇంతలో కోట కావలివారలగు రాజపుత్రులు

ఆయుధపాణులై శత్రువులఁదాకిరి. తీక్ష్ణమైన ద్వంద్వయుద్ధము జరిగెను. ఇరు పక్షములందును శౌర్యమునందు తీసిపోవు వారు లేరైరి. మావలీలు శౌర్యమధ్యమున పట్టుకొనఁ బడినవారై, యెక్కువ సంఖ్యాకులగు రాజపుత్రులచే నెదుర్కొనఁబడినను వెనుదీయనివారై జగడంబు సలిపిరి. కొంతసేపటికి తానాజీ వీరశయనము నొందెను. అంతట మహారాష్ట్రు లధైర్యపడి వెనుకకు పరువిడఁ జొచ్చిరి. కాని యంతలో తానాజీతమ్ముడగు సూర్యాజీ తక్కినమూలబలంబుతో కూడవచ్చి రణరంగమందు నిలిచి కాందిశీకులను పురికొల్పుచు 'మీ బాబు శరీరమును మాలవాండ్రచే గోతిలో పడవేయించెదరే? నిచ్చెన త్రాళ్లు కోసివేయఁ బడినవి. శివాజీయొక్క మావలీలని జూపించుటకు సమయమువచ్చినది' అనిచెప్పి ముందుకు నడచెను. ఈవీరవాక్యంబులును, తానాజీమరణమును, స్నేహితుల రాకయు, నాయకుడు మఱియొకడుండుటయు, మావలీల నెదురులేని యాత్మ నిశ్చయముతో ముందుకుఁద్రిప్పెను. 'హరహరమహాదేవ' అను వారిరణోత్సాహ నాదము ఆదుర్గంబున ప్రతిధ్వనించెను. కొంతసేపటిలో కోట స్వాధీనమాయెను. 500 రాజపుత్రవీరులు తెల్లవారు నప్పటికి రణరంగమున నాయకునితోఁ గూడ దీర్ఘనిద్రఁ జెందిరి. మావలీలును 300 వఱకు రణభూమి నలంకరించిరి. కొందఱు రాజపుత్రులు లోఁబడిరి. కాని యనేకమంది, కోటనుండి క్రిందికి దుమికి ప్రాణంబులు గోల్పోయిరి కోట జయింపఁబడెననుట కానవాలుగ కొన్ని పూరిండ్లు తగుల బెట్టఁబడెను. శివాజీయు, తానాజీ పరలోకగతుఁడయ్యెనని విని, కోటగెలిచినందుకు తనమంత్రులచే సన్మానింపఁబడగ నతడు ఖిన్నుడై యిట్లు చెప్పెను. 'గుహలభించెను కాని సింహము లేదాయెను. కోటను జయించితినిగాని హా! తానాజీని పోగొట్టుకొంటిని'.

శివాజీ సాధారణముగ నెప్పుడును మావలీలకు సొమ్ము బహుమతులియ్యక పోయినను నేడుమాత్రము ప్రతిభటునకును వెండి మురుగులుబహుమతి చేసెను. ఉద్యోగస్థులకుఁగూడ తగిన బహుమతులిచ్చెను. సూర్యాజీని కోట కధిపతిగ నియమించెను.

తరువాత పురందరు కోటఁగూడ సూర్యాజీ పట్టుకొనెను. జూను నెలాఖరుకు కళ్యాణప్రాంతమంతయు జయింపఁబడెను. శివాజీ స్వయముగ జంజీరాను పట్టుకొనుటకు ముట్టడిని నడపించెను. 1661 సం॥ము నుండియు ప్రతి సంవత్సరమును ఫిరంగు లెక్కించబడుచుండెను. ఈ సంవత్సరము దాని నెటులైన సాధింపవలెనని యాపత్తు బలము నుపయోగించెను. ఇంతేఁగాక పత్తే ఖానున కితర వాగ్దానములు కూడ నతఁడు బంపెను. పత్తేఖాను లోఁబడుట కుద్యుక్తుఁడయ్యెను. కాని యందు మఱిమువ్వురు అబ్సీనియనులు సిద్దీ సంభోలు, సిద్దీ యాకూటు, సిద్దీ ఖైరు అనువార లందుకు సమ్మతింపక వేఱుగ కుట్రచేసి, పత్తేఖానును ఖైదుచేసి సూరతులోని మొగలు గవర్నరును సహాయ మడిగిరి. సూరతు గవర్న రందు కంగీకరించి, ఔరంగజేబుయొక్క యామోదమును తెప్పించి, సిద్దీ యాకూటును యాకూటుఖాను నామముతో జంజీరా కధిపతిగ స్థిరపఱిచెను.

ఈ అక్టోబరు నెలలో శివాజీ రెండవసారి 15000 మందితో సూరతు ప్రవేశించి మూఁడుదినము లవిచ్ఛిన్నముగ కొల్లపెట్టెను. సంవత్సరమునకు 12 లక్షల ధనమును కప్పముగా నియ్యవలసినదని యా పట్టణజనుల కాజ్ఞయిచ్చి తాను బరహాంపురమునకు తిరిగెను. మార్గమధ్యమందు దావూదుఖాను అను మొగలు సైన్యాధిపతి యడ్డము వచ్చెను. శివాజీయు తన సైన్యమును నాలుగైదు భాగములుగ చేసి యొక భాగమునకు ధనమప్పగించి రాయగడకు పొమ్మని చెప్పి, మఱియొక భాగమును మొగలు సైన్యముతో కలహించుచుండ నియమించి, మఱి రెండు భాగములను కొట్టవచ్చినట్లు బెదిరింప నియమించి శత్రువులయొక్క దృష్టిని చీకాకు పఱచెను. ధనము సురక్షితముగఁ దప్పించుకొనిన తరువాత నన్నిభాగములనుఁ గలిపి సమరంబుసేసి యతఁడు మొగలు సైన్యము నోడించెను.

ప్రతాపరావు 20,000 సైన్యముతో ఖాన్‌దేశమునకుఁ బంపఁబడెను. అచ్చటతఁ డనేక పట్టణములు కొల్లపెట్టి కప్పములఁ గొనెను.
1671 జనేవరి. మోరోపంతు కాల్బలముతో ననేక మొగలు కోటలను పట్టుకొనెను. అందు కౌండ పట్టాసాలేరులు ముఖ్యమైనవి.

శివాజీ యిట్లు జయములఁ బొందుచుండ మొగలు లూరకుండుట చోద్యముగ నుండవచ్చును. అందుకు కారణములు స్పష్టముగ కనుపడుచున్నవి. మొట్టమొదట సుల్తాను మోఅజముకు చాలినన్ని సేనలు లేవు. రెండవది, ఔరంగజేబు చనిపోయిన యెడల కుమారులలో నెవరికెక్కువ సైన్యముండునో వారికి సింహాసనమును, తక్కిన వారికి కారాగారమును సిద్ధమైయుండుట యాచారమై యుండెను. కావున, సుల్తాను మోఅజము సేనల కొరకింకను ఔరంగజేబునకు వ్రాసి తెప్పించుటకే యవకాశము కావలసివచ్చెను. మూఁడవది, ఔరంగజేబును కుమారునకు సేనలను పంపించుట కనుమానించుచుండెను. నాల్గవది, శివాజీతోడి సఖ్యము ముందు సింహాసనము సంపాదింపవలసిన యెడల మంచిదని మోఅజము తలంచి యుండవచ్చును. జస్వంతసింగును శివాజీ యెడల నిష్టుఁడైయుండి మోఅజముచే చక్రవర్తికి సేనల నంపుమని వ్రాయించుచుండెను. చక్రవర్తి వీరందఱి కంటెను గడుసువాఁడై జస్వంతసింగును దర్బారునకు రమ్మని యాజ్ఞయిచ్చి మహబత్ఖానును, 40,000 సైన్యములతో, మోఅజమునకు సంబంధము లేకుండ స్వతంత్రాధిపత్యము నిచ్చి దక్కనుకు పంపెను.

ఈ మహబత్ఖానుఁడు ఔండ పట్టాలను మాత్రము గెలిచి సాలేరును ముట్టడించెను. మోరోపంతును ప్రతాపరావు నీకార్యమందు నియమింపఁబడిరి. వీరిరాక మొగలు సేనాని తెలిసికొనఁగానే ఇక్లాసుఖానును తన సైన్యములో చాలభాగమిచ్చి పంపెను. ఇక్లాసుఖాను ఆతురతతో పోరాడవచ్చుచుండుటఁ జూచి ప్రతాపరావు దగ్గరకు రానిచ్చి పాఱిపోవునట్లు నటించెను. మొగలు సైన్యములు తఱుముకొనవచ్చి చెదరిపోయెను. అటుల చెదరి, శ్రేణులు చెడిపోయిన తోడనే ప్రతాపరావు తిరుగఁబడి వారిని నురుమాడెను. 22 గురు మొగ లుద్యోగస్థులు హతులైరి. మఱి యనేకమంది ఖైదీలయిరి. స్పష్టమైన యపజయము మొగలులకు వాటిల్లెను. మొగలులతో క్రమముగ పోరాడి గెలిచిన గొప్పయుద్ధము శివాజీ దిదియే. సాలేరు ముట్టడి యెత్తివేయఁబడెను. మొగలు సైన్యము ఔరంగాబాదునకు పాఱిపోయెను. ఖైదీలుగ దొరకిన గొప్ప యుద్యోగస్థులందఱును గౌరవముతో చూడఁబడిరి. వారి గాయములు కుదిరిన

తరువాత మర్యాదగ వారివారి యిండ్లకుఁ బంపివేయఁబడిరి. ఇష్టమైనవారు కొందఱు శివాజీయొక్క సేవ నంగీకరించి యచట కొలువుండిరి.

ఉత్తరకొంకణములో నున్న కోలీరాజాలను కొందఱి నోడించి వారిని తనకు లోఁబడునట్లు శివాజీ చేసికొనెను. శివాజీ పోర్చుగీసువారిని సాలసెట్టి ద్వీపమునుండి తఱుముటకు కొంత ప్రయత్నముచేసెను. ఇంగ్లీషువారును బొంబాయియందుండుటవలన కొంతభయపడి తాము వర్తకులమనియు తాటస్థ్యము నవలంబించి యొకరికిని సహాయముగాని హానిగాని చేయమనియు చెప్పి తమకు రాజాపురమునందు శివాజీ కొల్లపెట్టుటచే కలిగిన నష్టమునుమాత్రము ఇప్పించుమనికోరుచు నతనితో సమాధానము చేసికొనిరి.

ఈలోపుగ చక్రవర్తి, మహబత్ఖానును సుల్తాను మోఅజమునుఁ గూడ దర్బారునకు రమ్మని యాజ్ఞాపించి, గుజరాతు గవర్నరగు ఖానుజహాను బహాద్దరును దక్కనుకు యువరాజుగ నియమించెను. ఇతడు శివాజీతో శిక్షావిధానమును మానివేసి, రక్షకవిధానము మాత్ర మవలంబించి యుండెను. శివాజీయు నతనికి మరల చక్రవర్తి సేవకుఁడనయ్యెదనని యాశలుపెట్టుచు నతనితో సఖ్యము చేసికొనెను. బీజపూరుతో యుద్ధము మరల సాగినందున శివాజీ ఖానుజహానుతో నిష్టముగ నుండవలసివచ్చెను.

శివాజీ యీమధ్యను రహస్యముగ గోలకొండకుపోయి యచ్చట చాల కప్పమునుబుచ్చుకొని యాధనమును సురక్షితముగ రాయగడ చేర్చెను. ఇతఁడు గోలకొండకు పోయిన సమయములో సూరతు జింజీరా నావసైన్యములు కలిసి వచ్చి కొంకణతీరమున నున్న పట్టణము లనేకములను పాడుచేసెను. దండా రాజపూరునందు శివాజీకట్టించిన బ్యాటరీలు పాడుచేయఁబడినవి. ఆ ఫిరంగి దళమున కధిపతియైన రఘూబలాలు రణనిహతుఁడయ్యెను. కాని యీనష్టము శివాజీయొక్క గోలకొండయాత్రవలన పూర్తియైనది.

ప్రకరణము. 10.

శివాజీ రాజకీయ జీవనమందు నాల్గవభాగము.

(1672—1680.)

1672 సం॥ డిసెంబరులో బీజపూరు సుల్తాను ఆలీ ఏదులశాహి పక్షవాత రోగముచే చనిపోయెను. ఆయన కొకకుమారు డైదుసంవత్సరముల వాఁడును, పాద్షాబీబీ యను కుమార్తెయు గలరు. తన మృత్యుత్పూర్వంబున సుల్తాను కవాసుఖానును కుమారసుల్తానుకు రక్షకునిగా నియమించెను. సుల్తాను మరణానంతరము దర్బారునందలి మహమ్మదీయ ముఖ్యులందఱును కక్షలుపడి యొకరిమాట నొకరు గౌరవించకుండిరి.

ఇట్టి జీర్ణస్థితియందు మొగలు లొకవైపునను శివాజీ యొకవైపునను బీజపూరును బాధింపఁజొచ్చిరి. పైకక్షిదారు లందఱియొద్దను హిందూయుద్యోగస్థు లుండినందున శివాజీకప్పటి వర్తమానమప్పుడు కరతలామలకముగఁ దెలియుచుండెను.

1673 సం॥ ములో శివాజీ హుబ్లీయను గొప్ప వర్తకస్థలమును కొల్లపెట్టెను. అన్నిజాతుల వర్తకులును నష్టమును పొందిరి. ఈ సామాన్య దురదృష్టములలో నింగ్లీషుఫాక్టోరీయు భాగము పంచుకొనెను. హుబ్లీ రాజాపూరు నష్టములకు ఇంగ్లీషువారు శివాజీ పట్టాభిషేకము వఱకును విజ్ఞాపనలను చేసికొనుచునే యుండిరి. ఈకాలములో నింగ్లీషువారు *తాటస్థ్య మతమునే యవలంబించిరి గాని యే పక్షమునకును చేరలేదు.

శివాజీ యవన సముద్రతీరమున కార్వారు అంకోలా మొదలైన ప్రాంతములను వశము చేసికొనెను. ఇంక నచ్చట నున్న కొందఱు హిందూదేశముఖులను తిరుగఁబాటు చేయఁ బ్రేరేపించెను. బెద్నూరు రాజా యితనికి సామంతుఁ

---

* తాటస్థ్యమత మనగా నేపక్షమును చేరక యుభావముగా నుండుట.

డయ్యెను. బీజపూరునుండి యితఁడు సతారాకోటను పట్టుకొనెను. ఏదులశాహి వంశమునకుపూర్వమాసతారాకోట రాజకారాగారముగ సుప్రసిద్ధమైయుండెను. శివాజీయొక్క వంశీయులును ఇందు ముందు కారాగారనివాసులగుదురని యతఁ డెన్నఁడు నూహించియుండలేదు.

ఈ జయములకును, తిరుగబాటులకు నోర్వలేక అంతవఱకు నుపేక్షగ స్వార్థపరుండైయున్న సుల్తానుయొక్క సంరక్షకుఁడు కవాసుఖాను, అబ్దుల్ కరీమును కొంత సైన్యముతో శివాజీసైన్యములపైపంపెను. ప్రతాపరావు గుజారతనిని బీజపూరునకును మెరిచికిని మధ్యనెదుర్కొనెను. ప్రతాపరావు సైన్యము బీజపూరుసైన్యముకంటె నధికంబగుటవలన నతఁడొకవైపున ఘోరసమరంబు గావించుచు, నింకొకవైపున వారిసామగ్రులనెల్ల నడ్డగించినందున, అబ్దుల్ కరీము సంపూర్ణపరాభవమునొంది యుద్ధవిశ్రమంబుఁ గోరెను. అతఁడు బీజపూరునకు నిరుపద్రవంబుగఁ బోనియ్యబడెను. శివాజీ యిందులకు మిక్కిలి యాగ్రహచిత్తుఁడై ప్రతాపరావును నిందించెను. ప్రతాపరావు అందుకు లజ్జపడి బహుదూరముగ తన సేనలనుఁ గొనిపోయి మఱింత శివాజీ యేర్పాటులకు భంగముచేసినవాఁడాయెను. కాని మరల అబ్దుల్ కరీము యుద్ధసన్నద్ధుఁడై పన్హా

1674 లాను పట్టుకొనుటకు మరుసటి సంవత్సరమువచ్చెను. అతఁడు పన్హాలాసమీపమునకు వచ్చినతోడనే ప్రతాపరావు తిరిగివచ్చి రణరంగమునందు శివాజీయొక్క సదభిప్రాయమును సంపాదించుకొనుటకు నిలచెను. శివాజీయు 'బీజపూరుసేనను కొల్లపెట్టినఁగాని నా సముఖమునకు రావలదని' కబురుపంపెను. ఈసందర్భములన్నిటివలన నతఁడావేశపరవశుండై వేగిరపాటుతోడ బీజపూరుసైన్యములతోఁ గదిసి అనేకమంది భటులతో రణనిహతుడై యోడిపోయెను. కాని యిట్టియవస్థయందు హసాజీమొహితీ యనునతడంతవఱకును మూలబలంబుతో దూరంబుగనుండి యప్పు డాతఱుముకొని వచ్చుచున్న బీజపూరు సైన్యములతో కలబడెను. కాందిసీకులైన మహారాష్ట్రబలములెల్ల మరల వెనుకకు తిరిగిరి. అదృష్టలక్ష్మి కను సన్న ఇచ్చినతోడనే మహారాష్ట్రసైన్యములు కూడుకొనునంత త్వరితముగ నేవియు కూడవు. కావున నీ

చర్యవలన నదివఱకు తఱుమఁబడినవారు తఱుమువారైరి. మహారాష్ట్రుల యప జయము జయముగమారెను. హసాజీ మొహితీయొక్క సైన్యములో, కాంతాజీ ఘోరేపురే ధనాజీ జాధవు అను నిద్దరు యోధులు తమ పరాక్రమంబుఁ జూపించిరి. వీరు తరువాత మహారాష్ట్రి చరిత్రలో ప్రసిద్ధికివచ్చుట మనము చూడఁబోవుదుము. హసాజీ మొహితీయొక్క సామర్థ్యము శివాజీవలన మిక్కిలి కొనియాడఁబడెను. ఇతఁడు హంబీరురావు అను బిరుదుతో ప్రతాపరావుస్థానమున సర్నోబతుగా (సర్వసైన్యాధిపతి) నియమింపబడెను. ప్రతాపరావుయొక్క సేవ మరువఁబడలేదు. ఆతని మరణమునకు శివాజీ మిక్కిలి చింతాక్రాంతుడై అతని బంధువులందఱికిని తగిన యాధారములను గల్పించెను. అతని కుమార్తెను తన రెండవకుమారుడైన రాజారామునకు వివాహము చేసికొనెను. ప్రతాపరావు తరువాత, ఆబాజీసోనదేవుడు పరలోకప్రాప్తుడయ్యెను. శివాజీ యర్హమైన వారసులేనియెడల నే యుద్యోగమును వంశపారంపర్యము చేయలేదు. ఆబాజీ సోనదేవునికుమారుడు రామచంద్రపంతు సామర్థ్యముగలవాఁడు కావున తండ్రి స్థానమున మజుందారుగా నియమింపఁబడెను.

శివాజీ పోండాను ముట్టడించుటకు సూరతులో ఫ్రెంచివారివద్ద కొన్ని ఫిరంగులను కొనెను. కాని యాకోటయందు రంధ్రము చేయఁజాలకపోయెను.

శివాజీ యింతవఱకును నానావిధముల నచ్చొత్తించి, మహారాజా నామంబును ధరించియున్నను, ఇప్పుడు తన స్వతంత్రమునుగూర్చి ప్రకటించుట
1674 యొక్క సార్థక్యమును గుఱించి సద్బ్రాహ్మణులతో నాలోచించుచుండెను. కాశీనుండి గంగాభట్టు అను బ్రాహ్మణుఁడు రప్పింపఁబడెను. రాయగడయందు జూనుఆవతారీఖునకు సరియైనజ్యేష్ఠశుద్ధత్రయోదశివాడు శుభలగ్నంబున నతని పట్టాభిషేక మహోత్సవంబు జరుపఁబడెను. ఇది జరిగిన పక్షము దినములలో, జీజాభాయి తన మనోరథంబు సిద్ధించినదని,కన్నులారఁ జూచి యానందించి, పరలోకంబున కరిగెను. ఆ తల్లియొక్క మహాభాగ్యము వర్ణింపఁ దరముకాదు.

శివాజీయొక్క పట్టాభిషేకసమయమున పూర్వము పారిషీయనులోనున్న యుద్యోగముల నామములు సంస్కృతములోనికి మార్చఁబడెను. శివాజీ మరణానంతరము ఈయుద్యోగనామము లొక్క అష్టప్రధానులు అనునది తప్ప తక్కిన వెవ్వియు వాడుకలో నుంచఁబడలేదు. వారియుద్యోగధర్మములు మాత్రము పూర్వమువలెనేయుండెను. కాని కాల్బలమునకును గుఱ్ఱపుదళమునకొక్క సర్వసైన్యాధిపతియేయుండెను. న్యాయాధీశుపని యుద్ధకైవలనఁగాక యొక్కరివలెనే చూడఁబడుచుండెను. ప్రధానుల నామములును, వారియుద్యోగములయొక్క పూర్వనామములును, ప్రస్తుత నామములు నీక్రిందఁ బొందుపరుపఁబడెను.

పేరు.	పూర్వపుబిరుదు.	ప్రస్తుతపుబిరుదు.
1. మోరోపంతు పింగళే	పేష్వా	ముఖ్యప్రధాను
2. రామచంద్రపంతు బౌరీకరు	మజుందారు	పంతు అమాత్య
3. అన్నాజీదత్తో	సూర్నీసు	పంతు సచీవు
4. దత్తాజీపంతు	వాక్నీసు	మంత్రి
5. హంబీరరావు మొహితే	సర్నోబతు	సేనాపతి
6. జనార్దనపంతు హనుమంతే	దబీరు	సోమంతు
7. బాలాజీపంతు	న్యాయాధీశు	న్యాయాధీశు
8. రఘునాథపంతు	న్యాయశాస్త్రి	పండితరావు

శివాజీ బంగారముతో తులాభారముతూగి బ్రాహ్మణుల కందఱకును పంచిపెట్టెను. అనేకధర్మములు చేయుటచేతను, బ్రాహ్మణులనందఱిని వశముచేసుకొనుటవలనను, అతఁడు రాజపుత్రవంశజుఁడుగా నంగీకరింపఁబడెను. అతఁడు ధరించిన బిరుదు 'క్షత్రియకులావతంస శ్రీరాజాశివ ఛత్రపతి'యై యుండెను.

శివాజీ పురందరు సమాధానము కాలమునుండి బీజపూరు రాజ్యములో ననేకభాగములందు చౌతును వసూలుచేయుచుండెను. కొంకణమంతనుండియు దానిఁబుచ్చుకొనుచుండెను. పోర్చుగీసువారును చౌతు నంగీకరించినట్లు ఎచ్చటను జెప్పఁబడలేదుగాని అనేకసారులు కప్పమునొసంగినట్లు మాత్రము చెప్పఁబడి

యున్నది. ఇంగ్లీషువారు కప్పమిచ్చిన ట్లెక్కడను చెప్పఁబడియుండలేదు. శివాజీపట్టాభిషేకసమయముననింగ్లీషువారుతమకుహుబ్లీరాజాపూరులనుకొల్లపెట్టి నపుడు నష్టమువచ్చినదని చెప్పుకొనగా 10,000 వరహాలు వారికి నష్టపూర్తి క్రింద నిచ్చెను. శివాజీయొక్క వ్యవహారచాకచక్య మిచ్చటకూడఁ గనుపడుచున్నది. శివాజీవారికి రొక్కమియ్యక, ఇంగ్లీషువారు తనయొద్ద 5,000 వరహాల సరకుల చొప్పున మూడుసంవత్సరములు కొని యందు సగము ఖరీదు మాత్రమే యిచ్చి, యట్లు 7,500 వరహాలను రాబట్టుకొన వలసినదనియు, తక్కిన 2,500 వరహాలును రాజాపురమునందు మరల ఫాక్టొరీకట్టుకొనినప్పుడు తానిచ్చునట్లు నేర్పాటు చేసెను.

మోగలు సైన్యములు డిలిరుఖానుని ఆధిపత్యము క్రింద కొన్ని యాక్రమణలు చేసినందున నవి మిషగాఁగొని శివాజీ ఖానుజహానుతో నున్న సంధిని
1675 తెగఁగొట్టి ఔండ పట్టాలను మరల పట్టుకొని యుద్ధంబునకు దొరకొనెను. శివాజీయొక్క జన్మస్థానమగు శివనేరుకోట ముట్టడింపఁబడెను గాని యది యతనివశ మెన్నఁడును కాలేదు.

హాంబీరురావు రెండు మూడు సారులు మోగలు దేశమునఁబడి దోచుకొనెను. అతని సైన్యములో కొంతభాగము భరోచిప్రాంతమునకుపోయి కప్పము వసూలు చేసెను. నర్మదా నదిని దాటి మహారాష్ట్ర సైన్యము ప్రవేశించిన దిదియే ప్రథమ పర్యాయము.

కవాసుఖానుఁడు బీజపూరునందు తనస్థాన మపాయకరముగ నుండుటను జూచి, ఖానుజహాను బహద్దరుతో, బీజపూరును మోగలులకు సామంతరాజ్యముగ నుంచెదననియు, కుమార సుల్తానుయొక్క సోదరియగు పాద్షాబీబీను ఔరంగజేబు కుమారులలో నొకరికి వివాహమున నిచ్చెదననియు సంధిచేసికొనెను. ఇట్లు సుల్తాను కుమార్తెను వివాహమున నిచ్చి సంధిచేసికొనుట బీజపూరు వాసుల కనేకుల కవమానముగ నుండెను. కావున అబ్దుల్ కరీమును మరికొందఱు మహమ్మదీయ ముఖ్యులును కుట్రచేసి కవాసుఖానును రహస్యముగఁ జంపించిరి. అబ్దులు కరీము కుమార సుల్తానుకు సంరక్షకుఁడుగ నేర్పడి మోగలులతో యుద్ధ

మునకు సన్నాహంబుగ శీఘ్రంబుగఁ జేసెను. ఖానుజహాను బహాద్దరు దండెత్తి వచ్చెను. అనేక పోరాటములందు బీజపూరునకే యనుకూలము లయ్యెను. డిలిరుఖాను తన దేశీయుఁడగు నబ్దులు కరీము యెడల పక్షముగలవాఁడై మొగలులతో మధ్యవర్తిగనుండి సంధినిఁ గూర్చెను.

శివాజీ మూఁడవపర్యాయము టాటూరా పన్హాలా మధ్యనున్న దేశమును వశము చేసికొనెను. ఆ సమీపమున నున్న జాగీరుదారు లిఁక ముందు తన
1676 దేశములోనికి ప్రవేశింపకుండ నా మధ్య నొక దుర్గశ్రేణిని, ఆరెండు కోటలను గలుపుచు కట్టుటకు శివాజీ యాజ్ఞ యిచ్చెను. వానికి వర్ధనగడ, భూషణగడ, శివదాసగడ, ముకుందగడ యని నామము లిడెను. ఇవి యంత బలమైన దుర్గములు కాకపోయినను ఆవి చుట్టియున్న ఫలవంతమైన దేశమును రక్షించుట కెంతయు నుపయుక్తములై యుండెను. ఈ యేర్పాటునందు కార్యనిర్వాహకుఁడై యుండ నతఁడు వ్యాధిగ్రస్తుఁడై సతారాయందు అనేక నెలలు విశ్రాంతినుండెను. ఈ కాలమునం దతఁడు హిందూ ధర్మచోదితంబైన యనేక వ్రతంబుల నత్యంత నిష్ఠతో సలిపెను. ఈ సమయములోనే తన జీవితముయొక్క గొప్ప దండయాత్ర నతఁడు మనసునందు చింతించుచుండెను. తక్కిన రాజ్యంబులతో ముందుగఁ జేసికొనిన యేర్పాటులును, అతని మనోదృష్టి వ్యాపించిన విశాలరంగంబును, వివేక సాహసముల యైక్యంబును, యద్భుతకార్య సాఫల్యంబును, ప్రసిద్ధమైన యీ దండయాత్రయందు వెలయుచున్నవి గాన దానిని లెస్సగ గ్రహించుటకు అప్పటి దక్కను రాజ్యముల స్థితిని కొంచెము వర్ణింప నవసరమై యుండును. అటుతరువాత కథాసూత్రంబు ననుగమింతము.

ఔరంగజేబు ఇంతవఱకును ఉత్తరమున తన రాజ్యవ్యవహారములు చక్కఁబఱచుకొనుచుండిన దక్కను రాజ్యముల నన్నిటిని తన సామ్రాజ్యమునఁ గలుపుకొను నుద్దేశము మఱువలేదు. కాని యెవ్వరికిఁగాని యీ కార్యమును సాధించుటకు తగినంత సేనను నమ్మియియ్యడు. కావున నా రాజ్యముల నన్నిఁటిని శిథిలముచేసి యెప్పుడో తనకు విశ్రాంతి కలిగినపుడు స్వంతముగ జయింప వలెనను పద్ధతిప్రకారము వ్యవహారములను నడుపుచుండెను.

ఖానుజహాను బహాద్దరు దక్కను జయింప సమర్థుఁడుగాడు. అయిన నత నికి కావలసిన సైన్యమును చక్రవర్తి యిచ్చియుండలేదు. మహారాష్ట్రులవలన ననేక సారులు మొగలు లోడింపఁబడినందున నది వారికి మఱింత ప్రోత్సాహ కరమయ్యెను. ఇట్టి యవస్థలో బీజపూరు గోలకొండలు కూడ శివాజీతో కలి యుట సహజమే. కాని ఔరంగజేబుయొక్క తంత్రాంగములవలన వారి దర్బారులలో నైకమత్యములేకుండెను.

శివాజీయొక్క సాహసకృత్యములును, దూరదండయాత్రలును, చక్ర వర్తికి కోపకారణములైనను, ఇంకను నతనియెడలనున్న యులుసుదనము చక్ర వర్తికిపోలేదు. అంతేకాక యతఁడు బీజపూరు గోలకొండలపైఁ జేయుచున్న దౌర్జన్యములు చక్రవర్తి కనుకూలముగనే పరిగణింపఁబడుచుండెను. ఈ యా లోచనలో ఖానుజహానుగూడ నుండెను. ఇదిగాక శివాజీకూడ, ఖానుజహానును ధనరూపమున గౌరవించుచుండెనను వాడుకగలదు.

బీజపూరులో కవాసుఖానునుఁ జంపించినను అబ్దుల్ కరీము మాత్రము మొగలులయొద్దనుండి యేలాభమును పొందఁజాలడు. డిలిరుఖానుతో నతనికున్న సంబంధమువలన కొంచెము శాంతిని సంస్థానమునకు తత్కాలమునకుమాత్రము సంపాదించెను. బీజపూరులో మొగలు కక్షివారు సుల్తాను సంరక్షకుడైన యిత నియెడల విరోధమును బూనియేయుండిరి. అతఁడు ఔరంగజేబుతోకంటె శివాజీతో సఖ్యముగ నుండుట యెక్కువ మేలుగ నుండెను. ఔరంగజేబు యొక్క రాయభారులు యుద్యోగస్థులందఱికిని కలహములు పెట్టుచుండిరి.

గోలకొండలో అబ్దుల్ కుతుబ్శాహి 1672 సం ॥ మున చనిపోయెను. ఆయన తమ్మునికుమారుఁడును దగ్గరవారసుడైన అబూహుస్సేను సింహాసన మెక్కెను. ఈతడే తానీషాయని తెలుగుగ్రంథములందు భద్రాద్రి రామదాసు చరిత్రలో సంబంధించి ప్రసిద్ధికెక్కిన సుల్తాను. ఈతఁడు యౌవనమందు బుద్ధి బలములేనివాడుగను, భోగపరాయణుండుగ నుండినను, సింహాసన మధిష్ఠించిన తరువాత మాదన్న అక్కన్న పంతులుల సహాయమువలన సమర్థతో రాజ్య మేలెను.

రఘునాథనారాయణుఁడు షాజీచే నతనితండ్రియగు నారూపంతు స్థానంబున నియమింపఁబడిన ట్లిదివఱకు చెప్పియుంటిమి కాని షాజీ చనిపోయిన తరువాత రఘునాథపంతుయొక్క యుద్దేశములును వెంకాజీయొక్క యుద్దేశములు ననుకూలింపవయ్యెను. రఘునాథపంతు వెంకాజీతో శివాజీయొక్క శౌర్యమును, ఔదార్యమును, జయశీలత్వమును, సింహాసనాధీనమునుగూర్చి ప్రశంసించెను. వెంకాజీ 'మన మనాదినుండి సుల్తానులయొక్క ఉప్పుతిని పెరిగితిమి. మనము స్వతంత్రరాజ్యమునకై యభిలషింప నర్హము కాదు' అని ప్రత్యుత్తర మిచ్చెను. రఘునాథనారాయణుఁడు ప్రాణము విసిగి యతని యుద్యోగమును వదలిపెట్టి ప్రయాణమాయెను. అతఁడు హైదరాబాదునకు పోయి యచ్చట మాదన్నమంత్రితో సఖ్యముచేసెను. అటుపిమ్మట పన్హాలావచ్చి శివాజీకి తాను కాశీయాత్ర పోవుచున్నానని యుత్తరము వ్రాసెను. శివాజీ సంగతినంతయుఁ దెలిసికొని యతనిని తనదర్శనము చేయకుండ బోవలదని ప్రత్యుత్తరము పంపెను. రఘునాథపంతు శివాజీని సతారాయందుండగా గలిసికొనెను. వీరిద్దఱకును హిందూరాజ్యమునింకను మహారాష్ట్రము వెలుపల విస్తరింపఁజేయ వలయునని యుద్దేశము మనసునందుండెను. వీరి కాలములో నది జేయలేకపోయినను, తరువాత వారికిమాత్రము మార్గదర్శకులై చాలవఱకు సాధింపఁబడుటకు కారకులు వీరేయైయుండిరి. శివాజీ తనప్రధానులలో చిన్నవాఁడైన రామచంద్రపంతును తగ్గించి యామజుందారి యుద్యోగము నతనికిచ్చెను. సోమంతప్రధానుఁడగు జనార్దనపంతు హనుమంతీ, రఘునాథపంతుని యన్నగారు.

హిందూధర్మశాస్త్రప్రకారము షాజీయొక్క జాగీరులలో సగభాగమునకు శివాజీకి హక్కుగలదని మిషకల్పింపఁబడెను. బీజపూరువకును మొగలులకును
1676 సంధికలిగినందున, మాదన్నపంతులు శివాజీతో సంధికొడంబడుటకును మంచి సమయముగ నుండెను. అంతేగాక డిలిరుఖాను శివాజీకిని బలవద్విరోధ మవలంబించి యుండెను. కావున మొట్టమొదట శివాజీ తాను ప్రయాణమైపోవుచున్నందున ఖానుజహానుతో సంధిచేసికొనవలసి యుండెను.

శివాజీ ఖానుజహానునకు కొంతబహిరంగముగను, కొంతరహస్యముగను ధనము నిచ్చెను. ఇందు బహిరంగముగ తీసికొనిన దానిని మొగలులు కప్పమని పేరు పెట్టుకొనిరి. శివాజీ యిట్టి స్వతంత్ర యవస్థయందును, దానిని 'పాడియావునకు పెట్టు తెలకపిండి' యని యుపమించి మనస్సమాధానము చేసికొనెను.

తూర్పున క్రొత్తగ కట్టించిన దుర్గశ్రేణి ఘూర్పడే నింబాల్కారు మొదలైన వారియొక్క దండయాత్రల నడ్డుపఱచెను. కొంకణ తీరమున అన్నాజీ దత్తూను బలమైన కావలి సైన్యములతోడను, గొప్ప కాల్బలములతోడను రక్షించుటకు శివాజీ నియమించెను. కళ్యాణ పోండాలకు మధ్య ననేక కోటలుండుటవలన, నే చక్కి శత్రువులు వచ్చినను తత్క్షణము కూడుకొని యెదిరించుటకు వీలుగ నుండెను. మోరోపంతునకు తాను లేనికాలమున శివాజీ ప్రధాన నాయకత్వమిచ్చెను.

1676 సం॥ రాంతమున 30,000 అశ్వసైన్యముతోడను 40,000 పదాతి
వర్గంబుతోడను గోలకొండ దిక్కు శివాజీ బయలుదేరెను. న్యాయాధీశ
1677 పుత్రుఁడైన ప్రహ్లాదపంతు ముందుగ శివాజీయొక్క రాక నాలింగించుటకై గోలకొండ దర్బారునకు పంపఁబడెను. మాదన్నపంతునకు పూర్వమీసంగతి తెలిసియుండినను, హైదరాబాదునందు భయవిస్మయంబులు గలిగెను. మాదన్న పంతు లెదురుగ వచ్చి శివాజీని తోడ్కొనిపోయెను. మరునాఁడు శివాజీ కుతుబ్శాహీలకు సందర్శనము కలిగెను. శివాజీ తనయొక్క వాక్చాతుర్యమువలన, తమ రెండు రాజ్యంబులకును సఖ్యం బవశ్యకమేఁ గాక సహజంబని సుల్తాను నొడంబరచెను. ఈ సమాధానముయొక్క షరతు లేమో స్పష్టముగ తెలియవుగాని, శివాజీ కర్ణాటకమునజయింపఁబోవు దేశములో, షాజీ కిదివరకు చెందియున్నవి గాక తక్కినవి చెరిసగముగ పంచుకొనుటయు, మొగలుల యెడలను, వారి స్నేహితులయెడలను, వీరిద్దరు నేకమై రక్షణకును శిక్షణకు అన్యోన్య సహాయులగుటయు, నా సమాధానముయొక్క ఫలితార్థము కావచ్చును. బీజపూరుయొక్క కర్ణాటక దేశము జయింపఁబడి వీరిద్దఱిచేతను పంచుకొనఁబడిన తరువాత అబ్దులుకరీము మంత్రి

త్వమునుండి తొలగించి అక్కన్న పంతులును ప్రధానిగఁ దీసికొనినయెడల బీజపూరుకూడ నీ సమాధానమునందు చేర్చుకొనఁబడునని కూడ వారాలోచించుకొనిరి. శివాజీ కుదుబ్శాహీనుండి విస్తారధనమును ఫిరంగిదళమునుఁ గూడ తన ప్రయాణమున కిచ్చుట కతని సమ్మతిపఱచెను.

ఇట్లు హైదరాబాదునందు శివాజీ యొకమాసము దినములు గడపి యేర్పాటులు చేసికొని దక్షిణమునకుఁ దిన్నగఁ బ్రయాణమై కర్నూలునకు 25 మైళ్లక్రింద నియరూతీసంగము దగ్గిర కృష్ణానదిని మార్చినెలలో దాటెను.

మార్చి తనసైన్యములు మెల్లగ కడపమార్గమున నడచుచుండ, శివాజీ కొంత యశ్వదళముతో తూర్పుపక్క పోయి శ్రీశైల మల్లిఖార్జునస్వామిని దర్శనము చేసికొనెను. అచ్చటతఁ డనేక పూజావిధానముల సలిపి ఈశ్వరునికి తనను బలి యిచ్చెదనని ఖడ్గంబు తీసి శిరంబు ఖండించుకొన సంసిద్ధుడయ్యెను. అప్పుడు భవానీదేవత ప్రత్యక్షమై యతని నాదారుణ కృత్యంబునుండి యుడిగించెననియు, అతడింకను చేయవలసిన గొప్పకార్యము లున్నవని యతనికి పూని చెప్పెననియు చెప్పుదురు.

అట్లు 12 దినంబు లచ్చట ఈశ్వరారాధనమందు గడపి సైన్యమును గలిసికొని వెంకటరమణగిరి (తిరుపతి) మార్గమున కర్ణాటక పైయనుఘాటీలోనికి దిగెను. పెద్దసైన్యమునంతను వెనుక మెల్లగ రానియమించి శివాజీ తానుమాత్రము కొంతగుఱ్ఱపు దళముతోడను కొందఱు మావలీలతోడను ముందుసాగిపోయెను. మే నెల మొదటివారములో నతఁడు మద్రాసుప్రక్కనుండి పోయెను. జింజీ యతనిస్వాధీనమాయెను. తిరువణ్ణామలలో నధికారియగు షర్ఖాను కొంతయెదిరింపఁ జూచెనుగాని యతఁడు తత్క్షణమే ఖైదీగాచేయఁబడెను. ఇంతకు పూర్వమే శివాజీయొక్క దాసీసోదరుడైన శాంతాజీ యితనినికలిసికొని తండ్రియొక్క పౌరుష ధైర్యములకు కొంతవఱకు వారసయినటులఁ జూపించెను. వెల్లూరుకొంత ముట్టడివడసి లోఁబడెను.

ఈ జయములనుఁ జూచి వెంకాజీ యన్నగారికెదురువచ్చి త్రివేడీ యొద్ద కలిసికొనెను. మొదట అతఁడు కొంతయెదిరింపఁ దలంచెనుగాని యతనికి



వెంకాజీరాజా.

సహాయము చేసెదనన్న మధురనాయకుఁ డతనినుండి విడిపోవునట్లు రఘునాథ నారాయణుఁడు మిత్రభేదము చేసెను. కావున వెంకాజీ లోఁబడక వీలులేక వచ్చెను. శివాజీ యతనిని మిక్కిలి గౌరవముతోఁ జూచెను కాని రాజ్యమునందు సగమిచ్చుటకు మాత్ర మొప్పింపలేకపోయెను. శివాజీయతనిని మొదట ఖైదీగఁ జేయఁదలంచెనుగాని యతఁడు తనంతట తాను చూడవచ్చెనుగాన నతని నట్లు చేయుట సోదరుఁడును రాజునైన తనకు తగదని యోచించి యతనిని తంజావూరు పోనిచ్చెను. శివాజీ తక్కిన యన్ని జిల్లాలను పట్టుకొనఁదలంచినను, తంజావూరునందు సగమును, ఆరణియు నింకకొన్ని కోటలు నిమ్మని రాయభారములింకను చేయుచునేయుండెను. కేవలము దేశముఖీలకు తానుచూచుటలేదనియు, తండ్రియాస్తిని యుంచుకొనుట గౌరవము గనుక కోరుచుంటిననియుఁ కబురులు పంపుచుండెను.

కర్ణాటకగడయు మఱి రెండుకోటలును వశమాయెను. ఆరణికోట కధిపతియగు వేదోభాస్కరుఁడను నతఁ డెదురుగవచ్చి కోటతాళములు సమర్పించెను. అతనినే దుర్గాధిపతిగ శివాజీయుంచెను. షాజీ జాగీరులగు కోలారు, బెంగుళూరు, ఔస్కోటా, బాలపూరు మొదలైనవి శివాజీచే నామఱుసటి సంవత్సరారంభమునకు పూర్వము పట్టుకొనఁబడెను. బీజపూరునకు సంబంధించిన కర్ణాటకమున నెల్ల చౌతు సర్దేశముఖీలు వసూలు చేయఁబడెను.

ఇఁక, దక్కనునందు ఖానుజహాను బహద్దరు శివాజీతో చేసిన సంధికి ఔరంగజే బంగీకరింపలేదు. ఖానుజహాను దర్బారునకుఁ బిలిపింపఁబడెను. కుతుబ్ శాహిపై అబ్దుల్ కరీముతోఁ గలిసి దండెత్తుటకు డిలిరుఖానుఁడు చక్రవర్తికి ప్రస్తావించుచు నుత్తరమువ్రాసెను దీని కంగీకరించి ఔరంగజేబు తనయాజ్ఞ నిచ్చెను. కుతుబ్శాహి శివాజీతో సంధిచేసికొనుట యీ యుద్ధమునకు కారణముగఁ జెప్పఁబడెను. మాదన్నపంతులు రాబోవు తుపాను నెదురుచూచి, బహుళదళంబుఁగూర్చుకొని బీజపూరు మోగలు సైన్యముల నెదురేగి తఱిమికొట్టెను. బీజపూరుసైన్యము చీకాకుపడెను. అనేకమంది సేవను విడిచిపోయిరి. మిగిలినవారు జీతములు ముట్టనందున శిక్షచెడి యల్లరి చేయుచుండిరి. ఇట్టి గంద్రగోళములో

అబ్దులుకరీము వ్యాధిగ్రస్తుఁడయ్యెను. డిలిరుఖాను వివిధకక్షుల వారిని సమాధానముచేయ యత్నించెను. సిద్దిజోహారు అల్లుడును ఆదోని జాగీరుదారుడైన మసావుదుఖానును సంరక్షకునిగా నియమింప నందఱు అంగీకరించిరి. మసావుదుఖాను భాగ్యవంతుఁడు గాన ముఖ్యముగ నతఁడు డిలిరుఖాను అప్పులు తీర్చుటకును, సైనికుల జీతము లిచ్చుటకును వాగ్దానముచేసినందున నీయుద్యోగమునకు నియమింపఁబడెను. ఇంతేగాక యితఁడు కవాసుఖాను జేసిన వాగ్దానప్రకారము, దేశమునందు శాంతిక్రమము లుంచునటులను, శివాజీతో నే సంబంధమును పెట్టుకొనకుండుటకును, అన్నివిషయములందును డిలిరుఖాను సలహాప్రకారము నడచుకొనుటకును, పాద్షాబీబీని మోగలు శిబిరమునకుఁ బంపుటకును, సమ్మతించి చేయుటకు బద్ధుఁడయ్యెను. కాని మసావుదుఖాను కాల్బలముయొక్క దిగఁబడిన జీతములు కొంతవఱకిచ్చి, బీజపూరు వచ్చి చేరినతోడనే అశ్వసైన్యమునకు జీతములియ్యక, వానిని ఉంచుకొనుటకుకూడ నిరాకరించెను. కొందఱు మోరోపంతు సేవలోనికిపోయిరి. మఱికొందఱు మోగలులఁ జేరిరి. బీజపూరు వం దసంతుష్టి యెక్కువాయెను. కాని సంరక్షకుఁడు పాదుషాబీబీని మోగలులకియ్యనని వాగ్దానముఁ జేసినమీదట కొంత ప్రజారంజకుఁ డయ్యెను.

శివాజీ తాను జయించిన కర్ణాటక రాజ్యములో కుతుబ్శాహికి భాగము పంచియియ్యలేదు. కాని వారిసఖ్యమేమియు చెడలేదు. శివాజీ జింజీయందు శాంతాజీని నియమించి, రఘునాథ నారాయణునితోడను, హంబీర రావుతోడను గలిసి వ్యవహారముల నేర్పాటుచేయుట కాజ్ఞాపించెను. శివాజీసైన్యము తిరిగివచ్చునపుడు బల్లారిదగ్గరకు చేరగా, నచట నొక దేశముఖుని భార్య వశములో నున్న కోటలోనివారు కొందఱు సైనికులను జంపిరి. ఈ కారణమున 27 దినములు ఆ కోటను ముట్టడించి యతఁడు వశముచేసికొనెను. కోపాల్గ్రామము, తరువాత ముట్టడింపఁబడి గెలువఁబడెను. బహద్దరు బెండా 15 రోజుల పిమ్మట వశమాయెను. జనార్దనపంతు సోమంతీ దేశమున వ్యవహారములు చక్కఁజేయుటకు నియమింపఁబడెను.

శివాజీ తుర్గాలువద్ద నుండగ, వెంకాజీ తన సైన్యముతో పోరి ఓడిపోయెనని, వర్తమానము వచ్చెను. శివాజీ యతని కనేక బుద్ధులు గఱపుచు సైక్యమత్యము వలని లాభములను బోధించుచు, కర్ణాటకమందలి రాజ్యమునంతయు నిచ్చివేయవలసినదనియు, దానికి మూడులక్షలు వచ్చు దేశమును తాను వేరొకచోట నిప్పించెదననియు నుత్తరము వ్రాసెను. వెంకాజీ యీ యుత్తరమందిన మీదట రఘునాధనారాయణు నొక్కసారి దర్శనమిమ్మని కోరెను. కాని యతఁడు శివాజీయొక్క సేవకుడననియు శివాజీయొక్క యాజ్ఞ లేక యట్లు చేయననియు చెప్పెను. ఈయాజ్ఞ శివాజీయొద్దనుండి తెప్పింపఁబడినతరువాత రఘునాథనారాయణుఁడు వారిద్దఱకును సమాధానము చేసెను. వెంకాజీ విస్తార ధనము నిచ్చుటకును, తండ్రి జవాహిరీని పంచి యిచ్చుటకును, రాజ్యములో సగము శిస్తునిచ్చుటకు నంగీకరించెను.

శివాజీరాయగడకు వచ్చుచుండగ, బీజపూరు సైన్యములు బళ్లారి కోపాలుల దగ్గర జనార్దన పంతుపై రాఁదలచినట్లుగఁ దెలియవచ్చెను. శివాజీ యతనికి సహాయముగ కొంతసైన్యమునుబంపి తాను రాయగడ చేరెను. వెంకాజీతో సంధికుదిరినందున హంబీరురావు కూడ నచ్చటికే వచ్చెను. ఈయుభయ సేనలును బీజపూరును సంపూర్ణముగ నోడించి500గుఱ్ఱములను 5యేనుగులను పట్టుకొనెను.

శివాజీదేశమునందు లేని 18 మాసములును పీష్వా సిద్దీలతో యుద్ధము నడుపుచునే యుండెను. మొగలునావ సైన్య సహాయముచే సిద్దీల నావలును కొంకణతీరమున మహారాష్ట్రదేశములో దిగుచుండెను. సిద్దీల నావలను తగుల బెట్టుటయును, జంజీరాపై ఫిరంగుల నెక్కు వెట్టుటయు మొదలైన విధముల యుద్ధక్రమము జరుపఁబడుచుండెను. సిద్దీ సంభోలుకు బదులుగ సిద్దీ కాశిము యాకూతుఖాను అనుబిరుదుతో చక్రవర్తిచే నియమింపఁబడెను. ఇంతకంటె విశేషములేవియు నచ్చట జరిగియుండలేదు.

డిలిరుఖాను చేసిన యేర్పాటువలన బీజపూరు సైన్యమునకు జీతములు ముట్టక మోరోపంతు మొదలైనవారి దగ్గరకు పోయి కొలువునకుఁ జేరుచుండెను. ఔరంగజేబు ఇందువలన నసంతుష్టినిఁ బొందినవాడై డిలిరుఖానును

తక్షణము సైన్యములకు బాకీజీతము లిచ్చుటకును, రాజ్యమునంతను తన రక్షణ క్రింద తీసికొనుటకును, గొప్ప యుద్యోగస్థులకు తగిన యాధారములను జూపించుటకును, ఆజ్ఞనిచ్చెను. సుల్తాను మోఅజమును మరల దక్కనుకు యువరాజుగ నియమించెను గాని సైన్యాధిపత్యము మాత్రము డిలిరుఖానునందే యుంచెను. డిలిరుఖానుఁడును, తన దేశీయులగు నాఫ్గను యుద్యోగస్థులను మొగలు పక్షమునకు త్రిప్పివేసెను. కాని యింక నసేకులు మొగలుల యెడల నయిష్టులై యుండిరి. చక్రవర్తి రాయభారియగు మల్లికు బేరఖోర్దారు పాదుషాబీబీని వివాహమున నిచ్చినఁగాని సంధిపొసగదని చెప్పెను. ముసాపుదుఖా నిందు కంగీరింపకఁ బోయెను. వెంటనే పట్టణములో మొగలు కక్షిదారులు తిరుగఁబాటుచేసి దానిని నిర్బంధించుటకు సంసిద్ధులైరి. రెండు కక్షలవారును పట్టణమధ్యమున నరకు లాడసిద్ధపడిరి. కాని పాదుషాబీబీ తన సోదరుని దేశమును జనుల రక్తపాతమును రక్షింప తానే ముందుకువచ్చి మొగలు శిబిరమునకుఁ బోయెదనని చెప్పి యుభయకక్షుల వారిని శాంతపరచెను. ఆ పట్టణ మహమ్మదీయు లిప్పటికిని తమ చివర రాజకుమారియొక్క యీ యుదార సాహసమునుఁ గూర్చి ప్రశంసింతురు.

పాదుషాబీబీ డిలిరుఖానుయొక్క శిబిరముచేరెను. కాని మొగలులు
బీజపూరుపై తమ యుద్యమమును మానరైరి. ఇట్టి యిక్కట్టునందు ముసాపుదు
ఖాను శివాజీని సహాయముకోరెను. శివాజీ,డిలిరుఖానును వెనుకవైపున
1679 ముట్టడించుటకు గాని, లేక యతని దృష్టిని భేదించుటకు గాని,
యొప్పుకొనెను. శివాజీ, డిలిరుఖానుయొక్క సైన్యము బలముగ నున్నందున,
యుద్ధంబున డీకొనక అట్లు మాత్రము నటించుచు 24 మైళ్లమార్గమునకు వచ్చి
వెనుకకు తిరిగి భీమనదిని దాటి యచటి మొగలు దేశమును ధ్వంసము చేసెను.
డిలిరుఖానుఁడు ముట్టడిని మాత్రము విడువలేదు. తరువాత ఔరంగబాదు నొద్ద
మోఅజము ఉన్నను దానిదగ్గర నున్న జాల్నాను మూఁడుదినములు విశ్రాంతి
తో శివాజీ కొల్లపెట్టెను. ఈ కొల్లధనము నంతను తీసికొని శివాజీ రాయగడ
పోవునని తెలిసినందున,యువరాజు ఆజ్ఞచొప్పున, 10,000 గుఱ్ఱపుదళముతో

రణమస్తఖానుఁడు అడ్డపడ బయలు దేరెను. అతఁడు శివాజీని సంగమ్నేరు వద్ద పట్టాకు బోవుమార్గమునఁ గలిసికొనెను. శివాజీయొక్క సైన్యము మొట్ట మొదట కొంత చెదరఁగొట్టఁబడినను, అతఁడు స్వబల పరాక్రంబువలన నాది నమున కీర్తిఁ గాపాడుకొనెను. మొగలు సైన్యంబులు భేదింపఁబడెను. అతని ప్రయాణము నిరాటంకముగ సాగెను. కాని కొంతదూరములో రాజా జయ సింగుయొక్క మనమఁడైన కృష్ణసింగుచే ప్రోదిఁ జేయఁబడిన మొగలు సైన్య ములు మరల తారసిల్లెను. ఈసైన్య మతఁడెక్క-బోవుచున్న కొండమార్గము నడ్డ గించెను. శివాజీ యా గొప్పసైన్యముతో పోరాడఁ జాలకుండెను. కాని యతని సేనలోనున్న జాసూ(మార్గదర్శకుఁడు) తెలివి తేటలు గలవాఁ డగుటవలన మార్గ మును తప్పించి వేఱుమార్గమున నతని సైన్యమును పట్టాకుఁ జేర్చెను. మొగలు సైన్యములు ఔరంగబాదునకు తిరిగిపోయెను.

పట్టాయందు శివాజీ కొన్ని దినములుండి యాచుట్టుప్రక్కలనున్న 27 కోటలను వశము చేసుకొనఁ జూచుచుండెను. ఇంతలో ముసావుదుఖాను దగ్గర నుండి దక్షిణమునకు రావలసినదనియు, డిలిరుఖాను పట్టణపు గోడలకు సమీప ముగ తన రణఘడను (Trenches) జరపియున్నాడనియు, శీఘ్రముగ వచ్చి రక్షించవలసినదనియు, వర్తమానమువచ్చెను. శివాజీ బీజపూరునకు ప్రయాణమా యెను. మార్గమధ్యమున తనకుమారుఁడగు శంభాజీ పాఱిపోయి డిలిరుఖానును జేరెనని యతనికిఁ దెలియవచ్చెను. తనసైన్యమును హంబీరు రావు క్రింద నా మార్గమున పోవలసినదని యాజ్ఞయిచ్చి యతఁడు మాత్రము శంభాజీని మరల రప్పించుట కుపాయ మాలోచించుటకు పన్హాలాకుపోయెను.

శివాజీయొక్క పెద్దకుమారుని నడవడిని గూర్చి యతనికి కొంతకాలము నుండి వ్యాకులముగ నుండెను. శంభాజీ, యొకబ్రాహ్మణుని భార్య నవమానింపఁ బ్రయత్నించి నందున నతనితండ్రి యతని పన్హాలా దుర్గమందు నిర్బంధించి యుంచెను. అటనుండి వదలిపెట్టిన తరువాత కూడ నతనిపై దిట్టమైన కావలి నుంచెను. శంభాజీ యిట్టి నిర్బంధమునకు సహింపలేక తండ్రిలేని సమయమున

డిలిరుఖాను దగ్గరకు పాఱిపోయెను. డిలిరుఖానుఁడు నితని గొప్పగౌరవముతో తన రక్షణక్రిందకు తీసుకొనెను.

డిలిరుఖాను ఈసంగతిని చక్రవర్తికి తెలియపఱుచుచు, మహారాష్ట్రులు బలవంతులగుచున్నారు కావున, శంభాజీ నొక కక్షకు నాయకునిగఁజేసి, శివాజీకి విరోధముగ నుంచి, మహారాష్ట్రులను ఓడఁదీసి కోటలను పట్టుకొందమని ప్రస్తావనచేసెను. కాని ఔరంగజేబు దీనివలన మరల చిట్టచివరకు దోపిడి వ్యాపార మెక్కుడగునని యటు లంగీకరింపలేదు.

కాని దర్బారునుండి యే యుత్తరువును రాక పూర్వమే డిలిరుఖానుఁడు శంభాజీకి కొంతసైన్యమిచ్చి భూపాలగడను పట్టుకొనఁబంపెను. అది వశమయ్యెను. మోరోపంతు ఖాన్‌దేశ మంతయు కొల్లఁబెట్టుచుండెను. హంబీరురావు డిలిరుఖాను శిబిరముచుట్టును పీడింపఁజొచ్చెను. కోటలోని వారును ధైర్యముగ రక్షించుకొనుచుండిరి. డిలిరుఖాను, ముట్టడిని తీక్ష్ణముగజరిపెను కాని చుట్టునుండి సామగ్రు లడ్డు గొట్టఁబడినపుడు వాని స్వధైర్య మెందుకును పనికి వచ్చినదికాదు. కడపట కతఁడు కోటను లోఁబర్చు కొనుటయం దాశ విడచి ముట్టడిలేవనెత్తి కర్ణాటకమునకు,త్రోవలో కొల్లపెట్టుకొనుచు,పోయెను. అచ్చట జనార్దనపంతు 6000 సైన్యముతో నతనిఁ దాకి సంపూర్ణముగ నోడించి, అతని గుంపుల ననేకముల నడ్డగించి, నరకివేసి, వెనుకకుఁ దఱిమెను.

ఈ సమయమున డిల్లీనుండి సుల్తాను మోఅజము దర్బారునకు పిలువఁబడుచు, ఖానుజహానుకు సేనాధిపత్య మిచ్చి, డిలిరుఖాను యొక్క యేర్పాటుల కసమ్మతముఁ దెలియపఱుచుచు, చక్రవర్తి యాజ్ఞలువచ్చెను. ఇందుతోడనే శంభాజీని ఖైదీగా డిల్లీకిఁ బంపవలెనని కూడ నుత్తరువు వచ్చెను. కాని డిలిరుఖాను, శివాజీయొక్క రాయభారు లతని జేరుట కీవరకె యంగీకరించియుండి, యిప్పుడు పాఱిపోవుటకుకూడ నుపేక్షించెను. శివాజీ కుమారునితో సమాధానపడినను, ప్రవర్తనను బాగుచేసుకొనినట్లు తగిన నిదర్శనములు చూపువరకునతని పన్హాలాయందు నిర్బంధించియుంచెను.

శివాజీ బీజపూరునకు స్నేహమిచ్చి రక్షించినందుకు, కోపాలు బళ్లారి దగ్గర నున్నదేశము నిమ్మని యడిగెను. అంతేకాక, ద్రవిడదేశములో తాను

జయించిన దేశమునందును, తంజావూరు సంస్థానమందును షాజీ జాగీరు జిల్లా
1680 లందును, రాజ్యాధికారములన్నియు నిచ్చివేయుమని కోరెను. ఈ
షరతు లంగీకరింపఁబడిన పిమ్మట, శివాజీ బీజపూరు పట్టణము దగ్గ
రకుఁబోయి ముసావుదుఖానుతో సందర్శనమును, రహస్య సంభాషణమును
బొంది తిరిగివచ్చెను.

ఇట్లు శివాజీ కొసంగఁబడిన యాధిక్యత, వెంకాజీచేఁ దన స్వాతంత్ర్యమునకు సంపూర్ణ వినాశనమని దలంపఁబడెను. అంతకు పూర్వమే రఘునాథ నారాయణుఁ డతని వ్యవహారములలో జోక్యముఁ గలుగఁజేసికొనుచుండెను. శివాజీయు నతనికి సహాయముచేయు మిషమీద కార్యనిర్వాహణమంతయు నతని చేతినుండి లాగుకొనుచుండెను. వెంకాజీ యిట్టి యధికారమును సహింపలేక రాచకార్యము లెల్లమాని విచారగ్రస్తుఁడై, దేహ సౌఖ్యముఁగూడ శ్రద్ధగఁ జూచుకొనుటమాని, బైరాగివలె కాలము గడుపుచుండెను. ఈ సమయములో నన్నగారు అతనికి నీతులను కొన్నిబోధించుచు ధైర్యముగ నుండుమని, శౌర్య పటుత్వముగల నొక్క యుత్తరమును వ్రాసెను. ఈ ఉత్తరమే యితఁడు చిట్టచివర వ్రాయించిన ఉత్తరము.

తరువాత నతఁడు రాయగడయందు మోకాలులో వాపుపుట్టి, వ్యాధిగ్రస్తుడై, నొప్పి యధికమై జ్వరము వచ్చుటవలన, వారము దినములు బాధపడి 1680 సం॥ ఏప్రిల్ 5 వ తేదీన, 53 వత్సరముల వయసున కీర్తిశేషుండయ్యెను.

ఇట్లు జీజాబాయి గర్భంబునఁ బుట్టి, దాదోజీ కొండదేవునిచే సుశిక్షితుండై, దేశాభిమాన పూరితులగు ననేక వీరపురుషుల సహాయంబున, బుద్ధిబలంబుల కాలానుసారంబుగ నుపయోగించి, ధర్మానురక్తుడై, ఈశ్వర భక్తాశ్రిత సేవా పరతంత్రుడై, మహోద్యమంబును శిరసావహించి, స్వతంత్ర రాజ్య ప్రతిష్ఠాపనఁజేసి కృతార్థుండై, హిందూదేశీయు లెల్లరకును ఆచంద్రతారకంబుగ సంస్మరణీయుండై, భౌతిక శరీరంబును చాలించి, కీర్తికాయంబున శివాజీ మహారాజు ప్రకాశించుచుండెను. జీజాబాయి యతని యుద్యమమునకు మూల

దేవత. ఆమెయే యాతనికి ప్రత్యక్షభవాని. ఆమెయే యాతని యాత్మ. దాదోజీ కొండదేవుఁ డతనికి లౌకికదేహము. అతని యుద్యమమును సాధించుటకు తగిన శక్తిసామర్థ్యము లతఁడిచ్చెను. రామదాసు మహాపురుషుఁడు దీనికి తనె సమ్మతమును ఆశీర్వాదము నిచ్చెను. వీరపురుషు లనేకు లిందుకు తోడ్పడిరి. మహారాష్ట్రి మావలీ జనంబులెల్ల నిందుకు సాధనంబులైరి. స్వతంత్ర రాజ్యంబిందుకు ఫలితమయ్యెను. ఇతని జీవిత మెల్లకాలమునకును హిందూ జాతీయ నిర్మాణమున కనేక యుపదేశంబుల నియ్యఁగలదు. అదియే యీతని జీవిత సార్థక్యము. శివాజీయందు లోపంబులు లేకపోలేదు. కాని యతని యుదాత్త గుణంబుల వలన నవి యెల్లను క్షమింపఁబడుచున్నవి. అతని దేవుండని మనము దలంప నక్కఱలేదు. అతఁడు మానవులలో నుత్తమోత్తముఁడుగనే మనయొక్క యారాధన కనేక మడుంగు లర్హుండు.

శివాజీ చనిపోవునప్పటికి తపతీనదికి దక్షిణముననున్న రాజులలో నెల్ల బలాధికుఁడైన ప్రభువుగ నుండెను. అతని యధికారము తప తీకావేరుల మధ్యనున్న హిందూ మహమ్మదీయ రాజు లెల్లరిచేత నంగీకరింపఁబడెను. శివాజీ సంపాదించిన రాజ్యమును ధనమును గొప్పవియే యైనను, అతఁడు చూపించిన యుదాహరణమును, అతఁడేర్పరచిన పద్ధతులును, మహారాష్ట్రి జనుల కతఁడు గలిపిన యుత్సాహమును, మహమ్మదీయులచే నంతకంటె నసాధ్యమైనవిగ గణింపఁబడెను.

అతని తరువాత వారెవ్వరు నతని శక్తిసామర్థ్యములకు వారసులుగా లేదు. కాని సామ్రాజ్యముల యొక్క విజృంభణ వినాశములకు, సాధారణముగ మానవవృష్టి కలక్ష్యంబుగఁ గనుపడు సాధనంబులే చిట్టచివరకు ప్రబల కారణ భూతంబులై వెలయుచుండును.

శివాజీకి భార్యలు నలుగురు. మొదటిభార్య సుహీ్యబాయి, నింబాల్కరు వంశజురాలు. ఈమె శంభాజీని కనిన రెండు సంవత్సరముల కనగా 1659 వ సం॥ మునందు పరలోకగతురాలయ్యెను. సోయరాబాయి సిర్కె వంశజురాలు. ఈమె రాజారాము తల్లి. ఈమె తెలివిగలదియు పతి యనురాగము

నెక్కువ సంపాదించిన దగుటవలన మంత్రు లనేకు లామెయెడల భయభక్తులు గలవారై యుండిరి. ఇందు మూలమున భర్తమరణానంతరము రాజారాముని సింహాసనాసీనుం జేయ నామె ప్రయత్నించెను గాని సఫలీకృతమనోరథ గాక పోవుటయేగాక శంభాజీ చేతిలో ఘోరమరణంబు నొందెను. పుత్లాబాయి మొహితీ వంశజురాలు. ఈమె సహగమనము చేసెను. భర్తయొక్క మరణము కొన్ని దినములవరకు రహస్యముగ నుంచఁబడెను. గాన భర్తకళేబరముతోఁ గాక నటుపిమ్మట నీమె యగ్నిప్రవేశముఁ జేసెను. నాలుగవ భార్యయొక్క వివరము తెలియదు. ఆమె భర్తకు పూర్వమే చనిపోయెను.

శివాజీయొక్క రాజకీయ వర్తనముఁ గూర్చి యీవరకే విచారించియుంటిమి. అతని సంసారజీవితమందు శివాజీ నిర్మల వర్తనముకలవాడు. స్త్రీల యెడల నతని గౌరవము పరమపావనమైనది. అతని భావాభినయంబులు గృహంబున నత్యంతసంతోషదాయకంబులై యుండెను. అతనివిలాసము మనోహరము. అతడు సంభాషణలందు నిష్కపటిగనుండెడువాడు గాని తఱుచుగ నెక్కువపరిచయంబుతో నుండెడువాడుకాడు. స్వభావమునం దావేశయుతుఁడైనను బంధువులయెడలను సేవకుల యెడలను దయావంతుఁడై యుండెడివాఁడు. అతఁడు సామాన్యమైన యెత్తరిగ నుండెడువాడుగాని దీర్ఘకాయుఁడుకాడు. అతఁడు శరీరమునందు బలముకంటె హునరెక్కువకలవాడు. అతని సోయగమును సౌందర్యమును సూక్ష్మబుద్ధి సూచకమైయుండెను. హిందువులలో నందముగ నెంచఁబడు నాజానుబాహుత్వ మతనియందుండెను. అతడు తన దేవతయగు భవానీపేరున నెప్పుడు నుపయోగించు ఖడ్గము ప్రశస్తమైన జినోవా యందుఁ జేయఁబడినది. ఆఖడ్గమిప్పటికిని అతనివంశజుఁడగు సతారారాజుగారి వలన నత్యంత గౌరవముతో విగ్రహమువలెఁ బూజింపఁ బడుచున్నది. దానియొక్క చరిత్రయంతయు నాయన వంశముయొక్క చరిత్రకారునివలన గ్రంథస్థము చేయఁబడియున్నది. ఆయన కళేబరము రాయగడయందు దహనము చేయఁబడెను. ఆయన అస్థులపై నక్కడొకగోరీ కట్టఁబడియున్నది. శావంతు వాడీదగ్గిర మాల్వానుకోటయందొక భవనము శివాజీయొక్క స్మారకస్థానంబుగ

సెంచఁబడుచున్నది. ఈభవనము మొట్టమొదట శివాజీచే నిర్మింపఁబడెను. కొన్ని పూజావిధానములఁ జరుపుటకతనిచే కొందఱు పూజారులు నియమింపఁబడిరి. శంభాజీ దీనిని మఱికొంత వృద్ధిఁజేసెను. రాయగడకోట శత్రువశమైన తరువాత రాజారాముదానిని శివాజీయొక్క స్మారకస్థానంబుగఁజేసెను. అచ్చట శివాజీయొక్క విగ్రహమును ఆయనయొక్క మఱియొక ఖడ్గమును గలవు. జనులిచ్చటకు నివేదనలు కూడ పట్టుకొనివచ్చుచుందురు. పూజారు లిప్పటికిని యీనాముల ననుభవించుచు స్థానమును కనిపెట్టుకొనియున్నారు.

ప్రకరణము. 11.

శివాజీయొక్క పరిపాలనా పద్ధతులు.

శివాజీయొక్క యుద్ధసాహసంబులను మాత్రముచూచినపుడా మహామహునియొక్క బుద్ధి నొకప్రక్కను మటుకు గ్రహించినవారమై యతని కింతకంటె నాధిక్యముగల పరిపాలనా సామర్థ్యమును మఱచిన వారమగుదుము. ఫ్రాంసుదేశమందలి మొదటినెపోలియనువలెనే, శివాజీ యతనికాలములో గొప్ప అంగనిర్మాణకుఁడు, పరిపాలన ప్రతిష్ఠాపనా ధురంధరుఁడు. అతఁ డారంభించిన యుద్యమమిందువలననేఁ జాలవరకు జయప్రదమైనది. అందువలననే నతని మరణానంతరము దేశమునెల్ల ముంచివేసిన యాపదలనుండి నిరపాయంబుగఁ దప్పించుకొనుట కద్దానికి సామర్థ్యంబు గలిగినది. అందువలననే, మొగలు సామ్రాజ్యముయొక్క యావద్బలంబుతోడను నిరంతర సంగ్రామం బిరువది వత్సరంబులుచేసి, జాతీయస్వాతంత్ర్యమును ప్రకటించుటకు దేశమునకు శక్తివొడమినది. ఈ పరిపాలన ప్రతిష్ఠాపనలు ప్రత్యేకవిమర్శ కర్హమైనవి. ఏలనన అప్పటి హిందూమహమ్మదీయ ప్రభుత్వములందు ప్రస్తుతమైన పరిపాలనాపద్ధతులనుండి యతఁడు గ్రహింప వీలులేనటువంటి యపూర్వత్వమును, భావనావైశాల్యము నవి దెలియఁజేయుచున్నది. అంతకంటె సుప్రసిద్ధవిషయ మేమన, స్వతంత్ర సంగ్రామ మంతమైన పిమ్మట దేశము మరల నంగనిర్మితమైనపుడు, అతని వారసులు పూర్వ సాంప్రదాయములకు క్రమ్మరి, మహారాష్ట్రాధికారమూలపురుషుం డేర్పాటుఁజేసినపద్ధతులనుండి విడివడిరి. అతఁడేర్పరచిన పద్ధతులనుండి విడివడిన కారణమున, నతఁడు ప్రయత్నించి జయంబునొందిన నెల్లవానిలో నతఁడు చొరకుండ నిరోధింపనెంచిన యైకమత్యరాహిత్యముయొక్కయు భేదభావముయొక్కయు బీజంబులను వారు చల్లినవారైరి. హిందూదేశమునంతను స్వరాజ్యంబు స్థాపింప

నతని మనస్సులో దూరస్థంబైన యుద్దేశ మెుక్కడెడమున్నను, నద్దాని నతఁడు తన జీవితకాలంబులో సమకూర్పఁదలంచలేదు. కాని తనదేశజనులస్వతంత్రము నార్జించి, నాత్మరక్షణకును, ఆత్మజీవనమునకు నొక్కజాతిగ నైక్యంబుఁ జేయ నతఁడు ప్రయత్నించెను. కావున నతఁడు తక్కినరాజ్యముల నన్నిటి యొుక్క వినాశము నుద్దేశింపలేదు. గోలకొండ బెదూర్నరులతోడను, బీజపూరులతో సహితను నతఁడు స్నేహసంబంధములు కలిగియుండెను. వారియొుక్క తెలుగు మైసూరు కర్ణాటక దేశములో నతఁడు వారియధికారములతో జోక్యము కలుగఁజేసికొనలేదు. ద్రవిడదేశంబున తమ్ముఁడు వెంకాజీ నతని రాజ్యములో నత డుండనిచ్చెను. మోగలుదేశములనుండి ఛౌతుసర్దేశముఖీలు వసూలుచేయుట మాత్రముతో నతఁడు తృప్తినొందియుండెను. అతఁడుస్వరాజ్యము (తాను స్వయముగఁబాలించురాజ్యము) నకును మోగలాయి (స్వరాజ్యము వెలుపల పరరాజులచేఁబాలింపఁబడురాజ్యము) కిని భేదము చక్కగ నరసియుండెను. తానేర్పఱచిన పరిపాలనప్రతిష్ఠాపనలు ముఖ్యముగ మహారాష్ట్రదేశమునకే యుద్దేశింపఁబడినవి. అవికొంతవఱకు దక్షిణమున దూరముననున్న దుర్గశ్రేణియందుమాత్రము ప్రవేశపెట్టఁబడెను. స్వయముగ నతని యేలుబడిక్రిందనున్న రాష్ట్రము, ప్రాంతముల (జిల్లాలు) లోనికి విభాగింపఁబడెను. పూనాదగ్గరనున్న పిత్రార్జితమైన జాగీరుగాక యింకనున్నవేమన, (1) మావలప్రాంతము. ప్రస్తుతమున్న మావలు, శాశ్వదు, జూనారు, ఖేదు తాలూకాలనావరించి 18 దుర్గములచే పరిరక్షింపఁబడుచుండెను; (2) వాయీ, సతారా, కరాడప్రాంతములు ప్రస్తుత సతారా జిల్లాయొుక్క పశ్చిమ భాగములపై నావరించి 15 కోటలచే పరి రక్షింపఁబడుచుండెను; (3) పన్హాలా ప్రాంతము— ప్రస్తుత కొల్హాపురము పశ్చిమ భాగముల నాక్రమించి 13 దుర్గములచే పరిరక్షింపఁబడు చుండెను; (4) దక్షిణ కొంకణ ప్రాంతము— రత్నగిరి భాగము నావరించి 58 కొండ కోటలు, సముద్ర దుర్గములచే పరిరక్షింపఁబడు చుండెను; (5) ఠాణా ప్రాంతము— ఉత్తర కొంకణ జిల్లాయై 12 దుర్గములచేఁ బరిరక్షింపఁబడు చుండెను; (6-7) త్రయంబకు బాగ్లాను ప్రాంతములు— నాసికయొుక్క పశ్చిమ భాగ

మున జిల్లాయై 62 కొండ కోటలచే పరిరక్షింపఁబడు చుండెను కావలి సైన్యములచే నాక్రమింపఁబడిన ప్రాంతము లివ్వియన, (8) వానగడ ప్రాంతము— ధార్వాడ జిల్లాయొక్క దక్షిణభాగములనుండి 22 కోటలచే పరిరక్షింపఁబడు చుండెను; (9, 10, 11) బెద్నూరు, కోలారు, శ్రీరంగపట్టణము ప్రాంతములు— ప్రస్తుతపు మైసూరు నావరించి 18 కోటలచే పరిరక్షింపఁబడెను. (12) కర్ణాటక ప్రాంతము— కృష్ణానదికి దక్షిణముననున్న కడప కర్నూలు బల్లారి అనంతపురము నావరించి 18 కోటలచే రక్షింపఁబడు చుండెను. (13) వెల్లూరు ప్రాంతము— ప్రస్తుతపు ఆర్కాడు జిల్లాల నావరించి 25 కోటలచే రక్షింపఁబడుచుండెను; (14) తంజావూరు ప్రాంతము 6 కోటలతో నుండెను. సహ్యాద్రిపర్వత పంక్తియెల్లను దుర్గగ్రంథితమై యుండెను. పడమట, సముద్రము వఱకును ఈ దుర్గములకు తూర్పుననున్న దేశమంతయు 50 మొదలు 100 మైళ్ల వఱకు వెడల్పుండును.

శివాజీ యొక్క యాక్రమణలో 280 కోటలున్నవని మహారాష్ట్ర బఖరులందుఁ జెప్పఁబడియున్నది. నిశ్చయముగ నొక యర్థములో నీ కొండ కోటయొక్కొకటి, దాని యధికారములో నున్న రాష్ట్రమునకు శివాజీయొక్క పరిపాలనకు మూలస్థానమని చెప్పవచ్చును. క్రొత్తకోటలు కట్టుటకును ప్రాత కోటలను బాగుచేయించుటకును అతఁడు ధనమేమియు లోభించెడు వాఁడు కాడు. ఈ కోటలయందు కావలి సైన్యము నుంచుటకును, పదార్థ సంగ్రహణము చేయుటకు నతఁడు చేసిన యేర్పాటులు విపులమైనవి. ముట్టడులకు పరబల నిరోధస్థానములుగను, ఆక్రమణ కేంద్రములుగను, నీ కోటల యొక్క సుప్రసిద్ధంబులైన సంగ్రామ సాహసకృత్యంబులు, ఆరంభ మహారాష్ట్ర యుద్ధముల యొక్క మనోహర చరిత్రంబై యుండెను. ఈ పర్వత దుర్గశ్రేణిచే రాజ్యంబు దగ్గరగ బంధింపఁబడి యుండెను. ఆపత్కాలంబున నవి రక్షణలై రాజిల్లెను. సతారా జిల్లాయందు సతారాయే ఔరంగజేబు యొక్క యావత్సైన్యము యొక్క ముట్టడికి ననేకమాసములు నిలచెను. చిట్టచివర కతి కష్టంబుగ వశపర్చుకొనఁబడి నప్పటికిని, మొగలులనుండి రాజారాము సైన్యాధిపత్యము

క్రింద ప్రస్తుత జౌండు ప్రముఖుని పూర్వికులవలన మరల దీసికొనఁబడిన ప్రథమ దుర్గమిదియే. తోరణ రాజగడకోటలు శివాజీయొక్క ప్రథమ విజయముల సహవాసంబున చెలంగుచుండెను. శివనేరతని జన్మస్థానము. పురందరు బాజీ ప్రభు రక్షణవలన ప్రఖ్యాతిఁగాంచినది. రోహిడా సింహగడలు తానాజీ మాలుశూరే పరాక్రమంబులో ప్రకాశించుచున్నవి. పన్హాలా సిద్దీ జోహారుయొక్క ముట్టడి నెదిరించి నిలిచినది. రంగనా, యింకొక బాజీ ప్రభుయొక్క యిరుకైన కొండ మార్గమునందలి ప్రాణనష్టములోఁ జేయఁబడిన రక్షణచే ప్రసిద్ధిఁ కెంచెను. మాల్వాను కొలాబా కోటలు సముద్ర దండయాత్రలందు మహారాష్ట్ర నావికాసైన్యమాయుత్తమగు స్థానములై వెలసియుండెను. ప్రతాపగడ అఫ్జుల్ఖాను వధా సంబంధమున వన్నెకెక్కెను. మాహులీ సాలేరులు, మహారాష్ట్ర మావలీలు వెగలు సేనాపతుల నోడించిన రణరంగంబులై, యశంబు నొందియుండెను. శివాజీయొక్క పర్వత దుర్గములకు తూర్పుప్రక్క నాఖరు సరిహద్దులు, కళ్యాణ, భివ్వాడి, వాయీ, కరాడ, సోపా, కుత్తావు, బారామతి, చాకను, షిరావలు, మిరాజు, తత్సగాం, కొల్లాపురము దుర్గముల వలన నంకితమై యుండెను. శివాజీచే నుంచఁబడిన శ్రద్ధకు తగిన కార్యముల నవి నిర్వహించెను.

ప్రతిదుర్గమునందును సామాన్య కాల్బలములో కొంత కావలిసైన్యముగ నుంచఁబడును. వీరు గాక దుర్గమునందు బ్రాహ్మణులు మహారాష్ట్రులు రామూసీలు, మహారులు (మాలలు) మాంగులు (మాదిగలు) మొదలైన వారిలో గలసిన వేరైన యస్టాబ్లిషుమెంటు యుండును. వీరందఱును గడేకారులనఁబడుదురు. వీరు దుర్గమును, తన గర్భమునందుంచుకొని రక్షించు మాతగా, వర్ణింతురు. వీరందఱు చుట్టుప్రక్కల నీనాముల నియ్యఁబడి వానివలన జీవనము చేయుచుందురు. కోట, మహారాష్ట్ర హవల్దారు క్రింద నుండును. ఆయనక్రింద ప్రాకారముల యధికారములోనుండు నితర సహాయకు లుందురు. వీరును మహారాష్ట్రకులమువారే యై యుందురు. అతని కింకను సబ్నీసు, [illegible] అను నతఁడు బ్రాహ్మణకులమునుండి యెన్నుకొనఁబడినవాఁడును, కారు ఖానీసు

జను నతఁడు పరభూకులనుండి యెన్నుకొనఁబడినవాఁడును సహాయుఁడై యుండుచు హవల్దారు, తన మహారాష్ట్ర సహాయకులతో, కావలి సైన్యము యొక్క యధిపతియై యుండును. బ్రాహ్మణ సుబేదారు సివిల్ రివిన్యూ వ్యవహారముల కాకోట యధికారమున నున్న తాలూకా కంతకు నధిపతియై యుండును. పరభూకారుఖానీసు, ధాన్యము మొదలైన భోజన పదార్థములను, పశుగ్రాసమును, ఆయుధ సామగ్రులను, మరమ్మతులను, చూచుచుండును. ఈ మూఁడు వర్ణముల వారు నుద్యోగములందు తగురీతిని కార్య నిర్వాహణమందు భాగస్వాములుగ నుండి భయభక్తులతో నుండునట్లును, ఒండొరుల యెడల నసూయలేకుండునట్లు నొక్కటిగఁ జేయఁబడిరి. కోటయొక్క ప్రక్కలు చక్కగఁ గాపాడఁ బడుచుండెను. కోటలక్రింది యడవులు రామూసీలు మొదలైన తక్కువ వర్ణములవారిచే పరిరక్షింపఁబడుచుండెను. వారు వర్తమానములను దెచ్చుటకును, కొండమార్గములను గని పెట్టి యుండుటకును, శత్రువులకు మార్గములను దప్పించి అబద్ధపు వార్త లిచ్చుటకును, వారి చెవరిన భటులను జంపివేయుటకును నియోగింపఁబడు చుండెడివారు. రేయిం బవళ్లు వారు కావలియందు చేయుట కనేక విపరములైన పద్ధతులు నిర్ణయింపఁబడి యుండెను. కోటలయొక్క విస్తీర్ణమునుబట్టియు ప్రాముఖ్యతను బట్టియు కావలిసైన్యము నియమింపఁబడుచుండెను. ప్రతి 10 మంది సిపాయిల కొక్క నాయకుఁడుండెను. వారిఆయుధములు శతఘ్నులును, కరవాల భిండివాల కుంత తోమరములును, పట్టాలును (సన్నని పొడుగపాటికత్తులు) అయియుండెను. ప్రతి మనిషియు నుద్యోగమున కుచితమైన రీతిని జీతముగాని ధాన్యముకాని యియ్యఁబడుచుండెను.

పర్వత దుర్గములనుండి సమదేశమునకు వచ్చినయెడ రాజ్యము మన ప్రస్తుత తాలూకా పద్ధతివలెనే, మహాలుల లోనికిని ప్రాంతములలోనికిని విభాగింపఁబడి యున్నది. ఒక మహాలుయొక్క రాఁబడి సామాన్యముగ $\frac{3}{4}$ లక్ష మొదలు $1\frac{3}{4}$ లక్షవరకు నుండెను. రెండుమూఁడు మహాలులు కలసి యొక సుభా (జిల్లా)అగును. ఒకసుబేదారు జీతము నెల 1-కి 400 హోనులు,అనగా 100

రూపాయలు. శివాజీ, శిస్తు వ్యవహారమును, మొగలులవలె కేవలము గ్రామస్తులగు పటేలు కులకార్ణి చేతులయందు గాని, దేశముఖు దేశపాండ్యల చేతులయందుగాని యుంచలేదు. ఈ గ్రామజిల్లా యధికారులు పూర్వమునందు వలెనే వారివారి వతనుల ననుభవించుచుండెడివారు కాని వ్యవహారము మాత్రము వారి చేతులనుండి తీసికొనఁబడి స్వయముగ సుబేదారు, మహాల్కరులవలన జరుపఁబడు చుండెడిది. రెండుమూఁడు గ్రామములకు కలిసి యొక కమావిస్దారు (కారూక్కాను) వలన వ్యవహరింపఁబడుచు, రివిన్యూ స్వయముగ వసూలు చేయఁబడుచుండెను. గ్రామములందు గాని మహాలులందు గాని శిస్తును గుత్త కిచ్చుపద్ధతి శివాజీచేఁ దీసివేయఁబడెను.

దుర్గముల కావలిసైన్యమునందలి ఉద్యోగములు, శివాజీయొక్క పదాతి యశ్వసైన్యములందువలెనే యేర్పాటు చేయఁబడెను. ప్రతికాల్బలమునందును పదేసి భటుల కొక్కనాయకుఁడును, అట్టినాయకులైదింటి కొక్కహవల్దారును, ఇద్దరు హవల్దారులపైన నొక్క జుమలేదారును, పదిజుమలే లొక్కసంపూర్ణ సహస్రసమూహంబై యొక్కహజారీక్రిందను, సప్తహజారీ యొక్కసర్ణోబతుక్రిందనుగూడి మావలీకాల్బలంబై నెగడుచుండెను. శివాజీయొక్క కాల్బలము ఘాట్మాతాయందును కొంకణమందును తీయఁబడుచుండెను. ఇందు మొదటి చోటనుండి తీయఁబడినవారు మావలీలనియు, రెండవచోటనుండి తీయఁబడిన వారు హేత్కారీలనియు చెప్పఁబడుదురు. వీరుసామాన్యముగ నాయుధములను తమకే తెచ్చుకొనెడువారు. మందు సామానుమాత్రము సర్కారుచే నియ్యఁబడుచుండెను. వారియొక్క దుస్తులొక్కమాదిరిగ నుండెడివికావు గాని వారు సామాన్యముగ చెడ్డీలనుధరించి నడుమునకు కాశీలనుగాని శాలువలనుగాని బిగించి నెత్తికి పాగాలను పెట్టుకొని, చొక్కాలనుతొడుగుకొని యుండెడివారు. సామాన్యముగ నుపయోగింపఁబడు నాయుధములు శతఘ్ని, డాలు, ఖడ్గమునై యుండెను. ప్రతి పదియవ భటుఁడును శతఘ్నికి బదులు ధనుర్బాణములధరించెడువాఁడు. రాత్రియందును, హఠాత్తుగముట్టడించునపుడు నవి యుపయోగింపఁబడి శతఘ్నులు నిలువయుంచఁబడుచుండెడివి. హేత్కారీలు లక్ష్య

మునందు కౌశలముగలవారుకాని ఖడ్గముచేతఁ బట్టుకొని ద్వంద్వయుద్ధమునకు మాత్రము మావళీలతో సరిరారు. వీరిరువురునుగూడ కొండలెంత నిలువుగనున్న నూ సులభముగ నెగఁబ్రాకఁగలరు.

అశ్వసైన్యమునందు బార్గీరులు, సిలేదారులని రెండుభేదములు గలవు. బార్గీరులు సర్కారు గుఱ్ఱములపై నెక్కుదురు. ఇది శివాజీయొక్క స్వంతసైన్యము. దీనినే పాగాయనికూడనందురు. సిలేదారులు తమ గుఱ్ఱములును తామే తెచ్చుకొని కొలువుకొలుతురు. బార్గీరులకంటె సిలేదారు లెక్కువగౌరవముగఁ జూడఁబడి యెక్కువజీతము లియ్యఁబడు చుండిరిగాని బార్గీరులమీదనే, సిలేదారులమీద కంటెను, లేక మరియెవ్వరైన గుత్తకుసిద్ధపరచిన యశ్వసైన్యము మీదకంటెను శివాజీ యెక్కువ నమ్మకముంచెడువాడు కావున తన పాగా సైన్యమును, తక్కిన రెండువిధముల వారిలోను కుట్రలుగాని తిరుగఁబాటుగాని లేకుండుట కతఁడుకొంతకలిపి యుంచెడివాఁడు. 25గురు బార్గీరులకుగాని సిలేదారులకు గాని యొకహవల్దారు, అయిదు హవలాలొక్క జుమలా, పదిజుమలా లొక్కహజారీ,అయిదుహజారీ లొక పాంచహజారీగా నశ్వదళంబున నేర్పడెను. పాంచహజారీ సర్ణోబతు నధికారంబు వహించెను. ప్రతి 25 మూకకును ఒక నీటి మనిషియు నొక్క సామగ్రిమనిషియు నుండును. కాల్బలమునందును గుఱ్ఱపు దళమందును పెద్దమహారాష్ట్రి యుద్యోగస్థునియొద్ద నొకబ్రాహ్మణ సబ్నీసు, ప్రభూకార్ఖానీసుగాని లేక బ్రాహ్మణమజుందారు ప్రభూజామ్నీసు గాని యుందురు. బార్గీరుల గుఱ్ఱములు వర్షకాలమందున శిబిరము లందుంచఁబడి గడ్డిదానాలనిచ్చుట కేర్పాటులు చేయఁబడును. భటులునివాసముగ నుండుటకు బారక్సు (గృహశ్రేణి) కట్టఁబడి యుండును.

అశ్వసైనికుఁడు పదాతిభటుని వలెనే వేషమును ధరించును గాని తల పాగను మాత్రము గుఱ్ఱముమీద సవారి చేయుచుండగ పడిపోకుండ నుండుట కొక సన్నపాటి గుడ్డతో గడ్డము క్రిందనుండి పాగాను బిగించి కట్టుకొనును. నడుమున నున్న గుడ్డతోడనే సామాన్యముగ ఖడ్గమును కూడ గట్టిగ గట్టుకొనును. చెవులకు పెద్దపెద్ద బరువైన బంగారు లేక వెండిపోగులను ధరిం

డును. గుఱ్ఱములమీఁద సవారిచేయుట యందు వారతి సమర్థులు. ముఖ్యముగ ఈ కోళీలవాండ్రు బొటమన వ్రేలుమట్టుకు లగామువ నుంచి సవారిచేయఁగల వారు. మహారాష్ట్రు లందఱును మీసముల నుంచుకొందురు. వారిలో భయంకరమైన మనిషిని వర్ణించినపుడు 'గడ్డము క్రింద బిగించఁబడిన తలపాగఁ గలిగి చేతి వెడల్పు మీసముగలవాఁడ'ని చెప్పుదురు.

ఉద్యోగస్థులును భటులును నెలజీతము లియ్యఁబడుదురు. హాగా హజారీకి నెలకొక్క వేయి హోనులు జీతముండును. హాగా పాంచ హజారీకి 2000 హోనులుండును. కాల్బలములో హజారీకి 500 హోనులును, భటులకు 9 మొదలు 3 రూపాయిల వఱకును, అశ్వసైనికులకు 20 మొదలు 6 రూపాయిల వఱకు నుండును. సంవత్సరములో నెనిమిది నెలలు సైన్యములు ముల్ఖుగిరి, అనగా ఘాతుసర్దేశముఖులను మొగలుదేశములో వసూలుచేసికొని దానిపై జీవింపవలెను. అట్టి నౌకరీ యందున్నపుడు భటు లెవ్వరును తమ కుటుంబములను వెంట తీసికొని పోఁగూడదు. ఏదైన పట్టణము కొల్లపెట్టఁబడినపుడు ప్రతి భటుఁడును అశ్వికుఁడును కొల్లద్రవ్యము నంతను లెక్క గనుపఱుపవలయును. కర్షకులును, స్త్రీలును, గోవులును, మతసంబంధీకులును నిరుపద్రవంబుగ నుంచఁబడవలయు నని శివాజీ యాజ్ఞ. గొప్ప ధనము నిచ్చి విడిలించుకొనఁ గలవారినే శత్రువులలో ఖైదీలుగఁ బట్టుకొనఁబడవలసినది గాని మఱి యెవ్వరును పట్టుకొనఁబడ గూడదు. వారును తగిన ధనమిచ్చిన పిమ్మట విడిచి పెట్టఁబడుచుండెడి వారు. తన రాజ్యములో చేరినవారికి సౌఖ్యంబును, పరదేశముల నున్నవారి కుపద్రవము నతఁడు కలుగఁజేయుచుండెడి వాఁడు. ఏ భటుఁడు గాని, యాశ్వికుఁడు గాని, మంచి నడతకు, తోడి భటులనుండి జామీను లేనిదే తీసికొనఁబడెడు వాఁడు కాఁడు. సేనానాయకులు వారిచే వసూలు చేయఁబడిన ఘాతు సర్దేశ ముఖీలకు లెక్క చెప్పవలసిన వారగుటచే, ముందుగనే జీతమియ్యఁబడుచుండెడి వారు. శివాజీ కాలములో సైన్యసేవకొఱకు భూమిగాని రివిన్యూగాని యీనాముల క్రింద నిచ్చు పద్ధతి లేదు. ఇట్టి కట్టుదిట్టము లింత కఠినముగ నున్నను సైన్యములో క్రొత్తభటులు దాఖలగుటకే యిబ్బందియు నుండెడిది కాదు. [illegible]

కును హేశ్కారిలకును బార్గీరులకును సిలేదారులకును జాతీయ పతాకము క్రిందఁ జేరుట యంత ప్రజారంజక మింకొక టెద్దియును లేదు. దసరా యుత్సవంబు శివాజీచే నత్యంతాడంబరముగ జరుపఁబడు చుండెడిది. ఆనాఁడు క్రొత్తభటులను లాంఛనంబులతోఁ జేర్చుకొనుటకును ప్రాతభటులయొక్క మంచి చెడ్డలను కనుగొనుటకును వారి ననేకవిధముల సత్కరించుటకును జాతీయ యుత్సవం బాహ్లాదకరంబుగ ననేక యాటపాటలతో జరుపఁబడు చుండెడిది.

రొక్క జీతముల పద్ధతియు, స్వయముగ రివిన్యూ వ్యవహారమును జరపు పద్ధతియు శివాజీవలన తన దేశమునందంతటను ప్రారంభింపఁబడి విస్తరింపఁ జేయబడెను. శివాజీ దీని నూతనముగ నేర్పాటుచేయుటయేఁ గాక దానిని గూర్చి యెక్కువ శ్రద్ధపుచ్చుకొనుటవలన దేశీయచరిత్రకారు లీరెండు విషయములందును తరువాత వారు పూర్వాచారములనుండి భిన్నమార్గమును త్రొక్కుట నెక్కువ పాటించి యున్నారు. గ్రామప్రాంతముల యొక్క జమీదారులకు రివిన్యూ యధికారము లిచ్చినందు వలననే తత్పూర్వకాలములందు అల్లరులు జరుగుచుండెడి వని యాయనయొక్క దృఢవిశ్వాసము. వారు రహితులయొద్దనుండి యెక్కువ వసూలుచేసి రాజధనాగారములకు తక్కువఁబంపి తక్కిన ధనముతో సమయము దొరికినపు డల్లరులఁ గల్పించి ప్రధానాధికారముయొక్క యాజ్ఞలను నిర్లక్ష్యపెట్టుచుండెడి వారు. శివాజీ జీతములిచ్చి, యంతవఱకు జమీఁదారులచేఁ జేయఁబడు విధ్యుక్తకార్యములను, కమావిస్దారులును, మహాల్కారులును, సుబేదారులును చేయ నియోగించెను. కమావిస్దారు పంటలు పొలములమీఁద నుండగనే రొక్కముగగాని ధాన్యముగ గాని వసూలుచేయవలెను. పొలములన్నియు కొలత వేయఁబడి పుస్తకములందు స్వాముదారులతోఁగూడ నెక్కించుకొనఁ బడియుండెను. వారియొద్దనుండి రావలసినశిస్తునకు ప్రతిసంవత్సరమును కబూలియతులు (కవుల్లు) తీసికొనఁబడును. ధాన్యముగ శిస్తు వసూలు చేయఁబడినపుడు పంటలో $\frac{2}{5}$ కంటె సర్కారువారి కెప్పుడు నెక్కువలేదు. తక్కిన $\frac{3}{5}$ ను రయతుయొక్క భాగమైయున్నది. [illegible]

ప్రమాదనష్టకాలములందు తకావి అడ్వాన్సులు విరివిగ నియ్యఁబడుచుండెను. అవి నాలుగైదు సంవత్సరములలో వాయిదాలమీఁద మరల రాఁబట్టుకొనఁబడుచుండెడివి. సుబేదారులు రివిన్యూక్రిమినలు వ్యవహారములనుఁ గూడఁ జూచెడువారు. సివిలు ధర్మస్థానములయొక్క పని యంత ప్రాముఖ్యత వహించియుండలేదు. వివాదములేవైన సంభవించినపుడు సుబేదారు పార్టీల వారిగ్రామ పంచాయితీలయొద్దకు గాని, ముఖ్యమైన విషయములలో నితర గ్రామ పంచాయితీలయొద్దకుఁ గాని తీర్పునకుఁబంపి యాతీర్పుల నమలులో పెట్టుచుండెడివాఁడు.

జిల్లాయొక్క సివిలు అంగనిర్మాణమంతయు రాజాస్థానము నందున్న యధికారులకు లోఁబడియుండెను. అందు పంతు అమాత్యా, పంతుసచీవు మన కాలములో ఫైనాన్సుమంత్రికిని జనరల్ అకౌంటెంటు, ఆడిటరులకును బోల్పఁదగియుండిరి. జిల్లా లెక్కలన్నియు నీయుద్యోగస్థులిద్దఱకును పంపఁబడవలెను. అప్పటవి పరీక్షింపఁబడి, తప్పులు కనుఁగొనఁబడి, శిక్షింపఁబడును. ఈయుద్యోగస్థులు తమ యస్టాబ్లిషుమెంటులో నెవరినైన జిల్లాయుద్యోగస్థుల వ్యవహారమును తనిఖీచేయుటకు నియోగింపవచ్చును. పంతు అమాత్యుఁడును పంతు సచివుఁడును పీష్వా తరువాత గొప్పసివిలు ఉద్యోగస్థులు. వీరికి రివిన్యూ యధికారమేఁగాక సైనికాధికారములుకూడనున్నవి. అష్టప్రధానులను పరిపాలకమండలిలో వారు ముఖ్యమైన మెంబర్లు. రాజు తరువాత పీష్వా ప్రధాన మంత్రి. ఆయన సివిల్ సైన్య పరిపాలనముల రెంటికి నధిపతిగనుండి సింహాసనమునకు దక్షిణపార్శ్వమున క్రిందుగ సభలోఁ గూర్చుండి యుండును సేనాపతి సైన్యపరిపాలనకు మాత్ర మధిపతియై సింహాసనమునకు వామపార్శ్వమున క్రిందుగ మొట్టమొదట గూర్చునియుండును. అమాత్యసచివులు పీష్వా క్రింద కూర్చుని యుందురు. సచివునితరువాత మంత్రికూర్చుని రాజుయొక్క స్వంత వ్యవహారములనుఁ జూచుచుండును, అనగా (Private Secretary) గా నుండును. సోమంతు పరరాజ్యవ్యవహారములు కనుగొనుచు (Foreign Secretary) ఎడమవైపున సేనాపతిక్రింద కూర్చుని యుండును. ఆయనక్రింద పండిత రావు మతసంబంధమైన వ్యవహారములను గమనించుచు సభ నలంకరించును.

అటుపిమ్మట న్యాయాధీశుఁ (Chief justice) డెడమప్రక్కను కూర్చుని యుండును. అట్లు రచింపఁబడిన అష్టప్రధానుపద్ధతి ప్రస్తుత యిండియా గవర్న మెంటు పరిపాలనా తత్వమందును నేర్పడియున్నది. గవర్నరు జనరల్ లేక వైసరాయి శివాజీయొక్క స్థాన మాక్రమించి యుండెను. ఆయనతరువాత సైన్యముయొక్క ప్రధానాధిపతి గలఁడు. ఫైనాన్సు (Finance) ఫారిను (Foreign) మంత్రులు వాని తరువాత నున్నారు. ఇండియా గవర్న మెంటు నందు కార్యనిర్వాహణ సభలో (Executive council) మతాచార్యునకు గాని న్యాయాధీశునకు గాని యొక ప్రక్కను,మంత్రికి (Private secretary) రెండవ ప్రక్కను స్థలమేర్పఱుపఁబడి యుండలేదు. కాని వారి స్థానంబులను హోము డిపార్టు మెంటు మెంబరును,అడ్వొకేటు జనరల్ యును, పబ్లికు వర్క్సు మంత్రియు నాక్రమించియుండిరి. ఈ మార్పులు స్థితిగతుల భేదమువలనఁ గల్గి నవి. కాని యీ రెండు పద్ధతుల యంతరంబుననున్న యుద్దేశము, రాష్ట్రము యొక్క యుత్తమ యుద్యోగస్థుల సభ రాజుయొక్క ధర్మములను నెఱవేర్చు టకుసహాయపడుటకే యైయున్నది. శివాజీ మొట్టమొదట భావించి గాచరణ యందుఁ బెట్టినటులనే యతని వారసులును, యదార్థదృష్టితో నా పద్ధతులను నిర్వహించియుండిన యెడల, మహారాష్ట్ర కూటమునకు, ఉత్తమ శిక్షయుపా ధులు గల బ్రిటిషు ప్రభుత్వము నెదుర్కొనక మునుపే, జీర్ణావస్థనఁ గల్పిం చిన యనేకాపదలు సంభవింపకుండ నుండెడివి. ఈ జీర్ణంబునకు హేతు భూతంబులైన బీజంబులు, పండితరావు న్యాయాధీశులు తప్ప తక్కిన ప్రధాను లందఱును సైన్యాధిపత్యంబు లవలంబింపవలసిన యవసరంబులవలనఁ బుట్టి నవి. ఈ సైన్యాధి పత్యంబులు, సేనానాయకత్వంబున జయశీలురైన వారి చేతులలో, నధికారమును పెట్టినవి. శివాజీ మాత్రము బహు జాగ్రత్తతో నీ యుద్యోగములు వంశపారంపర్యములు గాకుండఁ గాపాడియుండెను. ఆయన యొక్క కాలములో పలుగురు సేనాపతుల నొకరి తరువాత నొకరిని నియమిం చెను. వారెవరనగా, మంకోజీ దహతొండే, నేతాజీ పల్కారు, ప్రతాపరావు గుజారు, హంబీరురావు మొహితీ. అతఁడు, మొదటి శివాజీయగు శ్రామాజు

పంతును తీసివేసి మోరోపంతు పింగళేను నియమించెను. పంతు అమాత్యుని యుద్యోగము కూడ నదేవిధముగ చేతులు మాఱినది. తక్కిన యుద్యోగము లెప్పుడును పారంపర్యముగ నొక్కవంశమునం దుంచఁబడలేదు. ఈ జాగ్రత్త కొంతవఱకు సాహూరాజ్యకాలములో నారంభమునందు గమనింపఁబడెను గాని, చివరకాలములో మొదటి 'ముగ్గురు పీష్వాలు' బాలాజీ విశ్వనాథుడును, మొదటి బాజీరావును, బాలాజీ బాజీరావును, శక్తి సామర్థ్యములుగల వారగుటవలన పీష్వాచీ (Peshwaship) వారి వంశమందు పారంపర్యమాయెను. తక్కిన ప్రధానులు సమర్థులు కాకపోవుటవలన వారియొక్క యాధిక్యత పరిక్షీణమై అధికార విభాగము వ్యత్యస్తమై నాశనహేతువైనది. పీష్వాయొక్క పరిపాలన కాలమంతయు, అష్టప్రధాన పద్ధతి నామమాత్రమై, నిరుద్యోగంబై, శివాజీ యుద్దేశించినటుల అంగ నిర్మాణయుక్తంబగు పరిపాలనకు బదులుగ, వంగ వైకల్యంబగు ప్రాచీన ఆసియా యధికారమై, కేవలము దాని జీవంబు కొఱకు ప్రధానాధికార స్థానంబుయొక్క బలంబు మీఁదనే యాధారపడియుండునట్టి దయ్యెను. ఇట్టి ఫలంబునకు శివాజీయొక్క పద్ధతి యుత్తరవాది కానేరదు. అతని పద్ధతినుండి విడిపడుటయే యతని యుద్యమము చెడిపోవుటకు కారణ మయ్యెను.

ఇంకొక విషయంబునఁ గూడ శివాజీ తనకాలముకంటె నతీతుండయ్యెను. అతఁడు తన క్రింద జయశీలురగు సివిలు సైన్యాధిపతుల కెవ్వరికిని జాగీరు లిచ్చుట కియ్యకొనలేదు. పీష్వాదగ్గరనుండి, సేనాపతి దగ్గరనుండి, క్రిందసిపాయి కారకూనుల వఱకును ధనముగాని గ్రాసముగాని జీతముక్రింద, సర్కారు ధనధాన్యాగారములనుండియే పుచ్చుకొనుటకు శివాజీవలన ననుజ్ఞాతులైరి. జాగీరుపద్ధతి యెంతమంచి స్థితిగతులక్రిందనైనను, ఎంతమంచి యుద్దేశములతోనైనను, దుర్వినియోగింపఁబడు నవకాశముగలదని యదిఖండింపఁబడెను. జాగీరుదారు సహజముగ సామంతరాజై, వారసత్వసంబంధముకలిగియున్నపుడు బలాత్కారమునఁగాకఁ దరువాతఁ దప్పింపఁబడఁజాలడు ఐకమత్యాభావమునకును, పరస్పరవిరోధభావమునకును ప్రోద్బలములు సహజముగనిండియాయుండు ద్వ

ఢంబులైయున్నవి. అందుమీఁద జాగీరు లిచ్చుపద్ధతియు, నట్టులియ్యఁబడిన భూమినుండి వచ్చుశిస్తుతో జాగీరుదారు కొంతసైన్యమునుంచుకొను పద్ధతియు, పైప్రోద్బలమును మఱింత దృఢతరంబుఁజేసి నిరుపద్రవమైన పరిపాలనను దాదాపుగ నసంభవము చేయును. శివాజీ, జిల్లాజమీఁదారులను తమరక్షణకొఱకు కోటలనుఁగూడ కట్టుకొననిచ్చెడువాఁడుకాడు. రహితులవలెనే వారిని కూడ రక్షణలేని గృహంబులందే నివసింప నాజ్ఞాపించెను. శివాజీయొక్క కాలములో ప్రసిద్ధిఁగాంచిన యుద్యోగస్థులెవ్వరును తమ సంతానమునకు గొప్పసంస్థానముల నార్జించి యియ్యలేదు. బ్రాహ్మణులలో మోరోపంతుపింగళే, అబాజీసోనదేవు, రఘూబల్లాలు, దత్తోఅన్నాజీ, నిరాజీరావుజీ, మహారాష్ట్రులలో మాలూశూరేలు, యశాజీకంకు, ప్రతాపరావుగుజరు, నేతాజీ పల్కారు, హంబీరరావు మొహితీ, మొదలైన వారెవ్వరును, 18వ శతాబ్దములో సాహూమంత్రులవలె, గొప్పకుటుంబసంస్థానములను స్థాపింపఁజాలకపోయిరి.

శివాజీ కాలములలో నాతఁడనుగ్రహించిన యీనాములు, దేవళములకును, ధర్మప్రతిష్ఠాపనలకును మాత్రమేయై యున్నవి. ఇవి ప్రజోపయోగమైన నిధులు. వీని ధర్మకర్తలు సైన్యోద్యోగములు లేనివారుగాన సామాన్యవ్యవహారములలో రాష్ట్రమున కుపద్రవకారులుఁగా నేరరు. శివాజీయొక్క ధర్మములలో, విద్యకుప్రోత్సాహముగ దక్షిణపద్ధతి యవలంబింపఁబడినది. మనప్రస్తుత పరీక్షలయొక్క ఫలితమునుబట్టి బహుమతులిచ్చు పద్ధతియొక్క పూర్వాచార మదియైయున్నది. బ్రాహ్మణులు, వారు నేర్చిన విద్యయొక్క గుణవైశాల్యములనుఁబట్టి యేర్పఱుపఁబడిన తరగతుల ననుసరించి, దక్షిణ లియ్యఁ బడెడువారు. ఆకాలమున సర్కారుపాఠశాల లేవియునులేవు. కాని యుపాధ్యాయులు తమ గృహములందే శిష్యులకు విద్యఁగఱపెడివారు. ఉపాధ్యాయులును శిష్యులును ప్రతిసంవత్సరమును బహుమతు లొసంగఁబడి దరిద్రపీడితులుగాకుండ రక్షింపఁబడెడువారు. మహారాష్ట్రమునందు సంస్కృతవిద్య, శివాజీ యైశ్వర్యమునకు వచ్చునప్పటికి, బహునీరసస్థితి యందుండెడిది కాని యతఁడు చేసిన ప్రోత్సాహమువలన, దక్కను పండితులకు పేరుఁజెందెను. అనేకులు, విద్యాభ్యాసము

కొఱకు కాశికేగి యచట పాండిత్యమును సంపాదించి, మగిడి తమదేశమునకు వచ్చి తమరాజుచే సత్కరింపఁబడుచుండెడువారు. శంభాజీ మొగలులచే చెఱపట్టుకొనఁబడినపుడు విద్యాప్రోత్సాహముయొక్క పద్ధతి తేలిగాంరయొక్క దాభడేలు కొన్నిదినములవఱకు నిలువఁబెట్టిరి. అటుపిమ్మట దాభడేలు వారి ప్రాముఖ్యతనుండి తొలఁగినపుడు పీష్వాలు దాని చేఁబట్టి వృద్ధిచేసిరి. ఈ పీష్వాల కాలములోనే తెలుఁగుదేశము బ్రాహ్మణుల నేకులు సంపాదనలకు పూనా వెళ్లెడివారు. తెలంగివాడాయనియొకభాగము పీష్వాభవనములలో శిథిలమైయిప్పటికిని గలదు. ఈపద్ధతి బ్రిటిషుపరిపాలన వఱకునుండెడిది. అప్పటివఱకు ప్రతిసంవత్సరమును దక్షిణల క్రింద 5 లక్షలరూపాయీలకు మించి వ్యయమగుచుండెనని తెలియవచ్చుచున్నది.

పైనిజెప్పిన వివరములను బట్టి, శివాజీయొక్క సివిలు పరిపాలనాపద్ధతి దానిపూర్వపు దానినుండియు, తత్పరమైన దానినుండియు ననేక ముఖ్యవిషయములలో భేదముగ నుండెనని తెలియవచ్చుచున్నది.

మొదటిది.—అతని పరిపాలన పద్ధతికి కేంద్రస్థానములైన కొండకోటల కాతఁడిచ్చిన ప్రాముఖ్యత యందును.

రెండవది.—గొప్పయుద్యోగము లొక్క వంశములోనే పారంపర్యముఁ గాకుండఁజేయుటయందును.

మూడవది.—సివిల్ సైని కోద్యోగుల జీవనము నిమిత్తము జాగీరుల నియ్యకుండుటయందును.

నాల్గవది.—జిల్లా గ్రామజమీఁదారుల జోక్యములేకుండ స్వయముగ సర్కారు ఉద్యోగస్థులవలననే రివిన్యూ వ్యవహారముఁ జరిపించుటయందును.

ఐదవది.—జీతములు సర్కారు ధనధాన్యాగారములనుండియే యిచ్చుటయందును.

ఆరవది.—అష్టప్రధానులపద్ధతి నేర్పఱచి ప్రత్యేకమైన యుద్యోగములు వారికి నిర్ణయించి, రాజున కుత్తరవాదులుగ నుండునట్లు చేయుటయందును.

ఏడవది.—పరిపాలనలో సైనికాధికారమును, సివిలధికారమునకు లోఁబడియుండునట్లు చేయుటయందును.

ఎనిమిదవది.—అన్ని యుద్యోగములలోను బ్రాహ్మణులను ప్రభులను, మహారాష్ట్రులను సమానముగఁ గలిపి యుంచి యొకరిపై నొక రడ్డుగ నుంచుట యందును.

యదార్థమునకు, ఈలక్షణములలో కొన్ని; మహారాష్ట్రాధికారము స్వరాజ్యముయొక్క చిన్నవైశాల్యమునుండి విస్తరించి, తూర్పున కటకమంత దూరమును, పడమట కఠియువాడు వఱకును, ఉత్తరమున డిల్లీ, దక్షిణమున తంజాపూరు వఱకును, వ్యాపించినపుడు, మార్పులేకుండ నుంచఁబడుటకు వీలు లేదు. కేవల మహారాష్ట్రదేశంబున, సంఘము, సైన్యము, సేవకులు, సరదారులు, సామంతు లందరు నొక్కజాతివారే యైనందువలన నొక్కభక్తి బంధము వారి నందఱిని దగ్గరకు బిగఁబట్టి యుంచెను. ఇండియాయందు దూరప్రదేశములలో, జయింపఁబడిన జను లొకజాతియు, తమ సైన్యాధిపతులయందును ప్రధానాధికారమునం దనురాగ బంధములేని జీతబత్తెములకు కుదిరిన సైనికులు మరియొక జాతివారునై యున్నపుడు, పైని జెప్పఁబడిన భక్తిబంధ మసంభవమగును. కావున శివాజీయొక్క ప్రతిష్ఠాపనలు, పైన వర్ణింపఁబడినటుల, నిండియాయొక్క యన్ని భాగములకును యోగ్యమగునంత సాగుతనంబులేనివగుటయం దాశ్చర్యములేదు. పర్వత దుర్గములకును సమదేశములకునుఁ గల సంబంధము కేవలము స్థానిక లక్షణముగావున, గుజరాతు, మాల్వా, లేక మహారాష్ట్రముయొక్క తూర్పు జిల్లాలయొక్క సహితము సమదేశములందా పరిపాలనా పద్ధతి ప్రయోజనకరంబు కాదు. అట్టికారణమువలననే జమీఁదారులను తప్పించి రివిన్యూవ్యవహారమును స్వయముగ జరుపుటకు, దూరదేశములలో నట్టియాచారమనాదినుండి విరుద్ధమైనందున, దుస్సాధ్యమై యుండెను. ఇందువలనను మఱి యితరహేతువుల వలనను, కొంతమార్పున కవకాశమిచ్చినను, తక్కినవిషయములలో శివాజీ పద్ధతినుండి విడివడుట తిరోగమనమున కంజయనుట కేమియు సందేహములేదు. అతనితరువాత వచ్చినవా రతని పద్ధతుల

యొక్క వివేకమును గ్రహింపలేక, తత్కాలానుకూలంబుయొక్క మోహంబునకుఁ జిక్కిరనుట తప్ప యింకేమియు క్షమాపణ చెప్పుటకు వీలులేదు. అట్లు చేయుటవలన నతఁడు స్థాపించిన యంగనిర్మాణయుక్తంబైన యైకమత్యము బహునీరసంబగు బంధంబులచేఁ గలపిపట్టియుంచఁబడు నంగనిర్మాణ రహితంబగుసముదాయమై, దాని చరితయందు మొదటి గొప్ప యాపద యాసన్నమైన తోడనే జీర్ణంబగుటకు సిద్ధమయ్యెను.

అష్టప్రధాన సభవలన పరిపాలనా పద్ధతి, సాహూ రాజ్యకాలములో నారంభదశయందు జరుపఁబడినది కాని క్రమక్రమముగా పీష్వాయధికారము వృద్ధియై తక్కిన ప్రధానులను క్రమ్ముకొనినపు డప్రయుక్తమై, తరువాత పీష్వాలు పూనాను తమ రాజధానిగఁ జేసికొనినపుడు పూర్ణముగ వేరుమాసిపోయెను. పీష్వాతరువాత గొప్పసివిలుద్యోగస్థులగు పంతుఅమాత్య పంతుసచివులు, సాహూ మరణానంతరము మహారాష్ట్రచరిత్రలోనే యాధిక్యతను బొందక కేవలము జాగీరుదారులై యుండిరి. పీష్వాలు వారి స్థానముల మఱెవ్వరిని నియమించుటకు లక్ష్యపెట్టక, నన్నికార్యములను తామే నిర్వహింప సమకట్టిరి. వారికి వారే సేనాపతులు, వారే సామంతులు, వారే మంత్రులునై యుండిరి అట్లు స్థాపింపఁబడిన *యేకవ్యక్తి పరిపాలనకు, శివాజీ ప్రతిష్ఠాపన లేని తరువాత వారిచే విశ్వాసముతో నాదరింపఁబడని కారణమున స్థైర్యముండకపోవుట యం దాశ్చర్యములేదు.

గొప్ప యుద్యోగములు, వంశపారంపర్యంబైన వతనులవలె, నొక వంశజుల కిచ్చుట, శివాజీచే నిర్ణయింపఁబడి, నిర్వహింపఁబడిన యుపదేశములనుండు తిరోవృద్ధి కరంబగు మతి యొక వీడికోలై యున్నది. పీష్వాచీ వంశపారంపర్యమైనపుడు, తక్కిన యుద్యోగములును వంశపారంపర్య మగుట యం దాశ్చర్యమేమియును లేదు. కాని సుగుణసామర్థ్యంబులు వంశపారంపర్యములు గాకపోవుటనుఁ బట్టి, ఉద్యోగస్థానము త్వరలో నసమర్థుల వలన

---

* ఏకవ్యక్తి పరిపాలన అనగానొక్క మనుజునిచేనిరంకుశముగఁ జేయంబడు పరిపాలన.

నాక్రమింపఁబడి కొంతకాలమగునప్పటికి రావలసిన దురవస్థను తీసికొని వచ్చెను. పీష్వాలయొక్క నాలుగు తరముల వారు స్వభావ సిద్ధమైన సామర్థ్యము గలిగి యుండుటవలన నధికారమును వహించిరని చెప్పవచ్చును, కాని తక్కిన యుద్యోగస్థులు తమ వంశములం దుద్యోగమును నిలుపు కొనుటకు హక్కును కూడ లేనివారైరి. క్రొత్తపురుషులు, క్రిందిస్థానములనుండి యత్యుత్తమ పదవులకు వచ్చిరి, కాని సామ్రాజ్య సభాస్థానంబున వారికి తావు లేకపోయెను. ఇందు కుదాహరణముగ నానా ఫడ్నవీసు, ఫడ్నవీసుగ నుండి ప్రధానమంత్రి పదంబు నాక్రమింప నర్హుండయ్యెను. మహాదాజీసింధియా సామాన్యసరదారుగనుండి, యాకాలములో గొప్ప సేనాధిపతి యాయెను. వీరిద్దఱకుగాని, వీరట్టివారికిగాని ప్రధాన సభయందు తావులేకపోయెను. వీరిద్దఱు నొకరినొకరు బలయుపాయంబులవలన, రెండవవారి యధికారము నాక్రమించుకొనఁ బ్రయత్నించి, యొండొరులను త్రుంచివేసి కొనిరి. ఇంతకంటె తఱచుగ గొప్పసైన్యాధిపతులందఱును, తమతమ దేశభాగంబులయందు రాజులై యుద్ధసమాధానములను తమ యిష్టమువచ్చినతీరునఁ జేసికొనుచుండిరి. మంత్రిసభాస్థానమువలని పరిపాలనాపద్ధతియే, మాఱినస్థితిగతుల ననుసరించి సవరింపఁబడిన యవసర విస్తరంబులతో సాగింపఁబడి వంశపారంపర్యనియమమంత వేరుపాఱకుండ నాపి వేయఁబడినయెడల, పై యుపాయము చాలవఱకు తప్పింపఁబడెడిదే.

అయిన నన్నిటిలోను గొప్పపీడికోలు, తమ సంగ్రామిక పరాక్రమముచే వారు జయింపఁగల గొప్పదేశభాగములను, వారికే జాగీరులుగ నియ్యఁగూడదను నియమము పరిత్యజించుటయందున్నది. కొంత వఱకీ పీడికోలు సాహూరాయొక్క పరిపాలనపై, నాతని యధికారనిర్వహణమునకు పూర్వము జరిగిన కార్యముల వలన బలాత్కరింపఁబడినది శంభాజీ మరణానంతరము మహారాష్ట్ర దేశంబంతయు మొగలులచే జయింపఁబడినది. శంభాజీ సోదరుడగు రాజారామును, అతని మంత్రులును దక్షిణమునకు తఱుమఁబడిరి. కార్యమంతయు పునరారంభము చేయఁబడ వలసివచ్చెను. మరల నధికారమునకువచ్చిన క్రొత్తనాయకులందఱును, వారి యిష్టానుసారంబుగ వదలివేయఁబడవలసినవారైరి. కావున రాజా

రాముయొక్క మంత్రు లెవరీ దోషారోపణ కష్టములు కారు. ఈప్రతికూలపుస్థితిగతుల యిబ్బంది, సాహూయొక్క ప్రారంభ రాజ్యకాలమునందంతటను కఠినతమముగనే యుండుచుండెను. అయినప్పటికిని సాహూరాజ్యము మహారాష్ట్రమున స్థాపింపఁబడి, అన్నిదిక్కులకును సామ్రాజ్యము విస్తరింపఁజేయు నాలోచనలు సంకల్పమైనపుడు, తత్కాలమున కనుసరింపవలసిన వీళ్లయందు మోసామంత దృఢముగాలేదు గావున తప్పించుకొనఁబడవచ్చును. సరిగా నిదియే సమయమున ప్రతియగృష్టవంతుఁడగు యోధుఁడును తనజాగీరు నిష్టము వచ్చినటుల వృద్ధిచేసికొనుటకు సమ్మతింపఁబడెను. పీలాజీ గాయకవాడును దామాజీగాయకవాడును గుజరాతునకు ప్రభువులుగ నేర్పరచుకొనిరి. నాగ్పూరుభాంస్లే లా దేశమున నధికారులైరి. సింధియాయుహోల్కారును, పవారులును, మాల్వాయుత్తరయిండియాలయందు స్థావరము నేర్పఱుచుకొనిరి. వీరందఱును, తమ రివిన్యూలయందు కొంతభాగమును, పేష్వామహారాష్ట్రింబున ప్రధానాధిక్యతనువహించుచున్నందున, నతనికిచ్చు సమాధానముతో నొకవిధమైన నీరసమగు భక్తిబంధమున ప్రధానాధికారమునకు కట్టుపడియుండిరి. ఈజాగీరులు వంశక్రమానుగతంబు లగుటతోడనే, అంగనిర్మాణయుక్తంబగు నధికార మంగనిర్మాణరహితంబగు నధికారముగా పూర్ణముగ మాఱిపోయెను. ఈ పెద్దదేశభాగంబులను మొదట నార్జించినవారు తమసామాన్యయుద్యమ విషయంబున కొంతభక్తిపరులైయుండిరి. కాని వారి వారసులుమాత్రము తాముపాలించుదేశములు స్వంతరాజ్యములవలె నెంచుకొని పైవారి జోక్యము నెంతయు నిరాకరించిరి. ఇట్లు శివాజీవలన నేర్పఱుపఁబడిన రాజనీతినుండి ముఖ్యయతిక్రమణలు సామాన్యయుద్యమమునకు నాశనహేతువులయ్యెను.

భూమి శిస్తు, గ్రామజిల్లా జమీఁదారుల మధ్యవర్తితనము లేకుండ స్వయముగ వ్యవహరింపఁబడు శివాజీయొక్క పద్ధతులు, అతని తరువాత వారి వలన మొత్తముమీఁద క్రమముగనే నిర్వహింపఁబడెను. పేష్వా పరిపాలనయొక్క యుత్తమ కాలమునుండి నానాఫడ్నవీసు మరణాంతము వఱకును, శిస్తును గుత్తకిచ్చు పద్ధతి సమ్మతింపఁబడలేదు. చివర పేష్వాయగు రెండవ బాజీ

రావు కాలములోనే కేవల మహారాష్ట్ర దేశములోని జిల్లాల కిస్తు గుత్తకియ్యఁబడినవి. మాల్వా, గుజరాతు, మొదలైన దూరప్రాంతములగు నుత్తర యిండియా భాగములలో, దేశ మస్వస్థతగ నుండుటవలన నా పద్ధతి అక్కడ యెక్కువ వనుకూలమైనందున న్యాయాచార మందుండెను. ఈ విషయమునందు, శివాజీ యొక్క సాంప్రదాయములు మొత్తము మీఁద గౌరవింపఁబడెను కాని, యుద్యోగములు మహారాష్ట్రులలోను, బ్రాహ్మణులలోను, పరభూలలోను సమానముగ పంచియిచ్చు జాగరూకత, యతని తరువాత వారి యామోదమును పొందినట్లు కనుపడదు. శివాజీయొక్క యారంభ చరిత్రలో నెక్కువ యాధిక్యతను వహించిన పరభూలు, బాలాజీ బాజీరావు కాలమునుండి పీష్వాల యొక్క తరువాత చరిత్రలోనే యాధిక్య స్థానము నాక్రమింపక పోయిరి. ఒక్క శకారాము హరి మాత్రము రఘునాథరావు పీష్వా క్రింద నతని ప్రియసేనానాయకుఁడై యాకాలమునందు గానుపించెడిని. బరోడా నాగపూరు దర్బారులందు మాత్ర మావర్ణమువారు మంత్రులుగను, సేనాపతులుగను, ప్రాముఖ్యత వహించుచునే యుండిరి. బ్రాహ్మణుల విషయములో, శివాజీ క్రింద కొంకణస్థు లుద్యోగముల నాక్రమింపలేదని యొక యభిప్రాయము కలదు. అయినను, దేశీయ చరిత్రకారులు మూడు శాఖల *బ్రాహ్మణులును, పర్వత దుర్గముల సేనాపతులుగను, సుభేదారులుగను నియమింపఁబడినట్లు స్పష్టముగఁ జూపుచున్నారు. శివాజీయొక్కయు, నతని కుమారులయొక్కయు కాలములలో దేశస్థ బ్రాహ్మణులు సహజముగ ప్రముఖులై యుండిరి. సాహూకాలములో పీష్వా లధికారము నాక్రమించినమీదట, వారి శాఖవారగు కొంకణస్థుల యెడల పక్షపాత ముదయించెను. అటు తరువాత ప్రముఖులగు దేశస్థ జాగీరుదారులు రఘునాథరావునకు నతనియన్న కుమారులకు నైన యుద్ధములలో నతని పక్ష మవలంబించినందున, కొంకణస్థుల యాధిక్యత ప్రబలమాయెను.

శివాజీ కాలములో సైనిక వృత్తిని మహారాష్ట్రులొక్కరే స్వాధీనము చేసికొని యుండలేదు, కాని వారు సైన్యముయొక్క యన్ని యుద్యోగము

* కొంకణస్థులు, దేశస్థులు, శన్వీలు.

లందును ప్రధానతఁగ నుండిరి. శివాజీ క్రింద బ్రాహ్మణ సేనాపతులు మహారాష్ట్ర సేనాపతులతోఁ దులదూఁగెడు ధైర్యసాహసములఁ గలిగియుండిరి. మొదటి పీష్వాల క్రిందఁగూడ నిట్లే యుండుచువచ్చెను. అత్యుత్తమ మహారాష్ట్ర సేనాపతులు, మొదటి బాజీరావు పీష్వా క్రింద సుశిక్షితులైరి. బాజీరావు క్రింద సేవఁజేసిన గొప్ప మహారాష్ట్ర వంశములు దూరప్రాంతముల ప్రభువులుగా నేర్పఱచుకొని ప్రధానాధికారమునకు భంగముఁ గల్పించునంత యధికార సమన్వితులైనపుడు, దక్షిణమున వారితోఁ దుల దూఁగుటకు బ్రాహ్మణ సేనాపతులను సిద్ధము చేయుట పూనాయందు రాజనీతియొక్క యుద్దేశమయ్యెను. అంతట, పట్వర్ధనులు, ఫడ్కేలు, రాస్తేలు, గోక్లేలు, సైన్యాధిపత్యంబున ప్రాముఖ్యత వహించిరి, కాని వీరు సింధియా హోల్కారుల యొక్క యుత్తమసైన్యములతోఁ జాలలేకపోయిరి. అయిన నట్లు కల్పింపఁబడిన వైరము తక్కిన కారణములతోఁగూడ సామాన్య యుద్యమమునకు చాల హానికరమాయెను.

అటుల, శివాజీ యేర్పఱచిన నియమములనుండి యతని తరువాత వారు విడివడిన వాంశంబు లందెల్ల, మహారాష్ట్రరాజ్యముయొక్క నీరసవినాశ కారణంబులు, ఇండియాలో బ్రిటిషు అధికారముతో సంఘట్టన మొందక మునుపే తేటపడుచున్నవి. ఈ యధికార మాధిక్యతను సంపాదించినపుడు శివాజీచే నేర్పఱుపఁబడిన నియమములనే యవలంబించెను. ఇండియాలో బ్రిటిషుప్రభుత్వము, సివిలు సైనిక వ్యవహారములను రెంటిని విడదీసి, రెండవ దానిని మొదటిదానికి లోఁబడియుంచు, నియమము ననుసరించియే జరుపఁబడు చున్నది. ఇంతేఁగాక, రాజసేవకు రొక్కజీతము లిచ్చుటయందును, సైనిక సివిలు మొదలైన సేవల కీనాము లియ్యకుండుట యందును శివాజీ పద్ధతులనే ప్రస్తుత రాజ్యము వా రవలంబించియున్నారు. ఎట్టి యుద్యోగములకైనను వారసత్వపు హక్కును వా రంగీకరించుట లేదు. గవర్నమెంటు, బోర్డులు కౌన్సిలుల వలన జరుపఁబడుచున్నది గాని యొక్క ప్రభువుయొక్క నిరంకుశబుద్ధి ప్రకారము జరుపఁబడుట లేదు. భూమి శిస్తు స్వంత జీతగాండ్రవలన రాజ్యము వారు

జరుపుచుండిరిగాని జమీందారులకు గాని గుత్తదారులకుగాని వసూలుచేయుట కిచ్చుటలేదు. జనులలో నన్ని తరగతులవారికిని యుచితరీతిని యుద్యోగము లను పంచి యిచ్చుచుండిరి. ఈ రాజనీతి నియమము నవలంబించుటచే, స్వల్ప సంఖ్యాకులగు నింగ్లీషువారు, తమ పరిపాలన యొక్క దేశవిదేశ విమర్శకులకు రాజతంత్ర మాహాత్మ్యమువలె నద్భుతంబగు తెరంగున దేశమునంతను పరిపాలించుచున్నారు. శివాజీయొక్క నియమము లతనికి జయప్రదంబు లగుటవల ననేగాక, అతడు కూడఁదీసికొని వచ్చిన కూటముయొక్క జీర్ణంబులపై తమరాజ్యమును నిర్మించుకొనిన వారికి కూడ వాని నవలంబించుట వలన జయంబు సమకూర్చినందు వలనను, శ్లాఘాపాత్రంబులైన వని సమర్థించుకొని యుండెను.

ప్రకరణము. 12.

శంభాజీ.

1680—1689.

శివాజీ తన యంత్య దినములలో, తన మంత్రులతో శంభాజీయొక్క దుష్ప్రవర్తనమువలన తన మరణానంతరము రాష్ట్రమునకు కీడు వాటిల్లఁ గలదని యప్పుడప్పుడు పల్కుచుండెడు వాఁడు. ఈ మాటలను సోయరాబాయియు నామె పక్షమువారును, అప్పటికి పదివత్సరముల వయస్సునన్న రాజారాము రాజుగా నుండవలయునని యతని యుద్దేశమైనట్లు సన్నగా గ్రహించిరి. కావున శివాజీ కాలము చేసినతోడనే, రాజారామునకు మోరోపంతు అన్నాజీ దత్తూలు మొదలైన వారు సంరక్షక సభగ నుండి యతని పేరున రాజ్యము నడుపుటకు, తల్లియగు సోయరాబాయి ప్రోత్సాహమువలన నేర్పాటు చేయఁబడెను. తక్కిన ప్రధానులును దీని కంగీకరించిరి. తద్విషయకమైన ప్రయత్నములు సలుపఁబడెను.

శివాజీయొక్క మరణము, శంభాజీయొక్క నిర్బంధము కట్టుదిట్టముగఁ జేయఁబడు వఱకును, రహస్యముగ నుంచఁబడెను. ఉత్తరక్రియలు రాజబంధువుడగు షాజీ భాంస్లేచే రహస్యముగ జరుపఁబడెను. శంభాజీ తండ్రిచే నిర్బంధింపఁబడిన పన్హాలాకోటకు కర్ణాటకయుద్ధములందు ప్రసిద్ధిగాంచిన జనార్దనపంతు సోమంతు కొంతసైన్యముతోఁ బంపఁబడెను. దానికి దగ్గిరగనుండు పంచవటి గ్రామమున 10,000 గుఱ్ఱపు దళ ముంచఁబడెను. సేనాపతి హంబీరురావు కరారు వద్ద సైన్యముతో నిలచియుండుట కాజ్ఞాపింపఁబడెను. శంభాజీని వశములో నుంచుకొనిన పన్హాలాకోట కావలిసైన్యాధిపతియగు హీరాజీఫర్జందున కీ జరుగుచున్న వ్యవహార మంతయును తెలియఁబఱచుచు లేఖ యంపఁబడెను. కాని



శంభాజీ.

శంభాజీ యిది యెట్టులనో గ్రహించినవాఁడై చారుని బెదరించి యాలేఖను తీసికొని యంతయు గ్రహించుకొనెను. హిరాజీఫర్జందు కొంకను పాఱిపోయెను. శంభాజీకోటను వశము చేసికొనెను. కావలిసైనికులు స్వాధీనమైరి. కాని యిద్దరు ముఖ్యయుద్యోగస్థుల నతఁడు చంపించెను. కోటగోడల వెలుపల తనకు మిత్రులెవరో శత్రులెవరో తెలియక కోటను రక్షించుకొనుచు, యదృష్టమున కతఁడెదురు చూచుచుండెను. జనార్దనపంతు కోటను కొన్ని వారములు ముట్టడించి యటుతరువాత కొందఱు భటులను చుట్టు కావలియుంచి, తాను మాత్రము కొల్లాపురమున నివాస మేర్పఱుచుకొని యుండెను.

శంభాజీ మెల్లగ నా కావలిభటులను కొందఱను తన పక్షమునకుఁ ద్రిప్పుకొని, యొకనాటిరాత్రి యాశ్రేణులనుదాటి కొల్లాపురమునం దజాగ్రతగనున్న జనార్దనపంతును పట్టుకొని ఖైదీగ పన్హాలాకు తిరిగిఁదీసికొనివచ్చెను. శివాజీ పుత్రునకు తగిన యీ చాతుర్యమునకు సేనాపతియగు హంబీరురావు మెచ్చుకొని యతనికి విధేయుఁడయ్యెను. మోరోపంతును, అన్నాజీ దత్తు నెడలఁగలవైరము చేతను, శంభాజీ పక్షము జయమగుచున్నదను నమ్మకము చేతను, తానుగూడ శంభాజీకి విధేయుఁడయ్యెను. పంచవటిదగ్గరనున్న సైన్యమింతటితో నతని పక్షము చేరెను. ఇట్లుగలిసిన సైన్యములతో శంభాజీ రాయగడకు ప్రయాణమాయెను. ఇతఁడు వచ్చునంతలో రాయగడలోని సైన్యముకూడ నితని పక్షమునకే తిరిగి యతని యధికారమున కెదురు తిరుగువారినెల్ల కారాగారబద్ధులఁజేసి కోటతలుపులను తెరచి యతనికి స్వాగతంబిచ్చెను. 1680 సం॥ము జూను మాసాంతమున నతఁడు రాయగడ ప్రవేశించెను.

శంభాజీ తండ్రి పోయినప్పటినుండి రాజధానిప్రవేశించు వఱకును, తన పూర్వప్రవర్తనఁబట్టి యెవ్వరునెదురుచూడని తృప్తికరమైన శక్తిసామర్థ్యములను కనుబఱచెను. కాని సైన్యములన్నియును లోఁబడి జనులందఱు నామోదించియున్న స్థితిని గ్రహించి యందఱకును క్షమాపణ ననుగ్రహించిన యెడల నతని పూర్వచర్యలన్నియును మరపున మాసి పోయెడివే. కాని రాయగడ

యందు కాలుబెట్టిన తోడనే యతని దుస్స్వభావమంతయు మరల ప్రదర్శింపఁబడెను. అన్నాజీ దత్తు సంకెలలు వేయఁబడి కారాగారమందు త్రోయంబడెను. అతనియాస్తి సర్కారునకుఁ గలుపుకొనఁబడెను. రాజారాముకూడ చెఱసాలఁ బెట్టఁబడెను. సోయరాబాయి చెఱపెట్టఁబడి శంభాజీ దగ్గరకు దీసికొనిరాఁబడినపు డాఁడామె ననేకవిధంబుల నవమానించి తండ్రిని విషముపెట్టి చంపినదని యక్రమముగ నామెనుదూషించి, నిరాహారంబున నామె చంపఁబడుట కాజ్ఞ యిచ్చెను. ఆమె పక్షముచేరిన మహారాష్ట్ర యుద్యోగస్థులు శిరచ్ఛేదము చేయఁబడిరి. అందొకఁడు రాయగడ పర్వత శిఖరంబునుండి క్రిందపడద్రోయఁబడెను. ఈ యనవసరమైన క్రూరకృత్యములు సోయరాబాయి యొక్క బంధువర్గంబుయొక్క శత్రుత్వమునకు కారణంబులగుటయేగాక, యతని రాజ్యప్రారంభమున కరిష్టసూచకంబులుగ నెంచఁబడినవి. అతఁ డాగష్టు మాసారంభమున సింహాసనాసీనుండైనపు డనేక దుశ్శకునంబులుగలిగినటుల దేశమునందు వదంతులు ప్రచురమయ్యెను.

శంభాజీయొక్క జీవితకాలము ముఖ్యముగ జింజీరాయందు సిద్దీలతోడను, పోర్చుగీసువారితోడను నిష్ఫలమైన యుద్ధములతో గడుపఁబడెను. మొగలుల దండయాత్ర నడ్డగించుట కతఁడు తగినంత ప్రయత్నము చేసియుండలేదు. మధుపాన వ్యభిచార వ్యసనంబులందుఁ జిక్కుకొని యతఁడు తమోరాశింగూలి యదియే యానందముగ నెంచుకొని రాజ్యాధికారంబు తన భోగంబునకే యనుకొని ప్రజాసౌఖ్యంబును మఱచి మదోన్మత్తుఁడై కాలంబు గడపెను. స్వబల పరాక్రమంబుచేతను, స్వదేశాభిమాన ప్రదీప్తతేజంబుచేతను, స్వధర్మానురాగ ప్రబుద్ధశౌర్యంబుచేతను, తండ్రిచే సంపాదింపఁబడిన రాజ్యము కేవలవారసత్వహక్కుచే శంభాజీకిఁ జేరుటవలన నది త్వరలో గొప్ప ప్రమాదములోనఁ జిక్కుపడెను.

శివాజీ జయసింగునకు లోఁబడి ఢిల్లీకి ప్రయాణమై యచ్చట చక్రవర్తిచే నిర్బంధింపఁబడుట మహారాష్ట్ర చరిత్రలో మొదటి గొప్పయాపద. కాని యతని యదృష్టమువలనను, యుపాయమువలనను తప్పించుకొనుటయేగాక యతఁ

ఔరంగజేబుచే సఖ్యమున కప్పముండగు రాజుగా నెంచఁబడునట్లు చేసికొనఁ గలిగెను. ఔరంగజేబు దక్కను పై గన్నువేసి యుండెనని యతఁడెఱింగి తన కడపటి పంద్రెండు వత్సరముల జీవిత కాలమును, దేశమును, చిట్టచివర యాఘాతము నెదుర్కొన, సంసిద్ధము చేయుటకు, వినియోగించెను. బీజపూరు గోలకొండలతో యంతఃకలహములను మఱచి, వారిని తనతో సఖ్యము చేసికొని మొగలుల నెదిరింప నియ్యకొనున ట్లతఁడు చేసి యందువలన నా రెండు రాజ్యములును లాభము పొందునట్లు చేసెను. అతఁడు దూరదృష్టితో దక్షిణమున కావేరి సీమయందు రక్షణకొఱకు మఱికొన్ని కోటల నవసరమైనయెడల తలఁ దాచుకొనుట కేర్పఱచెను. సహ్యాద్రి పర్వతముల పొడుగునను, దుర్గము లన్నియు మంచి స్థితియం దుంచఁబడెను. సముద్ర తీరమున నావసైన్యమంతయు నుపయుక్తముగ నుంచఁబడెను. ఇంతేఁగాక నతఁడిచ్చిన సుశిక్షవలన నతఁడెక్కడికిఁ దీసికొనిపోయిన నచ్చటికి సంతోషముగ ననుగమించుటకును, అతని మనోరథముల నమోఘమైన భక్తి జయంబులతో నెదుర్కొచూచుటకును, సిద్ధులైన వీరపురుషులును, జనులందఱిలో నతఁడు గల్పించిన స్వతంత్రప్రీతియు నాత్మవిశ్వాసము నతని రాజ్యమునకు దుర్భేద్యంబులగు రక్షణ ప్రాకారములని మిత్రులచేతను శత్రులచేతను సమానముగ స్తుతింపఁబడెను కాని యాతఁడు తన రాజ్యమునకు వారసత్వమును గూర్చి తగిన యేర్పాటు చేయక పూర్వమే యకస్మాత్తుగ చనిపోయెను. తక్కిన యన్ని యుద్యోగములకును వారసత్వ మంగీకరింపఁబడక పోయినట్టులనే రాజునకుఁ గూడ వారసత్వ మంగీకరింపఁబడక నేదైన పద్ధతివలన సమర్థుఁడును, ధర్మానురక్తుఁడును, దయావంతుఁడు నగు రాజు నేర్పఱచుకొను నియమ మొకటుండిన యెడల హిందూదేశము పరులకజేయంబై చిరకాలము స్వతంత్ర మనుభవించెడిదే కాని పలు వర్ణములును, పలుజాతులును కలిగి ప్రతినిధిపరిపాలన నెఱుఁగకపోవుట వలన దేశ మట్టి యనుకూలములు గలిగిన రాజ్యమునకు తరువాత లోఁబడి పోయెను. కాని అంతవఱకును మహమ్మదీయులకు మాత్రము మరల లోబడక అప్పటప్పటికి దేశమునందు జన్మించుచు వచ్చిన సమర్థులగు మంత్రిపుంగవులచేతను, వీరపురుషుల

చేతను; రక్షింపఁబడుచు మహారాష్ట్రరాజ్యము కొంతయోటువడినను మరల
జయంబునొందుచు జరగుచు వచ్చెను. ప్రస్తుతము శివాజీయొక్క యకాలమర
ణముచేతను,శంభాజీయొక్క దుర్నడతచేతను మహారాష్ట్రచరిత్రయందు రెండ
వ గొప్ప యాపద సంఘటిల్లినదని, చెప్పవచ్చును. ఈశంభాజీ యొక్క జీవిత
చరిత్రయందు విశేషాంశములు లేమింజేసి స్వల్పముగ ముఖ్యాంశంబులగు వాని
మాత్రము గమనించి చూచెదముగాక.

శివాజీ దక్షిణకర్ణాట యాత్రకరిగినపుడు సూరతు మొగలు గవర్నరగు
ఖాన్ జహాను బహద్దురుతో సంధి చేసుకొనినను, జంజీరా అబ్సినియనులతో
వైరము మాత్రము ముగియలేదు. కొంకణమునందు వారికిని మహారాష్ట్రులకును
పోరాటము జరుగుచునే యుండెను. శంభాజీ సింహాసనాసీనుండైన పిమ్మట కల
హములు మఱింత యెక్కువయ్యెను.

బొంబాయి హార్బరు ప్రవేశమార్గము దగ్గిర నున్న హెన్రీయను ద్వీపము
నందలిపర్వత దుర్గమును శివాజీ 1679వ సం॥ములో నాక్రమించి దృఢముగఁ
జేసియుండెను. ఇంగ్లీషు వారి కిది యయిష్టమై సిద్దీతోడఁ గలసి దాని సాధింప
నుద్యమించిరి గాని యట్లుచేయఁజాలక పోయిరి. దానిప్రక్కనున్న కెనరీయను
ద్వీప దుర్గమును సిద్దీ యాక్రమించుకొనెను. దానినుండి యతనిని వెడలింప శం
భాజీ ప్రయత్నించెను గాని యతని కదిసాధ్యపడలేదు ఇంగ్లీషువారికీ రెండు
ఆక్రమణలును సమానముగ నయిష్టములే యై యుండెను.

శంభాజీ, బీజపూరు గవర్నమెంటుతో కొన్ని వ్యవహారములను మాట
లాడుటకు, పన్హాలాకు పోయెను. అచ్చట నతఁడుండగనే ఔరంగజేబు పుత్రుఁ
డగుసుల్తానుమహమ్మదు అక్బరు, తండ్రిపై నెదురుతిరిగి, శంభాజీసహాయము
1681 నకై పాఱివచ్చెను. రాజపుత్రులు జజియాపన్ను విధింపఁ బడుటవలనను,
ఔరంగజేబుయొక్క కొన్ని యితరసహనములేని కార్యములవలనను, తిరుగఁబడి
నపుడీ సుల్తాను అక్బరు తక్కినయన్నదమ్ములతో వారిపై బంపఁబడెను. రాజపు
త్రులతో కొంతవడి యుద్ధమైన తరువాత నితఁడెటులనో శత్రుపక్షమునకు తిరిగి
పోయెను. అప్పుడు ఔరంగజేబు తన కుమారుని తిరుగబాటు లాలోచీ రైన

బుల శత్రువులు దలంచునటుల కొన్ని రహస్య యుత్తరముల నతని పేర వ్రాసి నటుల వ్రాసి యవి రాజపుత్రులకు ప్రమాదమున దొరకినట్లు కనుపడ వారిచేతఁ బడఁజేసెను. ఈమిత్రభేదముచే రాజపుత్రులు మోసపోయిసుల్తానక్బరును విడిచి పోయిరి. అక్బరొంటరివాఁడై, తండ్రికిచేసిన యప్రియమునకు భయపడి శంభాజీతో మైత్రి చేయుటకు వచ్చెను. శంభాజీయుం తనయుద్యోగస్థుల నతనికెదురుగఁ బంపి దోడసే యనుగ్రామమునం దాతనికి నివాసమిచ్చి,పాదుషాపురమని యుద్దానికి పేరొసంగి యతిథి సత్కారంబులు గావించి తానింకను పన్హాలాయందు కొంత కాలవిళంబనము చేయుచుండెను. ఇంతలో ఖైదులోనున్న అన్నాజీదత్తుయొక్క కక్షివా రతని స్వేచ్ఛను సంపాదించుటకును, తమ యభీష్టములను నెరవేర్చుకొనుటకును రాజారామును సింహాసనాసీనుం జేయుటకును గూర్చి సుల్తా నక్బరుతో కొంత రాయభారమును నడపిరి. ఈ కుట్రయొక్క వర్తమానము శంభాజీకిఁదెలిసి తన రాజయతిథియెడల కొంత యనుమానము పొందెనుగాని యతఁడే నిష్కపటముగ వర్తమానమంతయును శంభాజీతోఁ జెప్పినందువలన నతఁ డనుమానమును విడిచి యతనితో సఖ్యుఁడయ్యెను.

ఈకుట్ర, సోయరాబాయి హత్యవలన పగఁబట్టియున్న సిర్కెవంశము వా రందఱివలన నామోదింపఁబడినట్లు చెప్పఁబడుచున్నది. శివాజీయొక్క ప్రేమనుబడసి, శంభాజీవలనను బొంబాయికి రాయబారిగ రహస్యవ్యవహారంబులందు బంపఁబడిన ప్రభూవర్ణజాతుండగు బాలాజీ అవుజీ చిట్నీసు ఇందు ముఖ్యకారకుడుగ నెంచఁబడెను. ఇతఁడును, ఇతని పెద్దకుమారుఁడును, సాంజీ అవుజీ యను నితని చుట్టమును,హీరాజీ ఫర్జందును, సిర్కెవంశజులు దొరకినంత వఱకును,అన్నాజీదత్తుయును,మదపుటేనుగుల కాళ్లకు గట్టింపఁబడి ఘోరముగ జంపఁబడిరి. కొందఱు సిర్కెవంశజులు మొగలుసేవ నవలంబించిరి. శివాజీయొక్క యున్నతిదినములలో పేరుగాంచిన శౌర్యవంతుండును బ్రాహ్మణుఁడగు పంతు సచివునియొక్కయు, ధీమంతుండును శివాజీకి ప్రియతముండు నగు బాలాజీ అవుజీయొక్కయు ఘోరమరణ దండనలు జనులయందు భక్తివినయంబులను గల్పించుటకు మారుగ భయక్రోధంబులఁ బెనిచెను.

ఁపంతుసచివునియెడల స్పర్థగలిగిన పిష్వా మోరోపంతు పింగళే సహితము ధైర్యముఁ బూని యదియు ధర్మమనియు రాజనీతి విరోధమనియు నిర్మొహమాటముగ శంభాజీకి చెప్పెను. కాని శంభాజీ యనుగ్రహము నెట్లో సంపాదించిన కవికులేశుండను నొక కనూజీ బ్రాహ్మణుని యుపదేశమువలన మోరోపం తా సాహసమునకు చెఱసాలం బెట్టఁబడెను. శంభాజీ కవికులేశుని సాహాయ్యమున రాచకార్యములను నిర్వహింపఁ జొచ్చెను.

శివాజీ మహారాజుయొక్క మిత్రుఁడును, మహాపురుషుండును, దేశజనుల గౌరవమునెల్ల నార్జించిన వాఁడునగు రామదాసు స్వామి శంభాజీకీ సమయమున, గడచినదాని కేమియును దూషింపక, ముందు కర్తవ్యములనుఁ దెల్పుచు, తండ్రియొక్క యుదాహరణమును జూపింపుచు, మరల నుపమానమువలన నతని మనసేమియు నొప్పింపక 'మహారాష్ట్రులైన వారినెల్ల కూడఁదీసికొని ధర్మంబును విస్తరింపఁజేయవలయు' నని చక్కగ బోధించుచు నొక యుత్తరమును, తాను పరలోకమున కేగుటకు ముందు వ్రాసి పంపెను.

ఈ సమయముననే కర్ణాటకమునుండి రఘునాధపంతు హనుమంతే శంభాజీని మందలించుటకై వచ్చెను. ఇతఁడు కర్ణాటకమునందు జాగ్రత్తగ వ్యవహరించుటవలన నిలువచేసిన చాల ధనమును వెంటతీసికొనివచ్చుట వలనను, ఇతని నగౌరవ పఱచినయెడల కర్ణాటకమంతయును పినతండ్రియగు వెంకాజీ కగునను భయమువలనను, శంభాజీ యితనికి చక్కని యతిథి సత్కారముచేసి, గౌరవార్థముగ పూర్ణనోలగమును దీర్చెను. రఘునాధ నారాయణుఁడు, తన సోదరుఁడగు జనార్దనపంతు కారాగారమున నున్నప్పటికిని, ధైర్యముతోడ నీసమయమున శంభాజీయొక్క వ్యవహారముల నన్నిటిని ఖండనచేసి శివాజీయొక్క పద్ధతుల నెంతయు ప్రశంసించెను. ఈ యథార్థ వాదిత్వమునకు శంభాజీ కొంత వఱకు లజ్జపడి మోరోపంతు జనార్దనపంతులను కారాగార విముక్తులనుఁ జేసెద నని వాగ్దానముచేసి గౌరవముతో రఘునాధపంతును కర్ణాటకమునకు తిరిగి పంపివేసెను. అతఁడు జింజీ చేరక మునుపే మార్గమధ్యమున కాలధర్మము నొందెను. అయినను శంభాజీ తన వాగ్దానమును నెఱవేర్చెను. జనార్దనపంతు

సోదరుని స్థానమున నమాత్యుఁడుగ నియమింపఁబడెను. కర్ణాటకమున హరిజీ రాజా స్థిరముగ నియమింపఁబడెను. మోరోపంతు కుమారుఁడగు నీలూపంతు శంభాజీ క్రింద ముతలికు (Chief Agent) గా నియమింపఁబడెను. కాని యీ యేర్పాటులు దీర్ఘకాల ముండలేదు. మరల ప్రియతముండగు కవికులేశుఁ డతని మనంబు నాకర్షించెను.

శంభాజీతో సుల్తాను అక్బరు కలిసికొనినపుడు రాజపుత్ర మహారాష్ట్రు లేకమై ఔరంగజేబును పదభ్రష్టుని చేయుదురనీ వార్త ప్రచురమయ్యెను. కాని హీనమతులకు క్రోధాహంకారములంత, కీర్తి యుదాత్తమనోరథంబులు రుచ్యములు గావు. శంభాజీయొక్క మనస్సంత విశాలమనోభీష్టంబునకు చాలక జంజీరాను సాధించు సామాన్యవాంఛతో సంతృప్తినొందెను. తన తండ్రి సాధింపఁజాలని దుర్గమును సాధించుటయును, తన గ్రామములు కొల్లపెట్టినందుకు శిక్షించుటయును, సిద్దీచే దినదినమును బడయుచున్న తిరస్కారములు నతనికి కోపకారణములై తన శక్తియంత నుపయోగించుటకు యోగ్యమైనవిగ నతఁడు తలంచెను.

ఖండోజీ ఫర్జందు అనువాఁడు శంభాజీతో విరోధము కల్పించుకొనినట్లు నటించి జంజీరాకు పాఱిపోయి యచట వారు యుద్ధము ప్రారంభించునపుడు రహస్యముగ నాయుధాగారమున కగ్గి నంటించున ట్లేర్పాటు జరిగెను. వాఁడీ కార్యము చేయఁగలిగిన యెడల 'ప్రధాను' పదవి నియ్యఁబడున ట్లాశ పెట్టఁబడెను. కాని యీ కుట్ర యచట నొక బానిస స్త్రీవలన కనిపెట్టఁబడెను. ఖండోజీ ఫర్జందును, అతని సహచరులగు మఱికొందఱును యుద్ధమునకు పూర్వమే యురిఁదీయఁబడిరి.

శంభాజీయుద్ధమును బాగుగ జరగించుటకు, సుల్తాను అగ్బరును కూడ తనవెంట దండారాజాపూరునకు తీసికొనిపోయెను. జలసంధిని దాటి ద్వంద్వ
1682 యుద్ధమునకు దొరకొనుటకు మన్నుతోడను రాళ్లతోడను వారధిఁ
గట్టింపఁ బ్రయత్నము జరుగుచుండగ అహమ్మదు నగరమునుండి
జూనారుమీఁదుగ హుస్సేనాలీఖాను క్రింద మొగలు సైన్యము దండెత్తివచ్చి

కల్యాణజిల్లాలను పాడుచేసెను. శంభాజీ వారి నెదుర్కొని యన్ని దిక్కులను సామగ్రు లందకుండఁ జేయుటవలన వారు వెన్నిచ్చి పాఱిరి.

జంజీరా ముట్టడి దాదాజీ రఘునాథుని వలన జరుపఁబడెను. ప్రాకారములు పడగొట్టఁబడి పడవల మీఁదనుండి ద్వంద్వయుద్ధముఁ జేయ సమకట్టఁబడెను గాని, ద్వీపపర్వతము జోరుడుగలిగి యుండుటవలనను, సముద్ర తరంగము లల్లకల్లోలముగ రాతిపైఁ గొట్టుకొనుచుండుట వలనను, భటులకు కాలూన ననుకూలము గాకపోయెను. రెండువందల జన నష్టముతో ముట్టడి యెత్తివేయఁబడెను. తరువాత సిద్దీలు మఱింత సాహసము నవలంబించి, సేనలు వెడలిపోయిన తరువాత, తఱుచుగ గ్రామముల పైఁబడి దేశమునుఁ బాడుచేయుచు స్త్రీలను చెఱఁబట్టుచు ననేక దౌర్జన్యములను చేయుచు వచ్చిరి. ఒకసారి మహారు గ్రామము ప్రవేశించి దాదాజీ రఘునాథుని భార్యను సహితము వారు చెఱఁబట్టిరి.

ఈ యవమానముల వలన శంభాజీ మఱింత కోపఘూర్ణిత మనస్కుఁడయ్యెను. ఇంగ్లీషు పోర్చుగీసు వారలు సిద్దీ విషయములో నుదాసీనులై యున్నందున వారిని శిక్షింప బెదరించెను. అటుతరువాత అక్టోబరు మాసములో సిద్దీయొక్క నావీ * బొంబాయి హార్బరులో మాజగాను నొద్దనుండగ మహారాష్ట్ర నావీ నాగోత్తన నదినుండి వెడలి దాని వెంట నంటెను. అదియును తాణానది దగ్గర వరకు బోయి యచ్చట నెదిరింప సిద్ధపడెను. మహారాష్ట్ర నావీ, సిద్దీలనుండి విడిపోయి వచ్చిన సిద్దీ శంభోలియొక్క బంధువుఁడగు సిద్దీ మిస్రీచే నడుపఁబడెను. సిద్దీల నావీ యాకూతుఖానుచే స్వయముగ నడుపఁబడెను. మహారాష్ట్ర నావీ సిద్దీల నావలకంటె రెట్టింపున్నను ఓడిపోయెను. సిద్దీ మిస్రీ ప్రాణాపాయంబగు గాయము నొందెను. అతఁడును మఱికొందఱును శత్రులచేఁ జిక్కిరి. మహారాష్ట్ర నావలు కొన్ని చివరవఱకును రక్షణ చేసికొనుచు సముద్రము నందు మునిగి పోయెను.

---

* నావీ అనగా నావసైన్యము.

శంభాజీ యీ యపజయమువలన యూరోపియనులపై తాను జేసిన బెదరింపుల నాచరణయందుఁ బెట్టఁ దొడఁగెను. పోర్చుగీసువారి గ్రామము లను కొన్ని కొల్లఁబెట్టెను. ఇంగ్లీషువారిని సాధించుటకై బొంబాయి పోర్చు రులోని ఎలిఫెంటా ద్వీపమును దుర్గముగఁ జేయఁ బ్రయత్నించెను. ఇంతలో ఔరంగజేబు దక్కను దిగ్విజయమునకు వచ్చుచున్నాడనియు, కుమారుఁడగు మోఅజమును యువరాజుగ నాలుగవసారి ఔరంగబాదునకు ముందుగఁ బంపినాడనియుఁ దెలిసి, ఇంగ్లీషువారితో సఖ్యమునకు రాయభారము నంపెను. ఇంగ్లీషువారును కోరమండల తీరమున మహారాష్ట్ర యుద్యోగస్థులచే తమ ఫాక్టొరీలపై పనూలు చేయఁబడుచున్న పన్నును తీసివేయించుకొనుట కతని రాయభారముల కూకొట్టు చుండిరిగాని యుభయపక్షముల వారు నీ రాయభా రములవలన నప్పటికే లాభమును పొందియుండలేదు.

1683 ఈసంవత్సరములో, మోఅజము రణమస్తఖానుక్రింద కొంతసైన్యమును కొంకణముపైఁ బంపెనుగాని, వారు క్రిందటి సంవత్సరమున వలెనే కళ్యాణమును పాడుచేసి మరల అహమ్మదు నగరమును చేరిరి.

శంభాజీ జ్యూను నెలలో పోర్చుగీసువారి పట్టణమగు చౌలును ముట్ట డించెను. గోవా వైసరాయికూడ సంగరరంగమును గైకొని,తన నావీని శంభాజీ నావీపైఁ బంచి, కార్వారు వ్యాపారమును బాధింపనాజ్ఞాపించి, తాను స్వయ ముగ పోండాను ముట్టడించెను. శంభాజీయు, శంద్రజీయొక్క వివేక సామర్థ్య ములు లేకపోయినను, ధైర్యసాహసంబులు గలవాఁడు కావున వెంటనే యీ ముట్టడిని తొలగింప సైన్యములోడ వచ్చెను. అప్పుడు తనయొక్క సైన్యము పోర్చుగీసు సైన్యము కంటె తక్కువయైనను వారి వెనుకవైపున సంకుల సమరంబునకు దొరకొనెను. గోవా వైసరాయియు, కోటను పట్టుకొన సమర్థుఁ డైనను,తిరిగి గోవాకుపోకుండ నడ్డగింపఁబడునను భయముచే వెంటనే వెనుకకు పాఱిపోయెను. ఇట్లు శిబిరసామగ్రియు, మందుసామానులను, ఫిరంగులను పోగొట్టుకొనినవాఁడై 1200 జన నష్టముతో నతఁడు గోవాముఖము పట్టెను.

గోవా దగ్గరనున్న సముద్రశాఖను జేరునప్పటికి శంభాజీయు వెంట నంటి కాందిసీకులను ఛేదించి పోవ తన యశ్వదళంబును పురికొల్పుకొనుచుఁ బోయెను. కాని పోర్చుగీసువారు రేవును బాగుగ నెఱిగినవా రగుటచేతను, రెండ ప్రక్కలను పడవలనుంచి యొడ్డున సైన్యశ్రేణి నుంచుటవలన నాప్రయత్నమును విఫలము చేసిరి. శంభాజీయు తన జనులనందఱను పోగుచేసికొని రేవు దాట మరలఁ బ్రయత్నించెను. సైన్యములను స్వంతముగ నడిపించి, తనగుఱ్ఱము నీటిలో నీదు నంతవఱకును పట్టుదలతో ముందుకు సాగిపోయినను, సముద్రపు పోటువలన నతఁ డాయుద్యమమును విడువవలసినవాఁ డాయెను. శంభాజీ యాసమయమున తండ్రియొక్క ఖ్యాతిని నిలువఁబెట్టెను. భవానీ ఖడ్గమింతకంటె పరాక్రమంబుగ నుపయోగింపఁ బడఁజాలదు. కాని యతఁడు మూర్ఖములో పడవలనుఁ దెప్పించి 200 భటులను వానిపై కోటనుఁ జేరఁబంపెను. అంతట పోర్చుగీసు పడవలును, వానిని తిరిగిరాకుండ నడ్డగించి భటులను హతులం గావించెను.

శంభాజీ యాప్రయత్నమును విడచి బేసీనుడామానులకు మధ్యనున్న పోర్చుగీసు స్థలముల నన్నిటిని ప్రవేశించి ధ్వంసము చేసెను. గోవా వైసరాయి సంధికై వేడుకొనెను. కాని శంభాజీ ఐదు కోట్ల వరహాలు దండనగ నిమ్మని కోరినందున నతఁ డియ్యకొనక పోయెను.

మహారాష్ట్ర సైన్యము దృఢమైన ప్రభుత్వము లేకపోవుటవలన మరల విచ్చలవిడిగ చాలభాగము పరరాజ్యములపై విడిచిపెట్టఁబడెను. దక్కనునం దప్పుడు మరల మొగలు దండయాత్రవలన గలిగిన కల్లోలమందు వీరియొక్క దోపిడి యాత్రలనెల్ల గమనించుట సాధ్యముకాదు, లాభమునులేదు. కాని యందలి ముఖ్యమైన చరిత్రాంశములనుమాత్రము వారి విజృంభణమునకు సంబంధించినంతవఱకుఁ జెప్పిన నుపయుక్తముగను, మనోహరముగ నుండును.

మోరోపంతు కారాగారబద్ధుఁ డైనప్పటినుండియు కవికులేశుఁడే రాజకార్యముల నిర్వహించుచుండెను. తరువాత నతఁడు విడిచిపెట్టఁబడినను, అతఁడు జీవించిన కొద్దికాలమును శంభాజీచే విస్తారము గౌరవింపఁ బడలేదు. శంభాజీ కేవలము రణరంగమునం దున్నప్పుడు తప్ప తక్కిన కాలమంతయు

కవికులేశునితో నిష్టాగోష్ఠిని కాలము గడుపుచుండెను. మధుపానవ్యభిచారములందు మునిగి యుండెడివాఁడు. కవికులేశుని యనుజ్ఞలేక యెవరైన తన దర్శనమునకు వచ్చినయెడల నతఁడు క్రోధావేశుండై వాని శిక్షించును. కవికులేశుఁడు ఛాందసుడే గావున ప్రధానులలో పండితరావు ఉద్యోగమునకు తప్ప మఱియెందుకును పనికిరాలేదు. అతఁడు ఛాందోగ్యామాత్యకవికులేశుఁడను బిరుదనామమియ్యఁబడెను. మహారాష్ట్ర బఖరులందు కవికులేశుఁ డనేకవిధముల దూషింపఁబడినను, శంభాజీయొక్క దుర్వ్యసనముల కతఁడు ప్రేరకుఁడని మాత్రము చెప్పఁబడియుండలేదు. కాని యతడు దుష్టశృంగారరసకవిత్వమువలన శంభాజీయొక్క కామోద్రేకమును తనియింపుచుండెననుటకు సందియములేదు. మంత్రప్రయోగమువలన నతఁడు శంభాజీ మనంబు నాకర్షించెనని మహారాష్ట్రగ్రంథములందు వ్రాయఁబడెను గాని పైకారణమే సరియై యుండునని తలంపవచ్చును.

శివాజీయొక్క పద్ధతులన్నియు ఖిలమయ్యెను ఉద్యోగస్థులు తమ వ్యవహారములందు ప్రమత్తులై యుండిరి. ఈ దుశ్శిక్ష ముందుగ సైన్యమునందు వ్యక్తమయ్యెను. అశ్వసైన్యము రణరంగమునందున్నపుడు, వెనుక వెనుక కొందఱు సైనికులు వచ్చి కలియనియ్యఁబడుచుండిరి. కొల్లధనము దాచుకొనఁబడుచుండెను. స్త్రీజనంబులు వెంట వచ్చినచో పూర్వము మరణదండన విధింపఁబడుచుండెడిది. అట్లుండగ నిప్పుడు స్త్రీలు వెంటఁదీసుకొని పోఁబడుటయేఁగాక శత్రుదేశములలో స్త్రీలుగూడ కొల్లధనముగ నంగీకరింపఁబడుచుండెను.

అశ్వసైన్యాధిపతులు తెచ్చిన స్వల్ప కొల్లధనము, భటుల జీతబత్తెములకు చాలకపోయెను. అట్లు దిగఁబడిపోయిన జీతములకు వారు రణరంగము నాక్రమించుకొని, కొల్లధనమును సంపాదించుట కంగీకరింపఁబడుచుండిరి.

శంభాజీయొక్క వ్యయమునకు మితములేకపోయెను. ధనాగారము శూన్యమగుచున్నదని ప్రియమంత్రిగూడఁ జెప్ప సాహసింపఁ జాలకుండెను. రఘునాథపంతు మరణానంతరము కర్ణాటకమునుండి యొక్కకాసైన వచ్చుటలేదు. అక్కడి శిస్తిచ్చుటనే సరిపోవుచుండెను. శంభాజీ చేసిన దండయాత్ర

లన్నియును నష్టములేగాని లాభములు కాకపోయెను. ఇందుకు కవికులేశుఁడు భూమిశిస్తు నెక్కువఁజేసి యందువలన ధనాగారమునుపూర్తిఁజేయు మార్గమును తాను కనుఁగొనె ననుకొనెను. కాని వసూలుచేయ వచ్చునప్పటికి వెనుకటికంటెను ధనమురాఁబడి తక్కువే యాయెను. జిల్లామేనేజరులు ధనము నపహరించిరను తలంపుతో వారి నెల్లరనుఁ దప్పించి అతఁడు గ్రామములను శిస్తు వసూలునకు గుత్తకియ్యఁ జొచ్చెను. రయితులు పన్నుభారమును సహింపలేక గ్రామములనుండి పాఱిపోయిరి. ఔరంగజేబు తనసైన్యముతో దక్కనును జయింప ప్రయాణమై యింకను బరహాంపురముదగ్గర నుండగనే, శంభాజీ దేశము నాశనమునకు సమీపించెను.

ఔరంగజేబుయొక్క ప్రయత్నముల నెదురుకొనుటకు దక్కనుననున్న స్థితిగతు లొక లెక్కలోనివి గాకుండెను. గోలకొండ సుల్తానుయొక్క ధన సైన్యంబులు బలముగనే యుండెనుగాని ఔరంగజేబుయొక్క మిత్రభేదముచే నవి యెందుకును పనికి వచ్చునట్లు లేవు. మాదన్నపంతులుచే రాజ్య మన్ని విధములను కట్టుదిట్టములతో నుండెనుగాని మహమ్మదీయ యుద్యోగస్థులందఱిని, ఔరంగజేబు రాయభారుల నంపి బ్రాహ్మణ మంత్రిత్వము యెడల ద్వేషబుద్ధి గలవా రగునటుల బోధించి మొగలు పక్షమునకుఁ ద్రిప్పుకొనెను. కాని అబూహుస్సేను (తానీషా) మాత్రము మంత్రియెడల నిష్టుఁడుగనే యుండెను. ఇఁక బీజపూరునందు ముసావుదుఖానునకును మఱికొందఱు మహమ్మదీయ సర్దారులకును ఔరంగజేబుయొక్క యేజంటగు మల్లిక బరఖురదారు జగడములు పుట్టించి ముసావుదుఖానును పనివదలి ఆదోని పోవునట్లు చేసెను. అటుతరువాత అంతకు పూర్వము శివాజీకిని బీజవూరునకును గలిగియున్న సంధిని భేదించి, బీజపూరు శివాజీకిచ్చివేసిన మెరిచ్ ప్రాంతమును మరల పట్టుకొనునట్లు చేసి, మహారాష్ట్రులతో వారికి వైరము పొసగున ట్లొనరించెను. ఇట్లు బీజపూరు గోలకొండ మహారాష్ట్ర రాజ్యముల మూటిని మూఁడుదారుల ఔరంగజేబు విడఁదీసెను. శంభాజీ యిప్పుడు బీజపూరు గోలకొండలతోఁ గలిసి సామాన్య శత్రువు నెదిరింపవలసియుండెను. కాని యతఁ డంత బుద్ధిఁగలవాఁడు కాకపోయెను.

మాదన్న మంత్రి తద్విషయిక ప్రయత్నములు చేసెను గాని తక్కినవా రెవ్వరును కలిసి రాలేకపోయిరి. ఔరంగజేబుయొక్క మంత్రాంగు లందఱును గోలకొండ బీజపూరు దర్బారులలో మహమ్మదీయ రాజ్యములు రక్షింపఁబడునని పోలఁ బాడుచుండిరి. అంతియు కాక యనేక మహమ్మదీయ ప్రముఖులు రాజద్రోహులై యుండిరి.

ఇఁక మహారాష్ట్రంబున మన్సబుదారులు కొందఱు తమ తమ కుటుంబ కలహములవలన మొగలుల పక్షము చేరిపోయిరి. వతనుల వారసత్వపు వివాదములవలన నీకలహములు పెచ్చు పెఱిగి యిట్టి గందరగోళమునకు కారణము లగుచుండెను. ఇట్టిభేదము లన్నియును ఔరంగజేబుచే తన కనుకూలముగఁ జేసికొనఁబడెను.

ఈ సమయముననే యీస్టిండియా కంపెనీ యుద్యోగస్థుఁడగు కిన్విను అను నతఁడు బొంబాయి యందు సూరతు గవర్నరుయొక్క డిప్యూటీని ఖైదుచేసి తాను స్వతంత్రముగ నాద్వీపమును పట్టుకొని యుంటినని చెప్పి తిరుగఁబాటు చేసెను. దీనివలనను, మఱి యింకొక వైరి ఈస్టిండియా కంపెనీ యేర్పడుట వలనను వీరి గణ్యత కొంత ప్రజలలో తగ్గియుండెను. ఉత్తర దక్షిణ రాజ్యములు తమ యావద్బలముతోడను డీకొను నాటికి ఇంగ్లీషువారి స్థితి యిచ్చ టెట్లున్నదో తెలియపఱచుట కిది సూచించితిమి.

ఔరంగజేబు అట్లు బరహంపురములో కొన్ని నెలలు తాను చేయవలసిన దండయాత్ర కేర్పాటులు చేయుచు నిలచియుండెను. అటు తరువాత మోఅజమును షా అలము అను బిరుదు నామ మిచ్చి శంభాజీయొక్క దక్షిణ దేశమును జయింప తన సైన్యమంతటితోను అహమ్మదు నగరమునుండి పొమ్మని చక్రవర్తి యానతిచ్చెను. ఇంకొక కుమారుఁడగు సుల్తాను అజము, ఖాన్ దేశము బగ్లానా, సంగమ్నేరు, సాలేరు మొదలైన యుత్తరదిక్కు కోటల నాక్రమింపఁ బంపఁబడెను. సుల్తాను మోఅజము నాసిక దగ్గర అంబదురాఘాటీ మార్గమున కొంకణములో ప్రవేశించి రాయగడనుండి వింగోర్లావరకును దేశమును నాశనముఁజేయుచు పోయెను. సుల్తాను అజమునకు సాలేరు ఖిల్లేదారు

యుద్ధము చేయకనే కోట నిచ్చివేసెను. పాప మీతఁడు తగినంత యుద్ధము దొరకనందుకు వగవఁ జొచ్చెను. తండ్రి యాతనిఁ బిలిపించి బీజపూరుపై పంపెద నని యోదార్చెను. తక్కిన కోటలు సామాన్యమైన వని మహాబుద్దీనుఖానుఁడు వానిపైఁ బంపఁబడెను. కాని యతఁ డపూర్వమైన నిరోధమును రామసేజీకోట హావల్దారువలనఁ బొంది యవమానముతో నింటికిం జనెను.

సుల్తాను మోఅజము కొంకణమందు విస్తారభాగము జయించినను ముట్టడులు చేయుటకు సిద్ధపడిరాలేదు. శంభాజీయొక్క కోటలవారందఱును ధనధాన్యగ్రాసములను లోన సేకరించుకొని సుఖంబుగనుండిరి. మోఅజము దేశమునంతను నాశనము చేయుటవలన భోజనగ్రాసములు దొరకక చిక్కుపడ నారంభించెను. ఇట్టి యవస్థయందు శంభాజీ తన యశ్వసైన్యమును కోటకావలి సైన్యముల సహాయముతో, మోఅజము సైన్యముచుట్టును రోడ్లను బ్రద్దలుకొట్టి, సామగ్రుల నడ్డి, వానర యుద్ధమున బాధింప నాజ్ఞయిచ్చెను. మహారాష్ట్ర యశ్వసైన్యములకు కోటలోని భోజనసామగ్రులవలన యాధారము గలిగియుండెను. మొగలుల సైన్యము లాపదలపాలాయెను. వేలాది జనులును జంతువులును మృత్యుముఖంబు సొచ్చెను.

చక్రవర్తి యీ వర్తమానమును తెలిసికొని, మహాబుద్దీనుఖానుని సామగ్రు లందుబాటగునట్లు చేయఁబంపెను. ఇంతేఁగాక, సూరతు గవర్నరును సముద్రము మీద దండారాజపూరు వింగోర్లా రేవులకు సామగ్రుల నంపుటకు త్తరువుచేసెను. ఎక్కువ తొందఱగ నీ సామగ్రులు పోవలసినందున, తగిన సైన్య సహాయము లేకుండ యోడలు పంపఁబడెను. కావున శంభాజీయొక్క నావసైన్యము వానిని మార్గమధ్యమున నడ్డగించి దోచుకొనెను. మిగిలి వచ్చిన కొద్ది సామగ్రి యెందుకును చాలకఁబోయెను. అందువలన సుల్తాను మోఅజము అంబాఘాటు మీదుగ వెనుకకుఁబోయి యచటినుండి కృష్ణయొడ్డున వుల్వాగ్రామము దగ్గిర శిబిరము నేర్పఱచుకొనెను.

మహాబుద్దీనుఖానుఁడును రాయగడ దగ్గిర శంభాజీచే నడ్డగింపఁ బడినను స్వల్పజయమును బొంది యెట్టకేలకు మోఅజమునకు సహాయుఁడయ్యెను.

ఇందు కీతఁడు గయాజుద్దీను బిరుదియ్యఁబడెను. నిజాముల్ ముల్కు వంశమునకు మూలపురుషుఁ డితఁడే యై యుండెను.

ఔరంగజేబు బరహాంపురము నుండి ఔరంగాబాదునకు చేరుకొనెను. ఇతఁ డిక్కడనుండి తక్కిన యన్ని యేర్పాటులతోపాటు జజియాపన్నును మహమ్మదీయేతరులనుండి యుత్తర హిందూస్థానము నందువలెనే దక్షిణమునను వసూలుచేయఁబడ నాజ్ఞయిచ్చెను. ఇందేమియు వివేకమైన రాజనీతి గాన్పించదు గాని యొకవేళ కొందఱు చెప్పునట్లు మహమ్మదీయులలో మూర్ఖులకు తాను మతాసక్తివలననే యీ దండయాత్ర నవలంబించి యున్నానని తెలియపఱచుటకై యుండవచ్చును. కాని యటులైనచో నది యే మాత్రమును శ్లాఘనీయమై యుండ నేరదు.

ఈ సంవత్సరమున డిలిరుఖాను మరణమువలన చక్రవర్తి సేవకెంతయు నష్టము సంభవించెను. అతఁడు దక్కను యుద్ధక్రమమునం దెక్కువ యనుభవము కలవాఁడు. ఆతని కాలపు నాఁటి యనేక యుద్యోగస్థుల కంటె నెక్కువ యుద్ధము నెరిఁగినవాఁడు. అతఁడు చక్రవర్తిచే నెప్పుడు ననుమానింపఁబడుటయేఁ గాక, వృద్ధాప్యమునందు నిర్లక్ష్యముగఁ జూడఁబడెడు వాఁడు. 26 సత్సరములు విరామము లేకుండ యుద్ధములు చేసినవాఁడై, ఔదార్యవంతుఁడును, విశ్వాసగుణుండును, దురదృష్టవంతుఁడు నగు దారాను వదలిపెట్టి కపటియగు ఔరంగజేబు పక్షము చేరినందుకు తగిన శాస్తి ననుభవించెను.

శంభాజీ యింకను పోర్చుగీసువారితో జగడమాడుచునే యుండెను. పోర్చుగీసువారు సూండా ప్రముఖుని, కార్వారుదేశాయిని ఎదురుతిరుగునట్లు చేసిరి. శంభాజీ ఉత్తరకొంకణములో పోర్చుగీసువారి పట్టణములను కొల్లఁబెట్టించుచుండెను. తానుమాత్రము సుల్తాను మోఅజముయొక్క గమనములను గనిపెట్టుటకు పన్హాలా వచ్చియుండెను.

చక్రవర్తి, ఖానుజహానును ఔరంగాబాదు దగ్గరనుంచి, తన మహాశిబిరముతో అహమ్మదు నగరమునకు ప్రయాణమాయెను. ఈతని సైన్య మెంతో యే మొగలు చరిత్రకారుఁడును ముచ్చటించి యుండలేదు. ఈ ఔరంగజేబు ప్రయా

తనయొక్క గంభీరవైభవంబు లనుపమానంబైయుండె. విశేషము లేగా యతని యశ్వసైన్యము కాబూలు, కాంధహారు, ముల్తాను, లాహోరు, రాజపుతానా మొదలైన విశాలరాజ్యంబునంతినుండియు కూడి నిగ్గుదేరియుండి, సర్వాయుధధారులగు దీర్ఘకాయులును, సర్వాభరణభూషితంబులగు బలాశ్వంబులునుగల శ్రేణులనొప్పి, హ్రస్వకాయులును అల్పాయుధధారులునగు దక్కనేయు లెదిరింప సాహసింపఁ జాలని తెరంగున ప్రకాశించుచుండెను. అతని కాల్బలము, శతఘ్నులవారు, తుపాకులవారు, ధనుర్ధరులు సమగ్రాయుధయుతులై యుండ విస్తారమైయుండెను. ఇంతేకాక పర్వతములందు దోపిడీ కలహములం దాఱితేరి, మావళీలతోఁ బెనగ సమర్థులగు దృఢగాత్రులగు బొందిలీలు మేవాటీలు నుండిరి. వీనన్నిటికిని తోడుగ కర్ణాటకమందు కూర్పఁబడిన వేలకొలఁది కాల్బలముండెను. ఇఁక రాజగుడారములలో నున్న కొన్ని పెద్ద ఫిరంగులు గాక యనేక వందల ఫిరంగులు యూరోపియను గన్నరుల నియోగంబున హిందుస్థానీయులచే ప్రయోగింపఁబడుచుండెను. ఫిరంగి దళంబున కంటె యనేక మైనరు* లుండిరి. ఇంక వివిధ శిల్పంబులవారును వెంటనుండిరి. యుద్ధపుటేనుగు దళంబును, వానివెంటఁ నింక ననేక యేనుఁగులు శుద్ధాంత జనంబులను తీసికొని వచ్చుననియు, నింక మఱికొన్ని యొంటెలు బడ్లుమోయఁజాలని గూడారములను మోసుకొని వచ్చుననియుఁ దోడ నరుదెంచుచుండెను, చక్రవర్తి వాహనంబునకై వైభవోపేతంబుగ నలంకరింపఁబడిన సుందరాశ్వము లాయత్తములై యుండెను. శిబిరముతోడ దేశదేశములనుండి తెప్పింపఁబడిన మృగపక్షిగణంబులు పంజరంబులం దుంచఁబడి వెంటతీసికొని రాఁబడెను. అందలి యపురూపజంతువులు వాని కాపరులచేత చక్రవర్తి సభాసమ్ముఖంబునఁ జూపింపఁబడుచుండెను. చైతులు, సారమేయములు, వేటపులులు, శిక్షితములైన గజములు, ఇంకను మృగయావిహారంబునకు కావలసిన యెల్ల వస్తువర్గంబులు నీ మహాపరివారాడంబరమును వెల్లిపరచెను. రాజగుడారంబులను చుట్టిన కాన్వాసుప్రాకా

---

* మైనరులనగా కోటగోడలయందు కన్నములు చేసి తుపాకిమందుకూరి యగ్ని నంటించువారు.

తములు 1200 గజములకొలతఁగలిగి, యత్యంత విశాలంబగు రాజభవనంబు నం
దుండు నన్నివిధములగు మందిరంబులును కలిగియుండెను. దర్బారులకును,
కార్యాలోచనసభలకును తగిన మందిరంబులును, వాని నంటిన నన్నిసభాస్థానంబు
లును, ప్రతి మందిరము నత్యంత శోభాయమానంబుగ నలంకరింపఁబడి, యొక
ప్రక్క చక్రవర్తికి సింహాసనంబును గలిగియుండ, పూతపసిండి కంబముల
చే చుట్టుకొనఁబడి, బంగారు ద్రేలు చెఱంగు కుచ్చెళ్లతోడ నత్తరుపు ఛాం
దినీలఁగలిగి, ప్రకాశించుచుండెను. మసీదులకును, మతప్రసంగస్థానంబులకును,
విడి గుడారము లుండెను. స్నానవ్యాయామాగారంబులును, ఢిల్లీ శుద్ధాం
తంబులతోఁ దులమాగు యంతఃపురమందిరంబులు నుండెను. పరిషియాతి
వాసులు, చిత్రములుబ్బెత్తుగ నేయఁబడిన వస్త్రిములు, విచిత్రములైన యల్లి
కలు, పలువిధంబులగు చీని చీనాంబరములు, యూరోపియను అత్తరుషులు,
బారచాపులు, ఇండియను జిల్గుదువ్వలువలు, బంగారు దుప్పటంబులు, అన్ని
గుడారములందును, మితిమీరి మనోహరంబుగ నుండునట్లు అమర్చి యుంచఁ
బడెను. రాజగుడారములపైన బంగారు పూత పూయఁబడిన కలశంబులును
శిఖరంబులును నిలువ పెట్టబడెను. చుట్టును కాన్వాసు ప్రాకారములు వివిధ
చిత్రవర్ణాంచితములై, యామహావైభమునకు మరింత వన్నెనొసంగునట్లు సవరిం
పఁబడియుండెను. రాజశిబిరంబు లోని యొక విశాలద్వారముగుండా ప్రవేశింప
వలసియుండెను. దాని కిరుప్రక్కలను రమణీయంబులగు చిన్నగుడారములుం
డెను. వానిప్రక్కలనుండి ఫిరంగి శ్రేణులు మార్గంబులుగ నేర్పడి యుండెను.
వానిచివర నొకప్రక్క నొక పెద్దగుడారమునందు చక్రవర్తినగారాయుండెను.
ఎదుట నింకకొంచెము దూరమున నొకసరదారు వేగువానియొక్క స్థానమందుం
డెను. ఈపెద్ద ప్రాకారముచుట్టు నితరప్రక్కల చక్రవర్తియొక్క కవచపాను
గ్రులకును, జీవ సామానులు మొదలైన వానికిని వేఱువేఱు గుడారము లేర్ప
ఱుపఁబడి యుండెను. సూరేకారముచే చల్లనఁ జేయఁబడిన పానీయంబుల
కొక్క గుడారమును, మఱియొకటి ఫలాదులకును, భక్ష్యంబుల కింకొటియు,
తమలపాకులకు నాల్గవదియు, ఇంక ననేక పాకాగారంబులును, అశ్వశాలలును,

మిక్కిలిగ నుండెను. శిబిరమునం దింత భోగము దురూహ్యము, కాని యిట్లు వర్ణింపఁబడినవియేఁ గాక, ప్రతిగుడారమునకును ఒక్కొక జత గుడారముండెను. అందొకటి ముందుగఁ బంపఁబడి పైమజిలీయందు సిద్ధము చేయఁ బడుచుండెను. ఆయన ప్రయాణ మొక మహాసంకీర్తనగానుండెను. చక్రవర్తిప్రక్కనున్న చిన్న గుడారముగుండా లోనఁ బ్రవేశించుతఱి ఏబదియిరువది ఫిరంగులా వర్తమానంబును ప్రకటించును. ఢిల్లీదర్బారునందలి యన్ని యాచారములు నతఁ డొక్కటియైనఁ దప్పక జరుపించుచుండెను. చక్రవర్తియొక్క స్వకీయ నిరాడంబరమును, కొంచె మెచ్చు తక్కువగ వైరాగ్యంపు టలవాటులు నీ మహా వైభవంబులో ప్రతిగా నుండి ప్రజల మనంబులం దతని యధికారముయొక్క గాంభీర్యము మఱింత దృఢంబుగ నాటుకొనునట్లు చేసెను. కాని యీయైశ్వర్యమును, సరదారు లందఱును తమ కనుకూలమైనటుల తామును అవలంబించినందున నతని సైన్యగమనంబుల కీయాడంబరము భారము కాఁజొచ్చెను. ఇందువలనఁ గలిగిన ధనవ్యయము విపరీతమై చిట్టచివర కవసరమైన యుద్ధరాజకీయ వ్యవహారములకే లోటువడుచు వచ్చెను.

ఈ వైభోగముయొక్క యిబ్బందులు మోఅజము యొక్క కొంకణ దండయాత్రలో తెల్లమాయెనని మనమూహింపవచ్చును. ఈతని సైన్యము అంటు జాడ్యములవలన క్షీణించిపోయెను. శివాజీ బీజపూరునుండి యిడిపఱకు తీసికొనియున్న దేశమును మెల్లమెల్లగ జయించుచు నచ్చటతఁడు కాలము గడుపుచుండెను. అజంషా షోలాపురమును ముట్టడించి బీజపూరుతో యుద్ధము సాగించెను.

ఔరంగజేబు దక్షిణమునకు వచ్చుచున్న కొలదిని, ఉత్తరభాగము రక్షక
హీనంబగుచుండెను. కావున హంబీరరావు ఖాన్ దేశమును ప్రవేశించి కొల్లఁబెట్ట
1685 నారంభించెను. మొగలు లప్పుడు తెలివితెచ్చుకొని ఉత్తరదేశ రక్ష
ణార్థమై ఠాణాల నప్పుడేర్పఱచుకొనఁ జొచ్చిరి.

సుల్తాను ఆజము షోలాపూరును జయించి బీజపూరునకుఁ బోఁదలచెను గాని మరల సిరాజీఖానుతోఁ బోరాడఁజాలనని తలంచి వెనుకకువచ్చెను.

సుల్తాను మోఅజము కొన్ని ప్రాంతముల గెలిచెనుగాని, తనసైన్యమంతయును జాడ్యములచే నాశన మగుటవలన వానినన్నిటి నాక్రమించుకొని వశములో నుంచుకొన సమర్థుఁడు కాకపోయెను. చక్రవర్తి బంపిన సాహాయ్యము వచ్చునంతవఱకును, అతనిసైన్య మన్ని దిక్కులనుండియు పీడింపఁబడెను. అనేక యుద్ధరంగములయం దపజయము నొందిదస్సినటుల నతఁడు తన గొప్పసైన్యముయొక్క నాతశేషములో అహమ్మదు నగరముచేరెను.


సుల్తాను మోఅజము తిరిగివచ్చిన తరువాత, ఖానుజహానును రోఅల్లా ఖానును బీజపూరును ముట్టడించ వలసినదని, చక్రవర్తి యానతిచ్చెను. ఇప్పుడైనను మాదన్నపంతు లంచమిని కూడఁదీసికొని రావలయునని చేసిన ప్రయత్నములు కొనసాగలేదు. శంభాజీ బీజపూరునకు సహాయము చేయఁదలంపలేదు. గోలకొండ దగ్గర మాత్రము లక్షవరహాలు కానుక తీసికొని సహాయ్యముచేసెదననెను. ఈ సఖ్యము వినినతోడనే ఔరంగజేబు ఖానుజహానును హైదరాబాదు రాష్ట్రములపై కప్పము వసూలుచేయు మిషమీదఁ బంపెను. ఈ సైన్యములో సాదతుఖాను అను రాయభారిని కూడఁబంపి, శంభాజీతో స్నేహముచేసినందుకు తగు సమాధానము నడుగుటయే కాక సెటులైన హైదరాబాదుతో వైరమునుఁ గల్పించుటకు రహస్యముగ మంత్రాలోచన జరుపుట కతని కానతిచ్చెను.

చక్రవర్తి అహమ్మదు నగరమునుండి షోలాపూరునకు బయలుదేరెను. మహారాష్ట్రులు మరల నుత్తరమున సరియైన రక్షణలేనందున తపతీ నర్మదానదులు దాటి బ్రోచిపట్టణమును పట్టుకొని కొల్లఁబెట్టిరి. కొంకణమునందు సోదరుఁడగు మహమ్మదు ఆజముతో యుద్ధమునందును, ఈ దండయాత్రలందును సుల్తాను అక్బరు శంభాజీకి సలహాకారిగనుండెను. ఈ పర్యాయము మహారాష్ట్రులు సుల్తానక్బరును రాజుగాఁగూడ ప్రకటించిరి. ఔరంగజేబు బీజపూరు గోలకొండలను జయించు దృష్టిమీద తక్కిన దేశరక్షణకు తగిన యేర్పాటులు చేయుకుండెను. అంతేఁగాక యింక నతఁడు మహారాష్ట్రుల తత్వమును గ్రహింపలేక నొక విధముగ వారియెడల నిర్లక్ష్యముగనే యుండెను.

బీజపూరుపై సంగ్రామము జరుపఁబడెను. సుల్తాను ఆజము సంవత్సరాంతమున గొప్ప సైన్యములో బయలుదేరి బీజపూరుఁ జేరెను. బీజపూరు ఉద్యోగ

స్థులు వెనుకటి పర్యాయ మెదిరించినను ఈ పర్యాయము వెనుకకు మరలిపోయిరి. ఇది వివేకములో చేసిన కార్యమైయున్నది. గడచిన సంవత్సరము వానలు లేక దేశము దుర్భిక్షమున నుండెను. పండిన కొద్ది ధాన్యమును కోటయందుఁ జేర్పఁబడియుండెను. సుల్తాను అజము సమీపించినతోడనే బీజపూరీయు లతని సైన్యమునకును షోలాపూరునకునుగల సంబంధము నడ్డగించివేసిరి. వారుసామగ్రులు నడ్డుకొట్టి, కృత్రిమ యుద్ధములచేతను, స్వల్ప కలహములచేత నతని సైన్యమును పీడింపఁజొచ్చిరి. షోలాపూరునందు సహితము ధాన్యము విస్తారముగ లేవు. ఔరంగబాదునుండి రావలసియుండెను ఇట్టి యవస్థలో నప్పుడు గాజీయుద్దీనును 20000 బళ్ల ధాన్యము నందఁ జేయింపవలెనని చక్రవర్తి యాజ్ఞయిచ్చెను. బీజపూరీయులు దాని నడ్డగింపఁ బ్రయత్నించిరిగాని యోడిపోయిరి. ఈ యదృష్టము వలన నాజముషా యవమానకరంబగు యోటమినుండి రక్షింపఁబడెను. ఈ సమయములో ఆజముషా భార్యయగు జేనీబీగము మగని పరాభవంబును రక్షించుటకును గాను ఏనుగుపై నెక్కి తానుస్వయముగ భటులను ప్రోత్సాహపెట్టెను.

అచ్చట ఖానుజహాను గోలకొండకు పోయెను. మాదన్న పంతులు యొక్క యేర్పాటు లెక్కువ బాగుగనుండెను. గోలకొండ సైన్యాధిపతి ఇబ్రహీముఖాను ~0,000 సైన్యముతో నెదుర్కొనెను. కాని యతఁడు రాజద్రోహి యగుటవలన ఖాను జహానుఁడు తన వశమునఁ జిక్కినప్పటికి నేమియుఁ జేయక యూరకుండెను. సుల్తాను మో అజము కూడ తరువాత ఖాను జహానునకు తోడువచ్చిన మీఁదట, యిబ్రహీము ఖానుయొక్క ద్రోహము మఱియు తేట తెల్లమాయెను. మోగలు సైన్యములు గోలకొండలోఁ బ్రవేశించెను. తానీషా మాదన్న పంతు లెంత చెప్పినను వినక గోలకొండ కోటలోనికిఁ బోయెను. ఇబ్రహీము శత్రువులం జేరెను. హైదరాబాదు కొల్లపెట్టఁబడెను. ఇట్టి మనోవిహ్వాల సమయమునం దెంత మంచి మంత్రియైన నయిష్టుఁడగును. మాదన్న పంతులుయొక్క విరోధులు, సుల్తాను అత్తగారి ప్రోత్సాహము వలననో, లేక మోగలు పక్షము వారి ప్రోత్సాహము వలననో, యీ గంద్రగోళ సమయమున నతనిని హత్యగావించిరి. అబూ హుస్సేను సుల్తాను, మంచి గుణవంతుఁడైనను,



గోళగుమ్మటము (బీజపూరు.) 200


మనోధైర్యము నాత్మనిశ్చయమును లేనివాఁడగుటవలనను, సలహా నిచ్చువా రెవ్వరును లేకపోవుట వలనను, తక్షణము సమాధానమునకు ప్రార్థించెను. ఔరంగజేబు, హైదరాబాదు యొక్క ధనబలములు తా ననుకొన్న దానికంటె సమృద్ధిగ నున్నందునను, బీజపూరు రింక చాలవర కెదిరింపఁబోవు ననియును, రెండుకోట్ల రూపాయి లిచ్చు షరతుమీఁద సమాధానమున కంగీకరించెను. ఖాను జహానును మో అజమును తగినంత కొల్లధనమును చక్రవర్తికిఁ జూపింపనందున నతఁడు వారిపై ననుమానపడి కినుక వహించెను.

చక్రవర్తి యప్పుడు బీజపూరునకై ప్రయాణమాయెను. బీజపూరు పట్టణమును కోటయును గలిసి యారు మైళ్ల ప్రాకారము గలిగియుండెను. సుల్తాను
1686 సికందరును వాని సేనాధిపతులును చాల నెలలు తమపరాను శౌర్యము నంతయుఁ జూపించుచు రక్షణఁ జేసికొనిరి. చిట్టచివరకు భోజన పదార్థములు లేకపోవుట వలన బీజపూరీయులు గాజీయుద్దీను ద్వారా సమాధానము చేసికొనిరి. సికందురు అలీ ఏదులశాహి ఖైదుజేయఁబడెను. ఆ ఖైదులోనే తరువాత నౌరంగజేబుచే చంపింపఁబడెనని చెప్పుదురు. తక్కిన యుద్యోగస్థులు మొగలు సేవలోనికిఁ దీసికొనఁబడిరి.

బీజపూరంతట నుండి రాజధానిగా హిందూదేశ చరిత్ర యం దంతరించినది. పూర్వ మహావైభవ శిథిలము లిప్పటికిని చూచువారిని విస్మయ మగ్నులఁ జేయును. చెక్కఁడు రాళ్లచే కట్టఁబడిన గోడ లున్నతములై సర్కారు కార్యస్థాన మందిరములయొక్క గోపుర గోళంబులను పైనఁ గలిగి యున్నందున నింకను జనసమ్మర్దముఁ గల పట్టణమువలె వెలుపలికిఁ గాన్పించును. కాని లోపల నిర్జనమును నిశ్శబ్దమును నాశనమును తాండవ మాడుచున్నవి. ఇప్పటికిని మహమ్మదు ఏదులశాహియొక్క గోరీయగు గోళగుమ్మటము చూడఁదగి యున్నది. ఈ గుమ్మట మే యలంకారములు లేనిదైనను విస్తారవైశాల్యమును కలిగి యున్నందువలన నా చుట్టుప్రక్కల నున్న జీర్ణభాగ్యంబుల కనురూపంబుగు వైధవ్యము నొందిన రాజ్యలక్ష్మివోలె శోకరసంబును వెలిఁ బుచ్చుచున్నది. దీనియొక్క మధ్యగోలత 130 అడుగులుండును. ఈ విధమైన కట్టడములలో నిది

ప్రపంచములో నెల్ల పెద్దది. రోములోని పాంథియను యొక్క గుమ్మటమును, లండనులోని సెంటుపాల్సు కెతీడ్రలుయొక్క గుమ్మటమును దీని తరువాతనే లెక్కకు వచ్చును. ఇదిగాక యింకను బీజపూరునందు ప్రసిద్ధ కట్టడములనేకములు చూడఁదగినవియున్నవి. పట్టణముయొక్క పడమటి ప్రాకారపు బాస్టియనులపై మల్లికి మైదాను (మైదానురాజు) అను పేరుగల పెద్ద ఫిరంగి యొకటి కలదు. ఇది అహమ్మదు నగరములో నిజాముశాహిచే పోతపోయిం చఁబడెనని దానిమీఁద వ్రాయఁబడి యున్నది. ఇది 14 అడుగుల 4 అం॥ పొడవు గలిగియుండెను. తలికోట యుద్ధములో నిది చాల హత్య చేసెనని చెప్పుదురు. ఇది నిజాము శాహినుండి బీజపూరు సుల్తానుచే జయింపఁబడినది. ఔరంగజేబు ముట్టడిలో కూడ నిది చాల హత్య గావించెనని చెప్పుదురు. కాని దీని నొకసారి తరువాత 1829 వ సం॥ ములో సతారా రాజు నాజ్ఞవలన కాల్పఁ బడెనుగాని దాని యద్భుత మేమియుఁ గనుపడలేదు. బీజపూరు పట్టణ మొక్క విశాలమైన మైదానముమీఁద కట్టఁబడినది. ఆకాలమునందు గొప్పగొప్ప ఫిరంగులు లేకపోవుటచేతనే యట్టి స్థల మెన్నుకొనఁ బడినది ఈ స్థలముననే బీజ పూరునకు పూర్వము భువనైకమల్లు (సోమేశ్వర II క్రీ. శ. 1075) డను పడమటి చాళుక్యవంశజుడగు రాజుచేఁగట్టింప బడిన దేవాలయము లుండుచు వచ్చె నని యచ్చటి శిలా శాసనముల వలనఁ దెలియవచ్చుచున్నది. ఆదేవాలయములయొక్క రాళ్లతోనే యీపట్టణము మొట్టమొదటఁ గట్టఁబడినది. ఈ బీజపూరైశ్వర్యకాలములో 10 లక్షల జనసంఖ్యఁ గలిగియుండెను. నాగరిక ప్రపంచమునం దంతను దాని భాగ్య సౌందర్యములు ప్రసిద్ధిఁ జెందెను. బెర్నియరు టెవర్నియ రను యాత్రాపరులు దాని స్తోత్రంబుల గానంబు నేసిరి. ఏదులశాహి సుల్తానులు షియాలు. వారి మతమందు మూర్ఖము తక్కువ. అందువలన వారు హిందువుల నెక్కువగ బాధించెడువారు కారు. అంతేఁగాక వారు హిందువులను గొప్ప యుద్యోగములందుఁగూడ నియమించు చుండెడువారు.

ఔరంగజేబు బీజపూరును వశము చేసికొనఁగనే తద్దేశము నంత నాక్రమించుటకు తగిన యేర్పాటులుచేసి, షిరాజీఖానును శంభాజీపైఁ బంపి, తన



గోలకొండ కోట.

దృష్టిని గోలకొండపై ప్రసరింపఁజేసెను. ఔరంగజేబు రాయబారులు, హైదరాబాదు సైన్యములను లంచములచేతను వాగ్దానములచేతనుఁ ద్రిప్పివేసిరి. రాయభారి సాదతుఖాను యొక్క బెదరింపులవలన తానీషా తన యంతఃపురకాంతల విలువగల యాభరణముల నన్నియు నొలిచి యిచ్చెను. ఎన్ని యిచ్చినను పుచ్చుకొని యౌరంగజేబు ఇంకను తెమ్మని వేధించుచుండెనే గాని యెప్పటికిని తృప్తిఁబొందువాఁడు కాఁడాయెను. ఔరంగజేబుకు కరుణ కలుగలేదు. అతఁడు తానీషా దుర్వ్యసనపరుండనియు, బ్రాహ్మణమంత్రినుంచుకొనెననియు, విగ్రహారాధకుఁడును కాఫరునగు శంభాజీతో సఖ్యము చేసికొనెననియు దోషారోపణలు చేసి, యుద్ధము ప్రకటించెను. సుల్తాను ప్రాణము విసిగి, చక్రవర్తియొక్క క్రూరత్వంబున కలిగి, తన సైన్యము లనేకములు పరిత్యజింప కొలదిమంది విశ్వాసము దప్పని భటులతోడను ఉద్యోగస్థులతోడను గోలకొండలోని కరిగి కడపరకును రక్షించుకొన సిద్ధుండయ్యెను. గోలకొండకోట యట్లు ఏడుమాసములు ధైర్యముతో రక్షించుకొని చివరకు స్వామి ద్రోహముచే సెప్టెంబరు 1687 వ సం॥ మున ఔరంగజేబు వశమాయెను. హైదరాబాదు బీజపూరుకంటె తక్కువ యైశ్వర్యముగలదియైనను, తరువాత దక్కను సుబేదారునకు రాజధానియై యిప్పటికిని పూర్వరాజ నివాసముయొక్క చిహ్నములు గలిగియున్నది. గోలకొండకోట నెక్కి చూచిన నాదిగువను కనుఁబడు కుతుబ్షాహి గోరీ లిండియాయందందమైన యాకారముల నిప్పటికినిఁ జూపుచున్నవి. ఈసమయముననే సుల్తాను మోఅజము తానీషాయెడల చక్రవర్తియొక్క కాఠిన్యమునుఁ గూర్చి ముచ్చటించినందున నిద్దఱకుఁగూడ కీడుసంభవించెను. తానీషా, *దౌలతాబాదు

* ఈ తానీషాను గూర్చి యొకకథ చెప్పఁబడుచున్నది. ఇండియామహమ్మదీయులయొక్క యాడంబర గౌరవలక్షణము నది తెలియఁజేయును. తానీషా దౌలతాబాదుకు పంపఁబడక పూర్వము ఔరంగజేబుయొక్క శిబిరమునందు ఖైదిగ నున్నపుడు చక్రవర్తి నగారాలో నొక హిందూస్థానీయుఁ డొకరాగమును బహుశ్రావ్యముగ పాడినమీఁద తానీషా దానికి మెచ్చి తన కొక లక్షరూపాయిలు వాని కియ్యవలెననియున్నదని ముచ్చటించెను. ఈసంగతి ఔరంగజేబు కెవరో చెప్పగనే యతఁడా కోరికను తత్క్షణము నెరవేర్చెను.

కోటకు ఖైదిగ బంపఁబడెను. అతఁడు ఖైదునందే యంతమువఱకును కాలముఁ గడపెను. భద్రాద్రిరామదాసును ఖైదుననుంచినందు కీయవస్థ పట్టినదని యాంధ్రదేశీయులు నమ్ముదురు. సుల్తాను మోఅజము, పైఁజెప్పిన సాహసమునకు తండ్రిచే నారు సంవత్సరములు ఖైదుచేయఁబడి తరువాత కాబూలునకు గవర్నరుగాఁ బంపఁబడెను.

తోడనే ఔరంగజేబు సేనాపతులు దేశమునంత నాక్రమించుకొన మొదలుపెట్టిరి. సగ్గరు ప్రముఖుఁడగు పెమ్మనాయకుని తండ్రియగు రామానీనాయకుఁడు చక్రవర్తికిలోఁబడి 5000 గుఱ్ఱపుదళమునకు సైన్యాధిపతిగ మొగలు రాజ్యంబులోనికిఁదీసికొనఁబడెను. బీజపూరు గోలకొండలకుఁ జేరిన ద్రవిడకర్ణాటకములును ఉత్తరసర్కారులును నేఁడు మొగలు ప్రభుత్వంబులోనికి వచ్చెను. మొగలురాజ్యము దక్షిణమునం దీవలకు నాలుగు సుభెలుగ నుండెను. బీజపూరు గోలకొండలు కలిసి యిప్పుడు ఆరుసుభేలయ్యెను ఈసుభేలను జిల్లాలక్రింద భాగించి యొక్కొక జిల్లాకు ఒకఫౌజుదారును ఒక ఖాల్సాదివానును ఔరంగజేబు నియమించెను. ఫౌజుదారు సైన్యాధిపతిగ నుండెడివాడు. దివాను సివిలు వ్యవహారములనుఁ జూచుచుండెడివాఁడు. ఇద్దఱునుగలిసి జిల్లాను దేశముఖులకు గుత్తకిచ్చుచుండెడువారు. దివాను, వారి దగ్గరనుండి శిస్తు రాఁబట్టుకొనుచుండెడివాఁడు.

ఔరంగజేబుయొక్క విజయ మిట్లు వ్యాపించుచుండగ శంభాజీయొక్క మాంద్యము కవికులేశుని మంత్రప్రయోగముచేతనని మహారాష్ట్ర గ్రంథకర్తలు చెప్పుదురు. కాని దుర్వ్యసనంబులందుఁ జిక్కుకొని బుద్ధిఁబోఁగొట్టుకొనుటయే దీనికి కారణము. ఇట్టి యాపత్కాలంబున సహాయముచేయఁగల సమర్థులు చాలమంది యున్నను, కవికులేశుని యనూయవలనను శంభాజీయొక్క దురాగ్రహంబువలన, నేమియుఁ జేయఁజాలక యూరకుండిరి.

ఔరంగజేబుచే బీజపూరునుండి పంపఁబడిన షిరాజీఖానుఁడు, వాయీవలకు పోయి యచ్చట హంబీరురావుచే నోడింపఁబడెను. హంబీరురావు యుద్ధమునందు గాయపడి మృతుండైనను, మహారాష్ట్రులు మాత్రము జయమును వ్యర్థ

ముగఁ బోనియ్యక బీజపూరువైపున చాలదేశము నాక్రమించుకొనిరి. మహారాష్ట్రీయుల సైన్యభాగములు గోలకొండ ముట్టడిసమయమున కొంత యుద్ధముఁ జేసినను బలముగఁ బనిఁజేసి యుండలేదు.

శంభాజీ మొగలు సైన్యముయొక్క దృష్టిని భేదించుటకు కేశవపంతు పింగళేను, శాంతాజీ ఘోరేపురేను సైన్యముతో కర్ణాటకమునకుఁ బంపెను. కాని యా సైన్యము జింజీకోట చేరగనే, కేశవపంతుకును అన్నకుమారుడగు నీలాపంతుకును కొన్ని మనస్పర్థలు కలిగి వారేమియుఁ జేయఁజాలకపోయిరి. కాని సైన్యమురాక నెరిఁగి వెంకాజీ తన తండ్రిరాజ్యమును కాపాడుకొనలేనని భయపడి మైసూరురాజాయగు చిక్కదేవరాజునకు బెంగుళూరు నమ్మఁజూపెను. ఈ యమ్మకము జరుగకమునుపే మహారాష్ట్రులును మొగలులును గూడ దానిని సంపాదింప నుద్దేశించిరి. మహారాష్ట్రులు జింజీయందు తమ వివాదములతో కొంత యాలస్యమును చేసిరి. ఇంతలో మొగలు సేనాపతి కసింఖాను బెంగుళూరును పట్టుకొని మైసూరురాజునకు మూడు లక్షలకు దాని నమ్మివేసెను. కాని కేశవపంతుయు శాంతాజీ ఘోరేపురేయును తరువాత వచ్చి మైసూరు నాక్రమించుకొని యా యమ్మకము వ్యర్థమగునట్లు చేసిరి. కాని మొగలులు గోలకొండను జయించి కర్ణాటకమునకువచ్చుచున్నారని తెలియగనే మహారాష్ట్రులందఱును వెనుకకు మరలి పాలేరు కిరుప్రక్కలనున్న కోటలలోనికి శరణుజొచ్చిరి.

వెంకాజీయొక్క జౌస్కోట యను కర్ణాటకములో నింకొక భాగము మైసూరు రాజువలన జయింపఁబడెను. శంభాజీ సైన్యసహాయమున్నయెడల నది పోకుండెడిదే. కర్ణాటకమందు మహారాష్ట్రుల యధికారము పలుచనగుచుండెను. మహారాష్ట్రమునందు వారిబలము కేవల రాజ్యసంబంధమైనదే యైయుండినయెడల ఔరంగజేబుయొక్క విజయము నిశ్చయమయ్యెడిదే. కాని వారి శక్తి దోపిడి వ్యాపారంబునందు ప్రబలెను. ఒక యంగనిర్మాణరాజ్యమున కధికారిగ శంభాజీయొక్క యుపాధు లిందువలన తగ్గిపోయెను గాని, తక్కిన విషయములం దవి బలాధికమయ్యెను.

శంభాజీ రాజ్యమునందు కట్టుదిట్టములు తగ్గిపోవుట వలనను, బీజపూరు గోలకొండలు జీర్ణమగుటవలనను, మహారాష్ట్రులును మహమ్మదీయు లందఱును

గుఱ్ఱమును బల్లెమును సంపాదింపఁగలిగిన ప్రతివాఁడును విచ్చలవిడిగ బయలుదేరి దోపిడి వ్యాపారముఁ జేయసాగెను. కాని యిది కేవలము దోపిడి వ్యాపార సాహసమే యైనయెడల ఔరంగజేబు తన దగ్గిరనున్న గొప్ప బలంబులతో నిమిషములో నణఁగఁగొట్టెడివాఁడే. కాని శివాజీయొక్క విజయంబుల యెడల వారికున్న గర్వంబును, కోటల దాఢ్యమునందలి విశ్వాసమును, మహారాష్ట్ర నాయకుల శౌర్య సాహసంబులును, స్వతంత్రము యెడల వారికున్న యాసక్తియు, జజియాపన్ను యెడల వారికున్న ద్వేషభావమును, బ్రాహ్మణుల యొక్క శక్తి సామర్థ్యములు నింక మహారాష్ట్రులయందు శివాజీకాలమునందు ప్రబలిన సుగుణంబు లన్నియునుఁ గలిసి ఔరంగజేబుయొక్క పరిపాలనాపద్ధతుల కలవి కానివై యుండెను.

శంభాజీ, వ్యవహారములను బొత్తుగ మఱచి ప్రవర్తించుచుండెను. అతఁడు పన్హాలా విశాలగడలకు మధ్య కాలక్షేపము చేయుచుండెను. అతఁడు తరచుగ సంగమేశ్వరు గ్రామములో నొకవనమునందు మత్తెక్కి యొడలు మఱచి కాలయాపన చేయుచుండెను. ఈ మద పిచ్చికాలమున నొక్కొకమారు గోవాను జయింప నాలోచించుచుండును. వ్యవహారమంతయు కవికులేశుని వశమందుండెను. అతఁడును యజమానుని సంతోషంబుల ననునయ పర్చుటయందే ప్రొద్దు పుచ్చుచుండెను. తన తెలివి తేటలవలన ననేకవిధముల నుపయుక్తుఁడైన సుల్తాను మహమ్మదు అక్బరతనియవస్థ కసహ్యపడి, బీజపూరు చక్రవర్తికి లోఁబడిన తోడనే యిఁక యిండియా యందున్న ముప్పేగాని లాభములేదని యెంచి, శంభాజీని వీడ్కొని, రాజాపురము యొద్ద నొక యోడనుఁ దీసికొని, పరిషియా దర్బారునకుఁ బోయి యచ్చట 20 సంవత్సరములుండి 1706 లో చనిపోయెను.

ఔరంగజేబునకు ధనబలంబులు పూర్ణముగ నుండెను. దేశముయొక్క స్థితిగతులతో పరిచయమును చక్కగ నుండెను. తన వెనుక జయించినవారితో సమానముగ, వారసత్వపు హక్కులను తీసివేయుటకును స్థిరపరచుటకును కావలసినంత యధికారమును కలిగియుండెను. బిరుదులు,మన్సబులు, జాగీరులు, జారీ

గా నియ్యఁబడెను: కాని యహంభావత్వమును, అనుమానమును, మూర్ఖ విశ్వాసమును, అతని యనుకూలములనెల్ల పాడుచేసెను ఈ దోపిడివ్యాపారముయొక్క స్వభావము నతఁడు గ్రహింపలేదు. దానిని స్థిరపడిన పరిపాలనాధికారముల వలన తగ్గిణ మణచివేయక ఆదివఱకున్న అధికారప్రతిష్ఠాపనల నూడఁబెరికి వాని స్థానమున నే యధికారములను నిర్మింపలేదు. తనే యుద్ధములు కాగానే తన కవసరము లేనట్టియు, తాను భరింపలేనట్టియు భటులను వదలి వేసి తన కెదురుగఁ బోరాడు సేనలను తానే కల్పించుకొనినవాఁడాయెను. క్రొత్తగ జయింపఁబడిన దేశమునందు కావలసిన యేర్పాటుల వివరమంతయు తనకే తెలియునని తలంచుటయేఁ గాక వాని నన్నిటిని తానే స్వయముగ కనుఁగొన సమర్థుఁడనని యహంకరించెను. తన యేజంటులయందు విశ్వాస ముంపఁజాలడు. అన్ని యుద్యోగములందును మహమ్మదీయులనే నియమించి హిందువుల యొక్క సహాయమును బొత్తుగఁ బోఁగొట్టుకొనెను ఇందువలన జనించిన యల్లరి, చక్రవర్తియొక్క యహం భావిత ప్రజ్ఞవలనఁ గాని, ఆయన సభాజనఁబుల స్తోత్రపాఠంబులవలనఁ గాని సవరింపఁ బడఁజాలదు. మహారాష్ట్రులు, అందు ముఖ్యముగ బ్రాహ్మణులు, మహమ్మదీయులవలె పట్టి యాడంబరములకు భ్రమఁజెందువారు కారు. వారు త్వరలోనే మొగలుల యొక్క ఛిద్రంబునఁ గని పెట్టఁగలిగిరి.

డాల్ఫే, ఘార్గే, మనే, నింబాల్కారు, మొదలైన బలాధికులగు మంకూరీలు,* బీజపూరు ముట్టడి జరిగినపుడు, పట్టణము లోఁబడువఱకును, చుట్టుప్రక్కలఁ దిరుగాడుచు మొగలు సైన్యమును బాధించుచునే వచ్చిరి. అటు పిమ్మట వారు తమ జాగీరులు చేరి, వకీళ్ల చేతగాని, లేక తాము ఒక్కొకప్పుడు స్వయముగ వచ్చిగాని, వినయ విధేయతలఁ దెలుపుచు వచ్చిరి. కాని యీ కాలమునుండి వారు తమదేశీయుల దోపిడి మూకలతోఁ జేరుటగాని, మొగ

* మంకూరీ అనగా గొప్పవాడు అని పదార్థము. దక్కను మహమ్మదీయులక్రింద మొట్టమొదటలో మన్సబుదారుగా నున్న మహారాష్ట్రులు మంకూరీలని పిలువఁబడెడు వారు. తరువాత నెంత కొంచెపు అశ్వసైన్యము కలవాఁడును మంకూరీ యని పిలుచుకొనుచుండెను.

ులకు లోఁబడుటఁగాని సమయానుకూలముగఁ జేయుచుండెడివారు. ఈ మంకూరీలయొక్కయు, శంభాజీయొక్కయు దోపిడి మూకలు తప్ప వేఱుమూకలంతగా దేశమునందు లేవు. ఏలనన, ఫౌజుదారు సైన్యము వాని నణచివేయుటకు చాలియుండెను. పిండారీ* మూకలు కొన్ని బీడరు ప్రాంతమునఁ గనబడెను కాని యవి త్వరలోనే యణఁచివేయఁబడెను. అట్లణచి వేయఁబడగా మిగిలిన పిండారీలు మహారాష్ట్రులతో కలసిపోయిరి. ఇట్టి వారికేమియు జీతములులేవు. ఎవరైన నొకప్రముఖుఁడైన మహారాష్ట్రుఁడు వారిని దగ్గరకు చేరఁదీసి వారివద్దర నజరులనుఁ బుచ్చుకొనుచు, వారికి సహాయకారి యగుచుండెడువాఁడు.

మంకూరీలు, తమ రాయభారులను, చక్రవర్తి శిబిరమునందుంచి 'అలంగీరు ఔరంగజేబునకు సంతత భక్తి విధేయత' లను తెలియఁజేయుచు, తమ మూకలను మొగలు జిల్లాలను దోచుటకు రహస్యముగ పంపించుచుండెడివారు. ఈసంగతి దర్బారున తెలిసిన యెడల వారివారి బ్రాహ్మణవకీళ్లు దర్బారులో పెద్ద యుద్యోగస్థుల నెవ్వరినో లంచముచే వశముచేసికొని వారి ద్వారా తమ యజమానుల యనుచరులయొక్క దుండగమున కేవో క్షమాపణలఁజెప్పుటకు సంసిద్ధులుగ నుండెడివారు. మొగలు ఫౌజుదారులు మహారాష్ట్రముఖ్యులు భక్తితో నుండెద మనినచో వారితో సమాధానముగ నుండవలసినదని యాజ్ఞాపింపఁబడిరి. ప్రముఖులు ఫౌజుదారులతో తంత్రాంగము చేయుచుండెడివారు. వారి వకీళ్లు దర్బారులో తంత్రాంగము చేయుచుండెడివారు. వారి స్వగ్రామములు భద్రముగ నుండెడివి. వారి యనుచరులు దేశములో నింకొక భాగమును కొల్లఁబెట్టుచుండెడివారు.

---

* మహారాష్ట్రకర్ణాటక సరిహద్దులలో పిండారీలని యొకజాతివారు కలరు. నిరుపద్రవకాలములో వారు వ్యవసాయమున జీవింతురు. దేశ మరాజకముగ నున్నపుడు దోపిడిచే జీవింతురు. వారనేక సంవత్సరములనుండి యచ్చటనున్నారు. వారిలో ననేకులు హిందూస్థానీ భాష మాట్లాడుచు, రాజపుత్రుల మని చెప్పుకొందురు.

దక్కనులో జాగీరులియ్యఁబడిన మొగలు ఉద్యోగస్థులు తమజిల్లాలలో శిస్తునేమియు వసూలుచేసికొనలేక పోయిరి. ఇందువలన దరిద్రపీడితులై లంచగొండితనమునకుఁ జొరఁబడిరి. కావున నీ దోషిడిగాండ్రు ముందు ఫౌజుదారులకు లంచమిచ్చి వారిజిల్లాలలో యీ దోషిడి ధనములో కొంత భాగమును మొగలు జాగీరుదారులకుఁగూడ నిచ్చి వారిని శాంతపఱచుచుండెడివారు.

మహారాష్ట్రీలో వతనుల వారసత్వమునుఁగూర్చి యనేక తగవులుండెడివి. ఉభయపార్టీల బ్రాహ్మణవకీళ్లును దర్బారునందు వాదించి యనేకచిక్కులు పెట్టి తీర్పు నందకుండఁ జేసెడువారు. ఇందువలన సరియైన హక్కుదారులు, తమ సైన్యములతోఁ బోయి దోపిడి మూకలను జేరెడివారు. వారు తరువాత బలవంతముగ దర్బారు నెదుటకుఁ దెప్పింపఁబడినపుడు తమకు జరిగిన యన్యాయమున నిట్లు ప్రవర్తించితి మని బహిరంగముగఁ జెప్పుచుండెడివారు.

ఏదైన వారసత్వపు ఉద్యోగము కాళీయైనపుడు, మొగలులు $6\frac{1}{2}$ రెట్లు సంవత్సరపు రాఁబడికి దాని నిచ్చెదువారు. ఇదిగాక గుమాస్తాలవలన ననేక మామూళ్లు, ప్రతిక్రొత్త పర్యాయము మార్పుజరిగినపుడును, పూర్ణముగ వసూలు చేయఁబడుచుండెడివి. ఇందువలన నుద్యోగ మొకరి దగ్గరనుండి తీసివేయఁబడి మరల నింకొకక్రొత్తవాని కియ్యఁబడుటకు ప్రోత్సాహ మెక్కువయ్యెను. చక్రవర్తి ముసలివాఁడై, వ్యవహారముయొక్క స్వల్ప విషయములకంటె, నెక్కువ తాపత్రయమున మునింగియుండెను. ఆయనమంత్రులును, గుమాస్తాలును, లంచగొండులై యశ్రద్ధలోఁబడి కాగితములును దస్తావేజులును తయారైన పిదప ననేక వత్సరముల వఱకు వాని నమలులోఁ బెట్టెడివారు కారు. ఈయంశములు కొన్ని ముందు రాఁబోవు ఔరంగజేబు వ్యవహారములకుఁగూడ వర్తించును. ఇది బీజపూరు గోలకొండలు లోఁబడిన తరువాత 12 సంవత్సరముల వఱకును జరిగిన చర్యలయొక్క యదార్థస్వరూపము. ఆ సమయము నాటికి పైఁజెప్పిన కారణము లన్నియు, మొగలులను పడఁగొట్టెను. మఱిబాగుపడుట కసాధ్యమును, మఱికొన్ని ఋతుప్రదక్షిణంబులలో నేల సదనగు నట్టి పురాతన మహాభవనంబువోలె మొగలు ప్రభుత్వము జీర్ణావస్థం జేరెను.